thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 84 | కరీంనగర్ మంగళవారం, 3 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సుఖోయ్ చక్రాలపై జగన్నాథుడు

### కోల్‌కతాలోని ఆలయ రథానికి యుద్ధ విమానం టైర్లు

కోల్‌కతా : కోల్‌కతాలోని జగన్నాథ ఆలయ రథానికి సుఖోయ్ యుద్ధ విమానం కోసం తయారు చేసిన టైర్లను వాడనున్నారు. ఈ నెల 27న కోల్‌కతాలో జరిగే జగన్నాథ రథయాత్ర కోసం రథాన్ని సరికొత్తగా సిద్ధం చేశారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత జగన్నాథ రథానికి బోయింగ్ విమానం టైర్ల స్థానంలో సుఖోయ్ కోసం తయారు చేసిన టైర్లు వచ్చాయి. ఇంతకు ముందు బోయింగ్ 747 విమానం టైర్లను రథానికి వాడేవారు. టైర్లను మార్చాలని 2005లో రథయాత్ర నిర్వాహక సంస్థ ఇస్కాన్ నిర్ణయించింది. కొత్త చక్రాల కోసం 20 ఏళ్లు అన్వేషించామని ఇస్కాన్ (కోల్‌కతా) ఉపాధ్యక్షుడు రాధారామ్ దాస్ వెల్లడించారు.




జనగామ జిల్లా పాలకుర్తిలో మీడియా సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.. ధరణి-భూభారతి కి నాగలోకానికి నక్కకు ఉన్న తేడా ఉందని.. భూ భారతి తో రెవెన్యూ సమస్యల పరిష్కారం దిశగా నడుస్తున్నామని అన్నారు.రేపటి ( జూన్ 3 ) నుంచి గ్రామాల్లోకే అధికారులు వస్తారని.. అధికారులే అప్లికేషన్లు కూడా ఇస్తారని.. ఒక్క రూపాయి కూడా చెల్లించొద్దని అన్నారు పొంగులేటి. గ్రామాల్లో భూ సమస్యలు లేకుండా చేస్తామని.. గ్రామాల్లోనే భూసమస్యలు

## ఆగస్టు 15 నాటికే భూసమస్యలే లేకుండా చేస్తాం: పొంగులేటి

పరిష్కరిస్తామని అన్నారు. ఆగస్టు 15 నాటికి భూసమస్యలు లేకుండా చర్యలు చేపడతామని అన్నారు. రాష్ట్రంలో అన్ని మండలలకు ట్రైనింగ్ ఇచ్చిన సర్వేయార్ల తో సర్వే జరుగుతుందని.. వెయ్యి మందికి తగ్గకుండా ప్రభుత్వ సర్వేయర్లు ఉంటారని అన్నారు పొంగులేటి .ప్రతి సోమవారం ఏ మేరకు నిర్మాణమైన ఇందిరమ్మ ఇళ్లు బిల్లు ప్రభుత్వం ఇస్తుందని.. ఇళ్లు రాలేదని ఎవరు ఆందోళన నిరుత్సాహపడవద్దు.. నిరంతరంగా ఇండ్లు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. నిరుపేదైన ప్రతి ఒకరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని.. రాజీవ్ యువ వికాసంకు ఎవరు ఊహించని విధంగా అప్లికేషన్లు వచ్చాయని అన్నారు. రాజీవ్ యువ వికాసంలో అక్రమాలు జరగవద్దని కొంత ఆలస్యం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో సచ్చిన పాములు తోక జడిచ్చే పనులు చేస్తే ఈ ప్రభుత్వంలో సాగవని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ సంఘాలతో రెండు మూడు పర్యాయాలు ఇంతకుముందే చర్చించచామని.. జూన్ 5న జరిగే క్యాబినెట్ సమావేశం లో ఈ సబ్జెక్టు కూడా ఉంటుందని అన్నారు



## బీఆర్ఎస్ కు బిగ్ షాకిచ్చిన కవిత.. రాష్ట్ర అవతరణ వేడుకల సాక్షిగా..

తాను రాసిన లేఖ బయటకు వచ్చిన నాటి నుంచి ఎమ్మెల్సీ కవిత రోజు రోజుకూ దూకుడు పెంచుతున్నారు. కేసీఆర్ కు జై అంటూనే బీఆర్ఎస్ పార్టీకి మాత్రం ఆమె దూరం జరుగుతున్నారు. ఈ రోజు తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత జాతీయ జెండాతో పాటు జాగృతి జెండాను ఆవిష్కరించారు.

**కొత్త పార్టీకి సంకేతమా?...** వేడుకల అనంతరం జై తెలంగాణ, జై జాగృతి, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేసిన కవిత బీఆర్ఎస్ పార్టీ పేరు మాత్రం ఎత్తలేదు. దీంతో కావాలనే ఆమె బీఆర్ఎస్ పార్టీ పేరు పలకలేదన్న చర్చ సాగుతోంది. ఆ పార్టీకి గుడ్ బై చెప్పి.. కొత్త పార్టీ పెట్టేందుకు కవిత సిద్ధమవుతున్నారన్న వార్తలకు ఇది సంకేతమన్న విశ్లేషణలు సైతం వినిపిస్తున్నాయి.

# ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం...

## పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన వ్యవస్థలను చక్కదిద్దుతున్నాం

## తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ అజెండా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాము బాధ్యతలు చేపట్టేనాటికి ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని చెప్పారు. పదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన వ్యవస్థలను చక్కదిద్దుతున్నామన్నారు.

ఇప్పుడిప్పుడే కోలుకుటున్నామన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

**మహిళలకు క్యూఆర్ కోడ్.. ఉచితంగా వైద్యపరీక్షలు...** "తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మహిళలు మూలస్తంభాలు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వారికి రూ.21వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చాం. పాఠశాలల నిర్వహణ మహిళలకే అప్పగించాం. రుణాలిచ్చి బస్సులు కొనుగోలు చేయించాం.

మహిళా సంఘాల బస్సులను ఆర్టీసీకి అద్దెకు తీసుకుని వాళ్లకి ఆదాయం కల్పిస్తున్నాం. క్యూఆర్ కోడ్ కార్డు ఇచ్చి మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయించే పథకాన్ని తీసుకొస్తాం.

**ఏడాదిలోపే రుణమాఫీ చేశాం...** రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రూ.2లక్షలలోపు రుణాలను మాఫీ చేశాం.

ఆ పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.26వేల కోట్లు జమ చేశాం. సన్నవడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం. దీనివల్ల రాష్ట్రంలో సన్నవడ్ల సాగు గణనీయంగా పెరిగింది. ఇవాళ రూ.2.75 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం ఉత్పత్తి అవుతోంది. రైతుల భూములపై వివాదాలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం. అందుకే భూభారతి తీసుకొస్తున్నాం.

**తెలంగాణ విప్లవాత్మక నిర్ణయంతో కేంద్రంలో కదలిక...** ఉద్యోగ నియామకాల్లో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తూ వారి విశ్వాసాన్ని పొందాం.

సివిల్స్‌కు ఎంపికైన వారికి ప్రోత్సాహకంగా రూ.లక్ష అందజేస్తున్నాం. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. గురుకుల విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో ఉండాలనేది మా ప్రభుత్వ ఉద్దేశం. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. రూ.200 కోట్లతో ఆయా చోట్ల భవన నిర్మాణాలు చేపట్టాం. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాన్ని ప్రక్షాళన చేశాం. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాం. ఉస్మానియా ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకొస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10లక్షలకు పెంచాం. వందేళ్లలో జరగని కులగణను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. ఈ విప్లవాత్మక నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోనూ కదలిక వచ్చింది. వచ్చే జనగణనలో కులగణన కూడా చేర్చుతామని కేంద్రం ప్రకటించింది" అని సీఎం వివరించారు.

**9 మంది ఉద్యమకారులకు నగదు బహుమతి అందజేసిన సీఎం...** తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన తొమ్మిది మందికి రూ.కోటి నగదును సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. ఉద్యమ సమయంలో ప్రజల గుండెల్లో నిలిచిన కవులు, కళాకారులు సాహితీవేత్తలకు నగదు పురస్కారం అందిస్తామని తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సమయంలో సీఎం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎక్కా యాదగిరిరావు, అందెశ్రీ, సుద్దాల అశోక్‌తేజ, జయరాజు, పాశం యాదగిరికి నగదు పురస్కారాన్ని అందించారు. దివంగత గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి తరపున వారి కుటుంబసభ్యులు అందుకున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న గోరటి వెంకన్న తరపున ఆయన కుమార్తె పురస్కారాన్ని స్వీకరించారు.

# మరోసారి కరోనా పంజా..

## వేలల్లో కేసులు నమోదు




భారతదేశంలో మరోసారి కోవిడ్ - 19 మహమ్మారి కలకలం రేపుతోంది. దేశంలో కోవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ప్రస్తుతం దేశంలో 3,758 కోవిడ్ యాక్టివ్ కేసులు ఉన్నట్టుగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూన్ 1వ తేదీన వెల్లడించిన డేటా ప్రకారం దేశంలో గడిచిన 24 గంటల్లో కోవిడ్ యాక్టివ్ కేసులు సంఖ్య 363 పెరిగింది. నిన్న కోవిడ్ నుంచి 383 మంది కోలుకున్నారు. అలాగే గత 24 గంటల్లో ఇద్దరు కరోనాతో మృతిచెందారు. వీరిలో ఒకరు కర్ణాటకకు చెందినవారు కాగా, మరొకరు కేరళకు చెందిన వ్యక్తి. అయితే ఈ ఇద్దరికి కూడా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. తాజాగా మృతులతో దేశంలో ఈ ఏడాది కోవిడ్‌తో మరణించిన వారి సంఖ్య 28కి చేరింది. దేశంలో ప్రస్తుత యాక్టివ్ కేసులలో అత్యధికంగా కేరళలో 1,400 కేసులు, ఆ తర్వాత మహారాష్ట్రలో 485, ఢిల్లీలో 436, గుజరాత్‌లో 320, కర్ణాటకలో 238, తమిళనాడులో 199, పశ్చిమ బెంగాల్‌లో 287, ఉత్తరప్రదేశ్ 149, కేసులు ఉన్నాయి. ఇదిలా ఉంటే, తెలుగు రాష్ట్రాల్లో కూడా కోవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఏపీలో గత 24 గంటల్లో కొత్తగా ఆరు కోవిడ్ కేసు నమోదు కాగా... రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 23కు చేరింది. తెలంగాణలో ప్రస్తుతం మూడు కోవిడ్ యాక్టివ్ కేసులు ఉన్నాయి. అయితే, దేశంలో కోవిడ్ కేసులు స్వల్పంగానే నమోదయ్యాయని... భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహ్లా సోమవారం రోజున మాట్లాడుతూ... పశ్చిమ, దక్షిణ ప్రాంతాలలో నమూనాల జీనోయ్ సీక్వెన్సింగ్‌ను పరిశీలించినప్పుడు, ప్రస్తుత కేసుల పెరుగుదలకు కారణమైన వైవిధ్యాలు తీవ్రమైనవి కాదని, అవి ఓమిక్రాన్ ఉప-వేరియంట్‌లేనని తేలిందని అన్నారు.

ప్రస్తుత కోవిడ్ కేసులలో ఓమిక్రాన్ నాలుగు ఉపవేరియంట్‌లు... ఎల్ఎఫ్.7, ఎక్స్ఎఫ్జీ, జేఎన్.1, ఎన్‌బీ.1.8.1 గుర్తించినట్టుగా చెప్పారు. అయితే ఎక్కువ కేసులలో ఎల్ఎఫ్.7, ఎక్స్ఎఫ్జీ, జేఎన్.1 వేరియంట్లు కనుగొనబడ్డాయని ఆయన చెప్పారు.

**ముఖ్యంగా ప్రభావితమవుతున్న రాష్ట్రాలు:** వైద్యాధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కరోనా కేసులు అధికంగా పెరుగుతున్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాలు అత్యంత ప్రభావితం అవుతున్నాయి. కేరళ: 189 కొత్త కేసులు, మొత్తం యాక్టివ్ కేసులు - 1,336, మహారాష్ట్ర: 467 యాక్టివ్ కేసులు, ఢిల్లీ: 375 యాక్టివ్ కేసులు, గుజరాత్: 265 యాక్టివ్ కేసులు, కర్ణాటక: 234 యాక్టివ్ కేసులు, పశ్చిమ బెంగాల్: 205 యాక్టివ్ కేసులు, తమిళనాడు: 185 యాక్టివ్ కేసులు, ఉత్తరప్రదేశ్: 117 యాక్టివ్ కేసులు, ఇతర రాష్ట్రాలు: రాజస్థాన్ (60), పుదుచ్చేరి (41), హర్యానా (26), ఆంధ్రప్రదేశ్ (17), మధ్యప్రదేశ్ (16) లలోనూ కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ తెలిపింది.

**మరణాలు, కొత్త వేరియంట్లు:** శుక్రవారం నుండి శనివారం మధ్యలో దేశవ్యాప్తంగా 685 కొత్త కేసులు నమోదు కాగా, నాలుగు మరణాలు సంభవించాయి. 2024 సంవత్సరంలో ఇప్పటివరకు 26 మంది కరోనా వల్ల మరణించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తెలిపిన ప్రకారం, వెస్ట్, సౌత్ ఇండియాలో సేకరించిన నమూనాల జీనోమ్ సీక్వెన్సింగ్‌లో కొత్త వేరియంట్లు బయటపడ్డాయి. ఇవన్నీ ఒమిక్రాన్ ఉప-వేరియంట్లే అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎల్ఎఫ్ 7, ఎక్స్ ఎఫ్ జీ, జేఎన్.వన్, ఎన్ బీ.వన్.బి.వన్ అనే వేరియంట్లు ఎక్కువగా వ్యాపిస్తున్నట్లు గుర్తించారు.

చురకలు

మంగళవారం 3 జూన్ 2025




హైదరాబాద్ : సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జపాన్ ప్రతినిధుల బృందం హాజరైంది. ఈ సందర్భంగా పోలీసులకు ఉత్తమ సేవా పతకాలను సీఎం ప్రదానం చేయనున్నారు. అంతకుముందు తెలంగాణన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ ట్వీట్ చేశారు.

'ఆహార్యంలో ఆత్మగౌరవం.. ఆ రూపంలో నిండుదనం.. తెలంగాణ తల్లికి.. సదా సర్వదా నీరాజనం' అని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి గీతాన్ని ఆయన పంచుకున్నారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచేలా భవిష్యత్ ప్రణాళికలు: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర సాధన పోరాటంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకున్నారు. "తెలంగాణను ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్నారు. 11 ఏళ్లు పూర్తయి 12వ ఏడాదిలోకి అడుగుపెట్టాం. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్ నినాదం ఇచ్చాం. ఆర్థిక వృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది. రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా భవిష్యత్ ప్రణాళికలు తీర్చిదిద్దుతున్నాం" అని సీఎం తెలిపారు.

**హైదరాబాద్-కితాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీకి ప్రయత్నిస్తున్నాం:** కితాక్యూషు నగరం ఎకో-టౌన్ మోడల్‌తో చాలా ప్రేరణ పొందినట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జపాన్‌లోని కితాక్యూషు సిటీ మేయర్ కజుహిసా, జపాన్ బృందంతో ఐటీసీ కాకతీయలో సీఎం సమావేశమయ్యారు. తెలంగాణ, కితాక్యూషు పరస్పర సహకార ఒప్పందంపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ప్రపంచ భాగస్వామ్యంతో రాష్ట్ర పురోగతిని ముందుకు తీసుకెళుతున్నాం. కితాక్యూషు నగర అభివృద్ధి తెలంగాణ రైజింగ్‌కు సరిపోయేలా ఉంది. తెలంగాణ-కితాక్యూషు సహకార ఒప్పందం జరగడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం మూసీ నది అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టుపై మా దృష్టి ఉంది. రాష్ట్ర యువతకు నైపుణ్య కల్పించడం మా ప్రాధాన్యత. హైదరాబాద్-కితాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీకి ప్రయత్నిస్తున్నాం " అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.




హైదరాబాద్: ఎంతో మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 'తెలంగాణ ఉద్యమం అహింసా పద్ధతిలో సాగింది. ఉద్యమంలో భాజపా కీలక పాత్ర పోషించింది. తెలంగాణకు అనుకూలమని అందరికంటే ముందు నిర్ణయం తీసుకున్న పార్టీ మాది. తెలంగాణ వచ్చాక నీళ్ల పేరుతో నిధుల దోపిడీ జరిగింది. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత భావించింది. కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయి కానీ.. యువతకు రాలేదు. ఏ ఆకాంక్షల కోసం ప్రజలు పోరాడారో గత పదేళ్లలో అవి నెరవేరలేదు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ ఇవాళ రూ.10 లక్షల కోట్ల అప్పుల్లోకి వెళ్లింది" అని కిషన్‌రెడ్డి అన్నారు.




హైదరాబాద్ : కాళేశ్వరం కమిషన్ ముందుకు విచారణకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు మాజీ సీఎం కేసీఆర్. జూన్ 5న హాజరు కావాలని కమిషన్ నోటీసులు పంపిన విషయం తెలసిందే. అయితే విచారణకు హాజరు కావడానికి సమయం కావాలని కమిషన్ ను కోరారు కేసీఆర్. జూన్ 11న హాజరవుతానని, అంత వరకు సమయం ఇవ్వాలని కోరారు. మరోవైపు కాళేశ్వరం కమిషన్ ముందుకు మాజీ మంత్రి హరీష్ రావు జూన్ 9న హాజరుకానున్నారు. ఆయన ఇరేగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపణలు రావడంతో నోటీసులు జారీ చేసింది కమిషన్. అయితే ఈ నోటీసులపై వివరణ ఇవ్వనున్నారు మాజీ మంత్రి హరీష్ రావు. హరీష్ రావు 9న హాజరైన తర్వాత 11న హాజరుకావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. హరీష్ ను ఎలాంటి ప్రశ్నలు అడగనున్నారో తెలుసుకుని అధ్యయనం చేసి వెళ్లాలని భావిస్తున్నారు. ఇప్పటికే కమిషన్ ముందు హాజరు కావలని నిర్ణయించుకున్న కేసీర్.. ప్రాజెక్టు ప్రారంభం నుంచి పూర్తైనంత వరకు అన్ని వివరాలపై అధ్యయనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఎర్రవల్లి ఫామ్ హౌజ్ లో కేసీఆర్ ను కేటీఆర్, హరీష్ రావు ఇటీవలే వరుసగా కలిసి చర్చించారు. అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావుతో సుదీర్ఘ మంతనాలు జరిపారు కేసీఆర్. ప్రాజెక్టు వివరాలు, కమిషన్ అడిగే ప్రశ్నలు మొదలైన కీలక అంశాలపై ఈ మధ్యే చర్చించారు. హరీష్ రావు కమిషన్ ముందు హాజరయ్యాక మరోసారి కేసీఆర్ ఆయనను కలవనున్నారు. కమిషన్ అడిగిన ప్రశ్నలు, విచారణ జరుగుతున్న విధానాన్ని ఇద్దరు చర్చించనున్నారు. ఆ తర్వాత 11వ తేదీని కమిషన్ ముందుకు వెళ్లాని భావిస్తున్నారు మాజీ సీఎం కేసీఆర్.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం.. తెలుగులో ప్రధాని మోడీ స్పెషల్ ట్వీట్



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రజలకు స్పెషల్ విషెస్ చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు.

'తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. జాతీయ పురోగతికి అవిరళమైన కృషి చేసినందుకు ఈ రాష్ట్రం ప్రసిద్ధి చెందింది. గత దశాబ్దంలో, రాష్ట్ర ప్రజల 'జీవన సౌలభ్యాన్ని' పెంచడానికి NDA సర్కార్ అనేక చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రజలకు విజయాలు, సంపదలు కలిగేలా ఆశీర్వాదాలు లభించాలని కోరుకుంటున్నా' అంటూ ప్రధాని ట్వీట్ చేశారు.

**తెలంగాణ ప్రజలు సంమృద్ధి మార్గంలో సాగాలి.. రాష్ట్రపతి ముర్ము...** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము '%శ%' వేదిక ట్వీట్ చేశారు. 'తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు..! ఈ యువ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధి యొక్క శక్తివంతమైన ఆధునిక పరిణామాన్ని కలిగి ఉంది. తెలంగాణ ప్రజలు పురోగతి మరియు సమృద్ధి మార్గంలో ముందుకు సాగాలని నేను కోరుకుంటున్నా' అంటూ ప్రెసిడెంట్ ద్రౌపది తెలంగాణ ప్రజలకు విషెస్ చెప్పారు.

# తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలుగా వేరైనా తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటే. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే తన ఆకాంక్ష అని ఆయన ట్వీట్ చేశారు. "తెలుగు రాష్ట్రాలుగా వేరైనా తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటే. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే నా ఆలోచన, ఆకాంక్ష. 11వ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తెలంగాణ ప్రజలకు నా శుభాకాంక్షలు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని, అభివృద్ధి పథంలో సాగాలని కోరుకుంటున్నాను. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడుతూ వికసిత్ భారత్-2047 నాటికి అగ్రస్థానానికి చేరుకోవాలని, తెలుగు జాతి తిరుగులేని శక్తిగా నిలవాలని.. ఇందులో



ప్రతి తెలుగు పౌరుడు భాగస్వామి కావాలని ఆకాంక్షిస్తున్నాను" అని చంద్రబాబు తన 'ఎక్స్' పోస్టులో రాసుకొచ్చారు.





అమరావతి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. తనలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల తెలంగాణ అని పేర్కొన్నారు.

'జనసేన పార్టీకి జన్మనిచ్చిన నేల.. నాకు పునర్జన్మను ఇచ్చిన నేల.. నాలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నేల.. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్య కీర్తించిన నేల నా తెలంగాణ. మూడున్నర కోట్ల ప్రజల ఆశలు, ఆకాంక్షలతో పాటు దశాబ్దాల పోరాటాలకు ప్రతిరూపంగా విద్యార్థులు, యువత బలిదానాలతో ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ.

రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుంటున్నాను" అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

# ఏపీలో అద్భుతంగా అభివృద్ధి.. తెలంగాణ వెలవెల: ఎంపీ ఈటల రాజేందర్




హైదరాబాద్: తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ అణచివేసిందని.. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మూడు తరాల ఉద్యమంలో అసువులు బాసిన విద్యార్థులకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ మలిదశ ఉద్యమంలో అన్ని పార్టీలూ ఏకమై సంఘటితంగా పోరాటం చేశాయి. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు భాజపా అన్ని విధాలుగా సహకరించింది. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో నిరంకుశ పాలన చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా అమరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. భారాస పేరు చెప్పి కాంగ్రెస్ తప్పించుకుంది. తెలంగాణ కంటే ఏపీ జీడీపీ, ఆదాయం తక్కువ. ఏపీ అద్భుతంగా అభివృద్ధి చెందుతుంటే తెలంగాణ వెలవెలబోతోంది.

సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లి ప్రధానిని పెద్దన్న అంటారు.. గల్లీకి వచ్చి విమర్శిస్తారు. తెలంగాణ ప్రజల ఆశలను భారాస, కాంగ్రెస్ కల్లలు చేశాయి. ఇక్కడ భాజపా అధికారంలోకి రావడం ఖాయం.. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించడం తథ్యం. భారాస నేత హరీశ్‌రావు, నేను ఎందుకు కలుస్తాం? ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? భారాస హయాంలోని ఒక్క అవినీతి, అక్రమాలపైనైనా చర్యలు తీసుకున్నారా?" అని ఈటల ప్రశ్నించారు.

# భారాసకు ఎవరితోనూ పొత్తు ఉండదు.. ఒంటరిగానే అధికారంలోకి: హరీశ్‌రావు

హైదరాబాద్: అభివృద్ధిలో కేసీఆర్.. అబద్ధాల్లో సీఎం రేవంత్‌రెడ్డి అగ్రగామి అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు రూ.21కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు సీఎం చెప్పారని.. దాన్ని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టు కట్టారా? ఒక్క చెరువు తవ్వారా?రైతుబంధు, రైతుబీమా ఎగ్గొట్టారు.. రుణమాఫీ కొంతే చేశారు" అని విమర్శించారు. "భాజపాలో భారాస కలుస్తుందని కొందరు మాట్లాడుతున్నారు. భారాస ఎవరితోనూ పొత్తు పెట్టుకోదు.. ఒంటరిగానే అధికారంలోకి వస్తుంది. కేసీఆర్ మొన్ననే కుండబద్ధలు కొట్టి చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా భారాసకు 100 సీట్లు ఖాయం. గోదావరి-బనకచర్లపై భాజపా నేతలు ఎందుకు మాట్లాడట్లేదు? అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి గోదావరి-బనకచర్లను అడ్డుకుంటాం. అతి చేస్తున్న అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో రాసుకుని



గుణపాఠం చెప్తాం. అందాల పోటీలు నిర్వహించడం చేతగాక రాష్ట్రం పరువు తీశారు. మిస్ ఇంగ్లండ్ చేసిన ఆరోపణలపై సీసీ ఫుటేజీ బయటపెట్టాలి" అని హరీశ్‌రావు అన్నారు.




హైదరాబాద్ : గ్రేటర్‌లో మూడు నెలల రేషన్ పంపిణీ మొదలైంది. ఈసారి వర్షాలు ఎక్కువగా ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకే నెలలో అందించే విధంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈసారి సన్న బియ్యంతో పాటు మూడు నెలలకు సరిపడా గోధుమలు, చక్కెర కూడా పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 30 తేదీ వరకు రేషన్ ఇవ్వనున్నామని, డీలర్లు నెల మొత్తంలో మూడుసార్లు బయోమెట్రిక్ తీసుకుని సన్న బియ్యం ఇస్తారని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరిచి ఉంటాయన్నారు. ఈసారి మూడు నెలలకు సంబంధించిన రేషన్?ను ఒకేసారి ఇస్తున్నందున మూడు సార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి ఉంటుందని, అందుకని, ఒక్కో రోజు గ్యాప్ ఇచ్చి సరుకులు తీసుకోవాలని కోరారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించడానికి రేషన్ దుకాణాల వద్ద తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో బ్యానర్లు ఏర్పాటు చేశామని, సాఫ్ట్‌వేర్ అప్డేట్ లోపం కారణంగా ఆలస్యమైతే సంయమనం పాటించాలని సికింద్రాబాద్ సహాయ పౌరసరఫరాల శాఖాధికారి ఏఆర్ కృష్ణవేణి కోరారు.

**ఆరున్నర లక్షల కార్డులు..** జంటనగరాల్లోని 6,47,282 ఆహార భద్రతా కార్డులు ఉండగా, 24,24,824 మంది లబ్ధిదారులున్నారు. జూన్ నెలకు గాను 45,259.677 వేల మెట్రిక్‌టన్నుల సన్న బియ్యం, 9,709.230 మెట్రిక్ టన్నుల గోధుమలు, 88.695 మెట్రిక్?టన్నుల చెక్కర కేటాయించామని రమేశ్‌చెప్పారు. ఆహార భద్రత కార్డుదారులైతే ఒక్కో వ్యక్తికి 6 కిలోలు అంటే మూడు నెలలకు 18 కిలోల బియ్యం, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోలు అంటే మూడు నెలలకు 105 కిలోల బియ్యం ఇస్తున్నామన్నారు. అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున 30 కిలోలు అందజేస్తున్నామన్నారు.

**ఈపాస్ రసీదులు ఇస్తున్నాం...** మూడు నెలల రేషన్ బియ్యంతో పాటు ఈసారి ప్రతి కార్డుదారుడికి మూడు నెలలకు గాను గోధుమలు, చక్కెర కూడా ఇస్తున్నాం. 5 కిలోల చొప్పున 15 కిలోల గోధుమలు రూ.7కు కిలో చొప్పున , 3 కిలోల చక్కెర 13.50 రూపాయలకు అందజేస్తున్నాం. కార్డుదారులందరికీ పంపిణీ టైంలో ఈపాస్‌రసీదులు మూడు నెలలకు విడిగా ఇస్తున్నాం. **– రమేశ్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి**




## 'నన్ను చంపి.. ఇక్కడే పాతిపెట్టండి'.. అధికారం కోల్పోయే ముందు హసీనా

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనలతో నాటి ప్రధాని షేక్ హసీనా దేశం వీడిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆమె భారత్‌లో తలదాచుకుంటున్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌కు చెందిన అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ ఆమెతోపాటు పలువురు మాజీ మంత్రులు, సలహాదారులు, మిలటరీ అధికారులపై అరెస్టు వారెంట్‌లు జారీ చేసింది. తాజాగా ఈ కేసులో విచారణ సందర్భంగా చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం ట్రైబ్యునల్‌కు కీలక విషయాలు వెల్లడించారు. దేశంలో అల్లర్లు తీవ్రమవ్వడంతో గతేడాది ఆగస్టు 4వ తేదీన సైనికాధికారులు హసీనా నివాసానికి వెళ్లి ఆమెను రాజీనామా చేయాల్సిందిగా కోరినట్లు ఇస్లాం పేర్కొన్నారు.

అయితే అప్పటి అధికార అవామీ లీగ్ పార్టీకి చెందిన పలువురు అగ్ర నాయకులు దీనిని వ్యతిరేకించినట్లు తెలిపారు. ప్రధాని పదవి నుంచి వైదొలగాలని పార్లమెంట్ స్పీకర్ షిరిన్ షర్మిన్ చౌదరి సైతం ఆమెకు సూచించినట్లు చెప్పారు. అయినప్పటికీ దేశాన్ని వీడాలనే సూచనను హసీనా అంగీకరించలేదన్నారు. పారిపోవడం కంటే తనను అక్కడే కాల్చి చంపేయమని.. గణబంధన్‌లోనే పాతి పెట్టమని సైనికాధికారులను కోరినట్లు తెలిపారు. ఇష్టం లేకపోయినా.. అధికారుల ఒత్తిడి మేరకు తప్పని పరిస్థితుల్లో ఆమె దేశం వీడారని ట్రైబ్యునల్‌కు తెలిపారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 5న షేక్ హసీనా స్వదేశాన్ని వీడి భారత్‌కు చేరుకొన్నారు. మరోవైపు ఆమెపై 100కు పైగా కేసులున్నాయి. ఇప్పటికే ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రైబ్యునల్ ఆమెపై అరెస్టు వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే హసీనాను తమకు అప్పగించాలంటూ యూనస్ నేతృత్వంలోని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం పలుమార్లు భారతకు దౌత్య సందేశాలు పంపింది.




## విద్యార్థి వీసా ఇంటర్వ్యూలకు బ్రేక్.. ఏంటీ సోషల్ మీడియా వెట్టింగ్..?

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన విధానాలతో గందరగోళంలో ఉన్న విద్యార్థులకు ఇప్పుడు మరో దిగులు పట్టుకుంది. అదే సోషల్ మీడియా వెట్టింగ్..! విదేశీ విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాల తనిఖీపై అగ్రరాజ్యం మరింత దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా..

లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. దీనిపై ప్రస్తుతం అమెరికా సన్నాహాలు చేపట్టింది. అప్పటివరకు విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను నిలిపివేశారు.

**ఎలా చేస్తారు..?...** దీనిపై అమెరికా విదేశాంగ శాఖ ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. అయితే, ఉగ్రవాదులను నియంత్రించడం, యూదు వ్యతిరేకతను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ తనిఖీ చేయనున్నట్లు అగ్రరాజ్యం వెల్లడించింది. ఉదాహరణకు.. ఎవరైనా విద్యార్థి తమ సామాజిక మాధ్యమ ఖాతాలో పాలస్తీనా జెండాను పోస్ట్ చేసినట్లయితే ఆ వ్యక్తిని మరింత క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వారి వల్ల దేశ భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని నిర్ధరించుకున్న తర్వాతే వారిని అమెరికా విద్యాసంస్థల్లో చదువుకునేందుకు అనుమతినిస్తారు. అప్పుడే వారికి విద్యార్థి వీసా లభిస్తుంది. గతంలో కొంతమంది విద్యార్థులు, ప్రొఫెసర్ల సోషల్ మీడియా ఖాతాలను తనిఖీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో బ్రౌన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. రాషా అలావీ ఫోన్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ ఫొటోలను గుర్తించారు. అనంతరం ఆమె ఆన్‌లైన్ యాక్టివిటీని పరిశీలించి దేశ బహిష్కరణ వేటు వేశారు. గతేడాది అమెరికా విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో పాలస్తీనా మద్దతుదారుల ఆందోళనలు పెద్ద ఎత్తున జరిగిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ట్రంప్ సర్కారు విదేశీ విద్యార్థులపై కన్నెర్ర చేసింది. ఈ క్రమంలోనే పలు కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇటీవల హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి విదేశీ విద్యార్థుల రికార్డులను కూడా కోరింది. తాజాగా వీసా ఇంటర్వ్యూల సమయంలోనే 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తీసుకురానుంది. దీనివల్ల విద్యార్థి వీసా ప్రాసెసింగ్‌పై పెను ప్రభావం పడటంతో పాటు అమెరికా యూనివర్సిటీలపై ఆర్థికంగానూ భారం పడనుంది. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫారిన్ స్టూడెంట్ అడ్వైజర్ నివేదిక ప్రకారం.. విదేశీ విద్యార్థుల నమోదుతో అమెరికా వర్సిటీలకు ఏటా 43.8 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతోంది. ఇదిలా ఉండగా.. ఇప్పటికే బుక్ చేసుకొన్న విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు ప్రణాళిక ప్రకారం కొనసాగనున్నాయి.




వాషింగ్టన్: భవిష్యత్తులో అమెరికా గగనతలంలోకి ఏ క్షిపణీ ప్రవేశించకుండా, ఏ అణ్వాయుధమూ సమీపించకుండా 'గోల్డెన్ డోమ్' అనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థ నిర్మించేందుకు అగ్రరాజ్యం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టులో చేరేందుకు పొరుగు దేశమైన కెనడా కూడా ఆసక్తి కనబర్చింది. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. మరోసారి విలీన డిమాండ్‌ను లేవనెత్తారు. తమ దేశంలో 51వ రాష్ట్రంగా కెనడా చేరితే.. గోల్డెన్ డోమ్‌ను ఉచితంగా పొందొచ్చని వ్యాఖ్యానించారు. లేదంటే 61 బిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. "అద్భుతమైన గోల్డెన్ డోమ్ వ్యవస్థలో కెనడా భాగం కావాలని నేను కోరుకుంటున్నా. ఇదే విషయాన్ని దేశానికి చెప్పా. అయితే విడిగా ఉంటూ ఈ వ్యవస్థలో చేరాలంటే కెనడాకు 61 బిలియన్ డాలర్ల మేర ఖర్చవుతుంది. అదే అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరితే.. ఒక్క డాలర్ కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ ఆఫర్‌ను వారు పరిగణనలోకి తీసుకుంటారని అనుకుంటున్నా" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై కెనడా నుంచి ఇంకా స్పందన రాలేదు.

ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' తరహాలో అమెరికా కోసం 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఈ వ్యవస్థ నిర్మాణానికి 175 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 15 లక్షల కోట్లు) ఖర్చవుతుందని పేర్కొన్నారు. దీంతో అమెరికా ఇక అంతరిక్షంలోనూ ఆయుధాలను మోహరించనుంది. 2029 చివరి నాటికి ఈ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామని ఆయన వెల్లడించారు. ఈ ప్రకటన తర్వాత కెనడా ప్రధాని మార్క్ కార్నీ స్పందిస్తూ.. తాము కూడా ఈ వ్యవస్థలో చేరేందుకు సిద్ధమేనని అన్నారు.

ఇందుకోసం అగ్రరాజ్యంతో ఉన్నత స్థాయి చర్చలు జరుపుతామన్నారు. ఈ క్రమంలోనే తాజాగా ట్రంప్ దీనిపై పోస్ట్ చేయడం గమనార్హం. కాగా.. అమెరికా అధ్యక్ష ఎన్నికల నాటి నుంచే కెనడా 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని కెనడా సర్కారు ఖండిస్తూ వస్తోంది. తమ దేశం అమ్మకానికి లేదంటూ గట్టిగా చెప్పింది. ఈ క్రమంలోనే అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగు దేశంపై ట్రంప్ సుంకాలతో విరుచుకుపడ్డారు. ప్రతిగా కెనడా కూడా టారిఫ్‌లు విధించింది.

## ఆ ఊరిలో ఎవరూ అబద్ధాలు చెప్పరు.. దొంగతనాలు చేయరు!



ఈ ఆధునిక ప్రపంచంలో నీతి, నిజాయితీ, నమ్మకం అనే పదాలు కేవలం డిక్షనరీలకే పరిమితమయ్యాయి. కానీ, నమ్మశక్యం కాని విధంగా మన భారతదేశంలోనే ఓ అద్భుతమైన గ్రామం ఉంది. అక్కడి ప్రజలు నిజాయితీనే తమ జీవన విధానంగా పాటిస్తారు. నాగాలాండ్ రాజధాని కోహిమాకు పశ్చిమాన 20 కిలోమీటర్ల దూరంలో భారత్-మయన్మార్ సరిహద్దులో ఉన్న ఆ గ్రామమే "ఖోనోమా". ఈ గ్రామం ప్రత్యేకత ఏమిటంటే ఆ ఊరిలో ఎవరూ అబద్ధాలు చెప్పరు, దొంగతనాలు చేయరు, ఇళ్లకు తాళాలు వేయరు, దుకాణాలను కూడా నడపరు. ఈ విలక్షణమైన గ్రామానికి మొత్తం 154 ప్రత్యేకతలు ఉన్నాయి. వీటిని వారు "కెన్యు" రూల్స్ అని పిలుస్తారు. ఒకవేళ ఎవరైనా కెన్యు రూల్స్ పాటించకపోతే దేవుడు వారి పనిపడతాడని గ్రామస్తులు బలంగా నమ్ముతారు. అందుకే ఖోనోమా గ్రామం దేశంలోనే "అత్యంత నిజాయితీ గల గ్రామంగా" ప్రసిద్ధి చెందింది. ఈ గ్రామంలోని ప్రజలందరూ అంగమి తెగకు చెందినవారు. ఇది నాగాలాండ్‌లోని ఒక ముఖ్యమైన గిరిజన సమూహం, వీరిని అంగమి నాగా అని పిలుస్తారు.

**అంగమి తెగ సంప్రదాయాలు**... గోల్వో వీరి ప్రధాన ఆహారం. గోల్వో అనేది అన్నం, హిమాలయన్ చిమాటి కూర మిశ్రమం. వీరు కూరగాయలు, పంది మాంసం, గొడ్డు మాంసం కూడా తింటారు. వీరిలో దాదాపు అందరూ క్రైస్తవ మతాన్ని పాటిస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం, ఖోనోమా జనాభా సుమారు 2,000. ఇక్కడ పురుషుల కంటే స్త్రీల జనాభా పది రెట్లు ఎక్కువగా ఉంది. ఈ గ్రామం ప్రకృతి ఒడిలో పచ్చదనంతో, మంచుతో కప్పబడి, ప్రకృతి తనకోసం ఒక ఇల్లు నిర్మించుకున్నట్లు ఉంటుంది.

**మోసానికి తావు లేదు...** నాగాలాండ్‌లోని చాలా గ్రామాలు ఖోనోమా వాతావరణాన్ని కలిగి ఉన్నప్పటికీ, "కెన్యు" రూల్స్ ప్రకారం జీవించడం వల్లనే ఖోనోమా దేశంలో ఒక నిజాయితీ గల గ్రామంగా ప్రసిద్ధి చెందింది. ఖోనోమాను "యోధుల గ్రామం" గా కూడా పిలుస్తారు. వీరు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా వీరోచిత పోరాట చరిత్రను కలిగి ఉన్నారు. ఖోనోమా ప్రజల మధ్య నిజాయితీ కేవలం ఒక నైతిక గుణం మాత్రమే కాదు, అది వారి సామాజిక, సాంప్రదాయ శక్తి కూడా. నిజాయితీ పట్ల వారి నిబద్ధత తెగలో ధనిక, పేదల మధ్య అసమానతలను తొలగించింది. ఆ గ్రామంలో దొంగతనం అనే మాటే లేదు.

**దైవభక్తితో కూడిన నిజాయితీ....** దొంగతనం అనేది దేవునికి వ్యతిరేకంగా మనిషి చేసే పాపమని ఖోనోమా ప్రజలు గట్టిగా నమ్ముతారు. ఖోనోమాలోని దుకాణాలలో వినియోగదారులు తమకు కావలసిన వస్తువులను తీసుకుని, డబ్బును అక్కడే వదిలివేస్తారు. డబ్బు సేకరించడానికి, లెక్కించడానికి ఎవరూ ఉండరు. ఖోనోమా గ్రామంలో ఈ నమ్మకం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. అంతేకాదు, ఒక రైతు పండిన పంటను ఇంటికి తీసుకెళ్లేటప్పుడు అలసిపోతే, దానిని రోడ్డు పక్కన వదిలేసి మరుసటి రోజు వచ్చి తీసుకుంటాడు. అప్పటివరకు పంట రోడ్డు పక్కనే సురక్షితంగా ఉంటుంది. ఎవరైనా తీసుకెళ్తారనే భయం ఉండదు. నిజాయితీ వారి మత విశ్వాసాలలో భాగం. 19వ శతాబ్దంలో ఇక్కడ క్రైస్తవ మతం విస్తరించడానికి ముందు కూడా ఖోనోమాలోని ఈ అంగమి ప్రజలు 'ఆనిమిజం' అన్న భావనను నమ్మేవారు. ఈ నమ్మకం నేటికీ కొనసాగుతోంది. ఆనిమిజం అంటే సృష్టిలోని ప్రతి జీవి, వస్తువు, ప్రదేశానికి ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక సారం ఉంటుందని నమ్మకం. ఈ నమ్మకం కేవలం మతపరమైనది కాదు. ఆనిమిజం ఆచారాలు, సంప్రదాయాలు, పర్యావరణానికి అనుకూలమైన జీవనశైలి మీద ఆధారపడి ఉంటుంది. వీటిలో అంగమి పూర్వీకులు స్థాపించిన 154 నియమాలు కెన్యుగా పిలుస్తారు. పిల్లి మాంసాన్ని దొంగిలించి తినడం కూడా కెన్యు. ఖోనోమా ప్రజలు ఇలా చేస్తే పిల్లి శాపం తగులుతుందని నమ్ముతారు. ఇది దత్తత తీసుకున్న పిల్లలను తినడానికి చంపడం వంటి సంఘటనల నుండి పుట్టింది. లంచం తీసుకోవడం, తమ కోసం పనిచేసిన వారికి సగం జీతం ఇవ్వడం, అత్తగారిని అవమానించడం, గుమ్మడికాయపై వేలు పెట్టడం ఇవన్నీ కెన్యు. ఖోనోమా ప్రజలు ఈ ప్రతి రకమైన తప్పుకు వేర్వేరు ప్రతికూల పరిణామాలు ఉంటాయని నమ్ముతారు. మీరు గుమ్మడికాయపై వేలు పెడితే అది కుళ్ళిపోతుందని, అత్తగారిని అవమానిస్తే పక్షవాతం వస్తుందని, తమ కోసం పనిచేసిన వారికి సగం జీతం ఇస్తే, దేవుడు తమకు నిర్ణయించిన ఆశీర్వాదం వారికి లభిస్తుందని ఖోనోమా గ్రామంలోని అంగమి ప్రజలు బలంగా నమ్ముతారు. అందుకే నిజాయితీ,సత్యం వారిలో లోతుగా పాతుకుపోయాయి. 2005లో, భారత ప్రభుత్వం ఖోనోమాను "దేశంలో మొట్టమొదటి హరిత గ్రామం"గా ప్రకటించింది. గ్రామంలో "ఖువునో" అనే చిన్న మొక్క పుష్కలంగా పెరగడం వల్ల గ్రామానికి ఖోనోమా అనే పేరు వచ్చింది.

## స్టీల్ పై సుంకం రెట్టింపు.. భారత్ పై ట్రంప్ నిర్ణయం ఎఫెక్ట్ ఎంతంటే?

ప్రపంచదేశాలపై సుంకాలతో విరుచుకుపడుతున్న ట్రంప్.. భారత్ పై సుమారు 26% సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. దీనిపై ఒక ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరుదేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఈ సమయంలో స్పందించిన ట్రంప్.. భారత్ తో వాణిజ్య ఒప్పందం కుదిరే సమయం ఆసన్నమైందని అన్నారు. ఆ సంగతి అలా ఉంటే.. తాజాగా ఉక్కుపై సుంకాలు రెట్టింపు చేశారు. అవును... తాజాగా ఉక్కు రంగంపై సుంకాల దెబ్బ కొట్టారు ట్రంప్! ఇందులో భాగంగా... అమెరికా దిగుమతి సుంకాన్ని 25 నుంచి 50 శాతానికి పెంచారు. ఈ కొత్త నిర్ణయం అమెరికన్ ఉక్కుకు కొత్త బలాన్ని ఇస్తుందని ట్రంప్ నమ్ముతున్నారని అంటున్నారు. తాజాగా ఈ విషయంపై మాట్లాడిన ఆయన.. సుంకాల పెంపు నిర్ణయం దేశీయ ఉక్కు వ్యాపారాన్ని పెంచుతుందని అన్నారు. ఇదే సమయంలో.. ఈ కొత్త టారిఫ్ లు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయని అంటున్నారు. ఇదే సమయంలో.. అల్యూమినియం సుంకం కూడా ఇదే విధంగా పెరగనుందని అంటున్నారు. నివేదికల ప్రకారం.. మార్చి నెలలో చైనాలో మెట్రిక్ టన్ను ఉక్కు ధర %392, యూరప్ లో %వి%690 ఉండగా.. అమెరికాలో %వి%984గా ఉంది. ఇలా ఉ



క్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలను రెట్టింపు చేయాలన్న అమెరికా అధ్యక్షుడి నిర్ణయం భారతదేశ 4.56 బిలియన్ డాలర్ల విలువైన లోహ ఎగుమతులపై ప్రభావం చూపనుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీ.టీ.ఆర్.ఐ) నివేదిక వెల్లడించింది. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ %వి%4.56 బిలియన్ల విలువైన ఉక్కు, ఇనుము, అల్యూమినియం ఉత్పత్తులకు యూఎస్ కు ఎగుమతి చేసింది. ఇందులో ఇనుము, ఉక్కుతో చేసిన వస్తువులు 587.5 మిలియన్ డాలర్లు కాగా.. ఇనుము లేదా ఉక్కుతో తయారు చేసినవి 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో.. అల్యూమినియం, దాని సంబంధిత వస్తువులు 860 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

ఈ క్రమంలో.. సుంకాలు రెట్టింపు చేయడంతో.. భారతదేశం మార్కెట్ లో కొనసాగడం సవాలుగా మారవచ్చని అంటున్నారు! కాగా... ఇప్పటికే అమెరికా, భారత్ మధ్య మొదటి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్.. అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ తో సమావేశమయ్యారు. ఈ క్రమంలో.. ఈ ఏడాది సెప్టెంబర్ - అక్టోబర్ నాటికి తొలి దశ అగ్రిమెంట్ ఖరారు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది.

## ఆ దేశంలో వారానికి 4 రోజులే పని.. ఇండియాలోనూ మొదలైన డిమాండ్

ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకతపై చర్చ జరుగుతున్న తరుణంలో జర్మనీ నుంచి ఒక ఆస0క్తికరమైన వార్త వెలుగులోకి వచ్చింది. అక్కడ దాదాపు 70 శాతం కంపెనీలు వారానికి నాలుగు రోజులు మాత్రమే పనిచేసే కొత్త విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఇది కేవలం ఒక ప్రయోగం కాదు.. ఈ విధానం ద్వారా కంపెనీలు ఊహించని విజయాలను సాధించాయి. వారానికి నాలుగు రోజుల పని విధానం వల్ల తమ ఉద్యోగుల్లో ఉత్పాదకత (%ూతీశీ-ఎబఌఱఙఱ్‌వ%) గణనీయంగా పెరిగిందని, నిర్దేశించిన డెడ్‌లైన్‌ల కంటే ముందే పనులు పూర్తవుతున్నాయని అధిక సంఖ్యలో కంపెనీలు గుర్తించాయి. ఉద్యోగులకు ఎక్కువ విశ్రాంతి లభించడం వల్ల వారి




మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడి, పనిలో మరింత చురుకుగా పాల్గొంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.

దీంతో జర్మనీలోని అన్ని కంపెనీల్లో వారానికి 4 పనిదినాలను అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇది ఉద్యోగుల పని-జీవిత సమతుల్యతను మెరుగుపరుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**భారత్‌లోనూ డిమాండ్...** జర్మనీలో ఈ విధానం విజయవంతం కావడంతో, ఇప్పుడు భారతదేశంలో కూడా వారానికి 4 పనిదినాలను అమలు చేయాలనే డిమాండ్ ఊపందుకుంది. దేశంలోని పలు రంగాలకు చెందిన ఉద్యోగులు, నిపుణులు ఈ కొత్త విధానం గురించి చర్చించడం మొదలుపెట్టారు. ఇది ఉద్యోగులకు మేలు చేయడమే కాకుండా, కంపెనీలకు కూడా దీర్ఘకాలంలో లాభదాయకంగా ఉంటుందని వారు వాదిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు, కంపెనీలు ఈ 'నాలుగు రోజుల పని వారం' విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాయి. జర్మనీ విజయం ఇతర దేశాలకు కూడా ఈ విధానాన్ని అమలు చేయడానికి స్ఫూర్తినిస్తుంది. భవిష్యత్తులో మన దేశంలో కూడా ఉద్యోగులు వారానికి నాలుగు రోజులు మాత్రమే పనిచేసే రోజు వస్తుందేమో చూడాలి.

# చురకలు

## సంపాదకీయం

# 'మిస్ వరల్డ్'.. ఎలా మొదలైంది? ఎందుకంత క్రేజ్?!

మిస్ వరల్డ్.. ప్రపంచ సుందరి పోటీలు ముగిశాయి. తొలిసారి తెలంగాణ రాజధాని భాగ్యనగరం ఈ వేడుకలకు ఆతిథ్యమిచ్చింది. మొత్తంగా 108 దేశాలకు చెందిన 40 మంది సుందరీమణులు ఈ పోటీల్లో ఆద్యంతం ఉత్సాహంగా పాల్గొన్నారు. అనేక పర్యాటక ప్రాంతాలను, సుందరమైన ప్రదేశాలను కూడా కలియ దిరిగారు. మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా అనేక టెస్టులను కూడా ఎదుర్కొ న్నారు. మొత్తంగా నెల రోజులపాటు అత్యంత వైభవంగా.. అందంగా.. ఆడంబరంగా జరిగిన ఈ పోటీల్లో థాయ్‌లాండ్ సుందరి కిరీటం దక్కించుకుంది. అయితే.. అసలు ఈ మిస్ వరల్డ్ పోటీలు ఎలా మొదలయ్యాయి? ఎప్పుడు మొదలయ్యాయి? అనేది ఆసక్తికరం. అది 1951, బ్రిటన్ రాజధాని లండన్. ఓ రోజు "ఫెస్టివల్ ఆఫ్ బ్రిటన్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. యువతులకు స్విమ్ సూట్ పోటీ నిర్వహించారు. దీనిలో ఒకరు విజేత అయ్యారు. ఆమె తర్వాత.. కాలంలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇలా.. మొదలైన ఈ పోటీ.. అనతి కాలంలోనే వివిధ దేశాలకు చెందిన సుందరీ మణులు పోటీ చేయడం ప్రారంభించారు. తొలి నాళ్లలో ఈ పోటీలను బ్రిటన్‌లోనే నిర్వహించేవారు. అయితే.. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన ఆదరణతో.. దీనికి ఒక పేరు ఉండాలని భావించిన నిర్వాహకులు.. మిస్ వరల్డ్ అని నిర్ణయించారు. ఇక, అప్పటి నుంచి ఈ పోటీలను వివిధ దేశాల్లో నిర్వహిస్తున్నారు. అయితే.. ఇప్పటికీ ఎక్కువ సార్లు నిర్వహించిన దేశంగా బ్రిటన్ పేరు చిరస్థాయిగా నిలిచింది. వాస్తవానికి ఈ పోటీని మొదట ఒకే ఒక ఈవెంట్ అనుకున్నప్పటికీ, ఎక్కువ మంది పాల్గొనడం, భారీగా స్పందన రావడంతో ఏటా నిర్వహించేందుకు నిర్ణయించారు. ఇక, 1951లో జరిగిన మొదటి పోటీలో మిస్ స్వీడన్ కికి హాకాన్సన్ మిస్ వరల్డ్ (అప్పటికి ఈ టైటిల్ లేదు) గెలిచింది. మిస్ వరల్డ్ పోటీల్లో కిరీటం దక్కించుకునే వారిని పక్కన పెడితే.. అసలు ఈ పోటీలకు ప్రారంభ ఘట్టం నుంచే అనేక పరీక్షలు ఎదురవుతాయి. ప్రతి దేశం నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసే ఈ పోటీలో .. ముందుగా ఆయా దేశాల్లోనే అంతర్గతంగా పోటీలు పెడతారు. వేలాది మంది వీటికి పోటీ పడతారు. వారి నుంచి ఆయా దేశాలు ఒక్కరిని ఎంపిక చేయడం ఎంత కష్టమో ఆలోచించుకోవచ్చు. ఉదాహరణకు భారత్ నుంచి ఈ దఫా నందినీ గుప్తా.. మిస్ వరల్డ్‌లో పాల్గొన్నారు. కానీ, ఆమె ఒక్కరే కాదు.. వందల మందిని ముందుగానే భారత్‌లో పరీక్షించి.. చివరకు నందినీ గుప్తాను ఎంపిక చేశారు. ఇలానే.. ఆయా దేశాల్లో చేస్తారు. వయసు 27 సంవత్సరాలకు ఒక్క సెకను కాలం కూడా మించకూడదు. భౌతిక అందంతోపాటు.. మానసిక అందాన్ని ప్రధానంగా చూస్తారు. అంతేకాదు.. ఎత్తు 5.2 అడుగులకు వెంట్రుక వాసి కూడా తగ్గకూడదు. అంతేకాదు.. ఆమె గతంలో ప్రేమలోనూ పడకూడదని ఒక నిబంధన ఉంది. వర్జిన్ అయి ఉండాలి(టెస్టు చేస్తారు). అంతేకాదు.. ఒంటిపై ఎక్కడా మచ్చలు మరకలు ఉండడానికి వీల్లేదు. నాజూగ్గా ఉండడమేకాదు.. ప్రపంచ జ్ఞానం కూడా ఉండాలి. ఇలా.. అనేక కోణాల్లో ముందుగానే మిస్ వరల్డ్‌ను ఎంపిక చేస్తారు. ఆ తర్వాత.. అసలు పోటీకి ఆయా దేశాలు పంపిస్తాయి. ఇక, ఇక్కడ చివరి దశ వరకు సుమారు 12కు పైగా పోటీలు జరుగుతాయి. ఒక్కొక్క అంచె దాటుకుని వస్తే.. చివరికి మిస్ వరల్డ్ కీర్తి దక్కుతుంది.

**కిరీటానికీ ఓ అర్థం-పరమార్థం..** మిస్ వరల్డ్‌కు ఎంపికైన వారికి అలంకరించే కిరీటానికి కూడా అర్థం పరమార్థం ఉంది. ఇదేమీ తేలిగ్గా అందించేది కాదు. ఊరికేనే పెట్టేది కూడా కాదు. అంతేకాదు.. ప్రతి సంవత్సరం ఈ కిరీటాన్ని ఒకే బరువు, ఒకే రకమైన వజ్రాలు, ఒకే సంఖ్యలో వజ్రాలను పొదిగి తయారు చేస్తారు. మొత్తం 175.49 క్యారెట్ల బరువున్న కిరీటంలో 1,770 మిరుమిట్లు గొలిపే వజ్రాలను పేరుస్తారు. ఈ కిరీటం అద్భుతమైన నీలి నీలమణితో మిరుమిట్లు గొలుపుతుంది. ఇది శాంతి, అవగాహన, సద్భావన, విధేయతకు నిదర్శనంగా నిలుస్తుంది.

**ఎందుకింత క్రేజ్?...** మిస్ వరల్డ్‌గా ఎంపికైన వారికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుంది. ఏడాది పాటు సిటిజన్ షిప్ దక్కుతుంది. ఎక్కడికి వెళ్లినా రెడ్ కార్పెట్ స్వాగతాలు, అద్భుతమైన అతిథి మర్యాదలు.

ఇక, డబ్బుకు డబ్బు సొంతం. సమాజంలోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా పెద్ద పేరు. జీవితాంతం చిర కీర్తి. అందుకే ఇంత క్రేజ్.

# సైకిల్ సామాన్యుని రవాణా సాధనం.. - జూన్ 3... ప్రపంచ సైకిల్ దినోత్సవం




సైకిల్ మానవ జీవితంతో మమేకమైన ముఖ్యమైన వాహనం. మామూలుగా మనిషి పరుగెత్తే వేగం కంటే ఆరు రెట్ల వేగంతో ఇది ప్రయాణం చేయగలదు. దాని బరువు కంటే డజను రెట్ల బరువును మోసుకెళ్ళ గలదు. శబ్దం చేయకుండా ఇది ప్రయాణం చేయగలదు. ప్రధానంగా రోడ్డు ఉన్నా లేకున్నా, అన్ని రకాల రోడ్లపై వెళ్ళటం, ఎక్కడైనా సరే ఆపడానికి వీలుండటం కారణాలుగా అనేక దేశాల్లో సామాన్య మానవునికి అందుబాటులో ఉండే సాధారణ, రవాణా సాధనంగా సైకిలు పరిగణించ బడుతోంది. ఇది బహుళ ప్రయోజనకారి. ప్రయాణానికి, వ్యాయమానికి, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగ పడుతుంది. ఒకప్పుడు పనులను వేగవంతం, సులభ తరం చేయడంలో దీని పాత్ర ఎంతో ముఖ్యంగా ఉండేది. సైకిల్ సరళమైన, సరసమైన, పర్యావరణ అనుకూల రవాణా సాధనం. వైద్య, ఆరోగ్య పరంగా, క్రీడలు నిర్వహించేందుకు కూడా ఉపయో గిస్తుంటారు. ప్రస్తుతం మారుతున్న ఆధునిక కాలంలో సైకిల్ వాడకం గణనీయంగా తగ్గి పోయింది. ఎన్నెన్నో సౌకర్యాలు వచ్చి సైకిల్ వాడకం మరుగున పడిపోయింది. ప్రపంచ సైకిల్ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 3న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించ బడుతుంది. సైకిల్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహణ కోసం 2016వ సంవత్సరం నుంచి ప్రపంచ సైక్లింగ్ అలయెన్స్ (డబ్ల్యూసీఏ), ఐరోపా సైక్లిస్ట్ సమాఖ్య (ఈసీఎఫ్)లు ఐక్యరాజ్య సమితిని విజ్ఞప్తి చేశాయి. 2018, ఏప్రిల్ లో 193 దేశాలు పాల్గొన్న ఐక్యరాజ్య సమితి 72వ సాధారణ సదస్సులో ఈ తీర్మానాన్ని ఆమోదించ బడింది. సైకిలు ఒక సాధారణమైన రవాణా సాధనము. ఇది మానవ శక్తితో నడపబడే రెండు చక్రాల వాహనము. దీనిని 19వ శతాబ్దంలో ఐరోపాలో మొదటి సారిగా ఉపయోగించారు. ప్రపంచంలో ప్రస్తుతం చైనాలో సైకిలు ఉపయోగం ఎక్కువగా ఉంది. విశ్వవ్యాప్తంగా ఇంచుమించు ఒక బిలియను సైకిళ్ళు ఉపయోగంలో ఉన్నట్లు అంచనా ఇవి మనుషులకు బొమ్మలు, వ్యాయామంలో, మిలటరీ, పోలీస్, సమాచార సరఫరా మొదలైన వివిధ రకాలుగా ఉపయోగ పడుతున్నాయి. సైక్లింగ్ ఒక రకమైన క్రీడ. రిక్షా ఒకరకమైన మూడు చక్రాల సైకిలు. సైకిలును మరింత చిన్నగానూ, వేగంగా పోయే లాగానూ చేయటంలో లాసన్ అనే ఇంగ్లండు దేశీయుడు కృతకృత్యుడయ్యాడు. రెండు చక్రాల నడుమ క్రాంక్ నీ, ఫెడల్ నీ తొలిసారిగా అమర్చింది ఇతడే. ఫెడల్ ని తొక్కినప్పుడు తొక్కేవాడి కాళ్ళ శక్తిని ఫెడల్ లకు అమర్చిన గేర్ చక్రం నుంచి వెనక ఇరుసు వద్ద ఉన్న చిన్న గేర్ చక్రానికి అందించటం కోసం స్వీడన్ కి చెందిన హాన్స్ రెనాల్డ్ ఒక గొలుసును వాడాడు. క్రమంగా చక్రాలకు స్పోక్ లు, బాల్ బేరింగులు, గేర్ లు, కూర్చోవడానికి స్ప్రింగ్ సీటు కనుక్కోబడ్డాయి. 1890 లో పెద్ద ఎత్తున సైకిళ్ళను తయారు చేయటంమొదలయ్యే సరికి అవి ఇంచుమించు ప్రస్తుతం వాడుతున్న నమూనా ప్రకారమే ఉండేవి. అయితే వాటికి అప్పట్లో టైర్లు మాత్రం లేవు. ప్రముఖ చిత్రకారుడు లియొనార్డో డావిన్సీ సైకిలును పోలిన రఫ్ స్కెచ్ లు కొన్ని గీశాడు. 1690 లో ఫ్రాన్సు జాతీయుడు దిసీవ్రాక్ సైకిలులాంటి వాహనాన్ని తొలిసారిగా రూపొందించాడు. దాన్ని "హాబీ హార్స్" అని పిల్చేవారు. దానికి పెడల్స్ లేవు. 1840 లో స్కాట్లాండు జాతీయుడైన కిర్క్ పాట్రిక్ మాక్మిలన్ పెడల్స్ ను జతచేసి నిజమైన సైకిలు రూపును కల్పించాడు. తర్వాత కొన్ని మార్పులకు గురిఅయి 1900 సంవత్సరంలో ఆధునికమైన సైకిలు తయారైంది. ఇది ఇప్పటి సైకిలు మాదిరే ఉండేది. రహదారి భద్రతను మెరుగుపరచడానికి, పాదచారులు భద్రతను కాపాడటానికి సైకిల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. శారీరక శ్రమను బలోపేతం సామాజిక దూరాలను సులభతరం చేయడానికి ఉపయోగ పడుతుంది. సైక్లింగ్ కావల్సిన ఉత్తమ పద్ధతులను, సరైన మార్గాలను అవలంబించేలా సభ్య దేశాలను ప్రోత్సహిస్తోంది. డయాబెటిస్ ఉన్నవారికి ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించడానికి ప్రపంచ సైకిల్ దినోత్సవం కృషిచేస్తోంది. ఈ దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ స్వచ్ఛంద సంస్థలు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తూ సైకిల్ వాడకంపై, సైక్లింగ్ చేయడంవల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కలిగిస్తాయి. సమాజంలో సైక్లింగ్ సంస్కృతి తెర మరుగు కాకుండా చేయడానికి, ప్రోత్సహించడానికి కావాల్సిన ఉత్తమ పద్ధతులను సరైన మార్గాలను అవలంబించేలా సభ్య దేశాలను ప్రోత్సహిస్తుంది. రహదారి భద్రతను మెరుగు పర్చడానికి సభ్య దేశాలను ప్రోత్సహించడమే కాకుండా పాదచారుల భద్రతను కాపాడడానికి సైకిల్ వాడకాన్ని ఎంతో ప్రోత్సహిస్తుంది. పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజు పెరుగుతున్న నేపథ్యంలో సైకిళ్లు కొనేందుకు, సైకిళ్లపై వెళ్లేందుకు ఇప్పటికి కొందరు ఆసక్తి చూపిస్తున్నారు. తాము వాడుకున్న సైకిళ్లను అపురూపమైన వస్తువులుగా నేటికీ భద్రంగా దాచి ఉంచిన వారూ ఉన్నారు. తాత, తండ్రుల నుంచి సైకిల్ రిపేరు జీవనోపాధిగా, కుటుంబ పోషణ చేస్తున్న వారెందరో ఇప్పటికీ ఉ న్నారు. సైకిల్ తొక్కడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. శారీరక వ్యాయమానికి సైకిల్ తొక్కడం ఎంతో మంచిది. బీపీ, మధుమోహం లాంటి వ్యాధులు దరిచేరకుండా ఉంటాయి. రోజుకు ఐదారు కిలోమీటర్లు సైకిల్ తొక్కినట్లయితే ఆరోగ్యానికి ఎంతో మంచిదని నిపుణులు సూచిస్తుంటారు. అంతేకాదు సైకిల్ తొక్కడం వల్ల శరీరం హుషారుగా పని చేస్తుంది. మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆరోగ్యం పది కాలాల పాటు పదిలంగా ఉంటుందని చెబుతుంటారు పెద్దలు. సైకిలు బొమ్మను ఒక ఎన్నికల గుర్తుగా భారతదేశంలో ఎన్నికల సంఘం వాడుతున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీగా తెలుగుదేశం పార్టీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సమాజ్ వాది పార్టీ లకు ఎన్నికల గుర్తుగా సైకిలు బొమ్మ ఇవ్వబడింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అనితర సాధ్యాలు...సంగం లక్ష్మీబాయి సేవలు - జూన్ 3...సంగం లక్ష్మీబాయి వర్ధంతి



తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళలను ముందుండి నడిపించిన ధీర వనిత ఆమె. బాలికల, స్త్రీల సంక్షేమం కోసం నిరంతరం తపించి, జీవితాంతం చిత్త శుద్ధితో పాటుపడిన సేవా నిరతికి ప్రతిరూపం ఆమె. స్వాతంత్ర్య సమర యోధురా లుగా తామ్రపత్ర గ్రహీత ఆమె. శాసన సభ్యురాలిగా, విద్యా మంత్రిణిగా, ఆంధ్రప్రదేశ్ సామాజిక, సంక్షేమ సలహా బోర్డు కోశాధికారిణిగా, హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగం కన్వీనర్‌గా, ఆంధ్ర మహిళా సభ సభ్యురా లిగా, అంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బాధ్య రాలిగా సమర్ధ వంతంగా పనిచేసి, ప్రశంసలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞా శాలి ఆమె. ఆమే ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యురాలైన తొలి మహిళగా గుర్తింపు పొందిన సంగం లక్ష్మీబాయి. సంగం లక్ష్మీబాయి(జూలై 27, 1911 - జూన్ 3, 1979) 1911, జూలై 27 న ఘటకేసర్ సమీపం లోని ఒక కుగ్రామంలో జన్మిం చారు. బాల్యం లోనే తల్లి దండ్రులు, చిన్నతనం లోనే వివాహమై భర్త చని పోవడంతో ఆమె అనాథ అయ్యారు. చాలా చురుకైన బాలిక కావడంతో మద్రాసు ఆంధ్ర మహిళా సభలో చదువుకునే అవకాశం లభ్య మైంది. కార్వే విశ్వ విద్యాల యం, ఉన్నవ లక్ష్మీ బాయమ్మ ప్రారంభించిన శారదా నికేతన్, మద్రాసు ఆర్ట్స్ కళాశాలలో చదువు కున్నారు. అక్కడ ఉన్నత చదువుల అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరు కున్నారు. నారాయణ గూడలో ఉన్న రాజా బహదూర్ వెంకట్రామి రెడ్డి ఉమెన్స్ కాలేజ్ హాస్టల్ బాధ్యతలు చూసు కుంటూనే మరోవైపు స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎంతోమంది మహిళలను ఉద్యమాల్లో భాగస్వాములను చేశారు. ఆమె సాంఘిక సేవలోనే పూర్తి సమయం వెచ్చించి ఆ తర్వాత రాజకీయాలలో చేరారు. ఆమె విద్యార్థిగా ఉన్న రోజులలో సైమన్ కమీషన్ ను వ్యతిరే కించారు. ఉప్పు సత్యాగ్రహం (1930-31) లో క్రియాశీలంగా పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు. స్వామి రామానందతీర్థ ఆధ్వర్యంలో సాగిన నిజాం వ్యతిరేక ఉద్యమంలో ముఖ్య పాత్ర వహించారు. 1932లో శాసనోల్లంఘనలో పాల్గొని అరెస్ట్ అయి రాయవెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. ఆమె వినోభా భావే యొక్క తొలి పాద యాత్రకు తెలంగాణ లో సారథ్యం వహించారు. 1950లో భూదానోద్యమ యాత్ర కోసం తెలంగాణకు వచ్చిన ఆచార్య వినోబా బావే ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించారు. ఆయన సందేశాన్ని ప్రజల్లోకి తీసు కెళ్లడంతో పాటు 16 గ్రామాలు తిరిగి 314 ఎకరాల భూమిని సేకరించారు. 1947-48లో తెలంగాణ విమోచనో ద్యమం లోనూ పాల్గొన్నారు. విమోచన అనంతరం సేవా కార్యక్ర మాలలో పాల్గొన్నారు. ఆమె 1952 లో నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజక వర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. బూర్గుల రామకృష్ణారావు కేబినెట్‌లో విద్యాశాఖ సహాయ మంత్రిగా 1954 నుంచి 1956 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె హయాంలోనే తెలంగాణ జిల్లాల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు ప్రారంభ మయ్యాయి. మంత్రిగా సంపాదన మొత్తాన్ని స్త్రీ సేవాసదన్‌కు ఉపయోగించారు. 1955లో దాన్ని తన సహచరు లైన కేవీ రంగారెడ్డి, ఎ.శ్యామలా దేవి, పి.లలితాదేవి, పాశం పాపయ్య, ఎం.భోజ్‌రెడ్డితో కలిసి ఇందిరా సేవా సదన్‌గా రిజిస్టర్ చేయించారు. తద్వారా అనాథ మహిళలు, శిశువులకు ఉచిత విద్యనందించారు. సంతోష్ నగర్ చౌరస్తాలో ప్రస్తుతం ఐ.ఎస్.సదన్ గా పిలవబడుతున్న ప్రాంతంలో ఆమెకు రెండెకరాల స్థలంలో ఇల్లుండేది. తమ సొంత ఇంటిలోనే అనాథ శరణాల యాన్ని ప్రారంభించారు. అదే కాకుండా రాధికా మెటర్నిటీ హోమ్, వసు శిశువిహార్, మాశెట్టి హనుమంతు గుప్తా బాలికల ఉన్నత పాఠశాలల యొక్క స్థాపనలో ఆమె పాత్రలు మరిచి పోలేనివి. లక్ష్మీబాయి సేవల గురించి తెలుసుకున్న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా వచ్చి సాయం చేశారు. నాటి డిప్యూటీ సీఎం కొండా వెంకట రంగారెడ్డితో పాటు ఇందిరా గాంధీ కూడా సేవా సదనం నిర్వహణకు తోడ్పాటు అందించారు. 1957లో మెదక్ నియోజక వర్గం నుండి 2వ లోకసభకు ఎన్నికయ్యారు. 1962 లో 3వ లోకసభకు ఎన్నికయ్యారు. మూడవ సారి 1967లో 4వ లోకసభకు వరుసగా మెదక్ లోకసభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. హైదరాబాదు యాదవ మహా జన సమాజం అధ్యక్షురాలిగా, అఖిల భారత విద్యార్థి సంఘం ఉపాధ్యక్షు రాలిగా, హైదరా బాదు ఫుడ్ కౌన్సిల్, ఆంధ్ర యువతి మండలి అధ్యక్షు రాలిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ సలహా బోర్డుకు కోశాధి కారిణిగా, హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగ కన్వీనరుగా ఉన్నారు. ఆమె పద్దెనిమిదేళ్ల పాటు ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెసు కమిటీ బాధ్యురాలిగా కొన్నాళ్లు పని చేశారు. స్వాతంత్ర్య సమర యోధురాలిగా గుర్తించిన భారత ప్రభుత్వం ఆమెకు తామ్రపత్రం ఇచ్చి గౌరవించింది. 1979లో మరణించే వరకు లక్ష్మీబాయి స్త్రీలు, బాలికల సంక్షేమం కొరకు నిర్విరామ, అసమాన కృషి చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలుగు ప్రజల హృదయేశ్వరి "మల్లీశ్వరి"




Malliswari - NTR, Bhanumathi మల్లీశ్వరి- యన్టీఆర్ భానుమతి

తెలుగు చలనచిత్ర చరిత్రలో స్వర్ణ యుగానికి చెందిన గొప్ప చిత్రంగా మల్లీశ్వరి ఖ్యాతి గాంచింది. ఆ సినిమా భారతదేశం లోనే కాక ఇతర దేశాలలో కూడా చాలా రోజుల పాటు ప్రదర్శింప బడింది. రాచరికపు ఆడంబరాలను, ఆచారాలను చిత్రించినా ఆ సినిమా కమ్యూనిస్టు దేశమైన చైనా లోనే వంద రోజులకు పైగా ఆడింది. ఆ సినిమాకు మాటలు, పాటలు, కళ, నటన, సంగీతం, ఛాయా గ్రహణం, ఎడిటింగులతో సహా అంతా తానై బి.ఎన్.రెడ్డి నడిపించినవే. అందుకే కృష్ణశాస్త్రి "మల్లీశ్వరి సృష్టిలో మేమంతా నిమిత్త మాత్రులం. బి.ఎన్.రెడ్డి దీనికి సర్వస్వం." అన్నారు. శ్రీకృష్ణదేవ రాయలంటే ఆరాధనాభావమున్న, ఆంధ్రాంగ్ల సాహిత్యాలను విస్తృతంగా అధ్యయనం చేసిన బి.ఎన్.రెడ్డి రాయలవారి మీద ఒక సినిమా తీయాలని సంకల్పించారు. బి.ఎన్. తమ తొలి సినిమా 'వందేమాతరం' షూటింగు కోసం హంపి ప్రాంతానికి వెళ్ళినప్పటి నుండి అందుకు తగిన కథ కోసం వెదుకుతూనే ఉన్నారు. ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో వచ్చిన ఒక కథ, బుచ్చిబాబు వ్రాసిన "రాయల కరుణ కృత్యం" నాటిక కలిపి దేవులపల్లి కృష్ణశాస్త్రి చేత "మల్లీశ్వరి" స్క్రిప్టుగా అభివృద్ధి చేశారు. అయితే బుచ్చిబాబు పేరు కథా రచయితగా సినిమాలో స్థానం కల్పించ లేదు. 1951 డిసెంబర్ 20న విడుదలైన చిత్రం వాహినీ వారి మల్లీశ్వరి. ఇది దేవులపల్లి వారి తొలి సినిమా. అయన పాటలు - మాటలు, ర'సాలూరు' రాజేశ్వర రావు కమ్మని బాణీలు, ఎన్.టి.ఆర్., భానుమతిల అద్భుత నటన, ఘంటసాల - భానుమతి గార్ల విలక్షణమైన గాన పటిమ అన్నీ కలబోసిన రాగేశ్వరి మల్లీశ్వరి. శ్రీ కృష్ణ దేవరాయలు పాలించే విజయ నగరానికి సమీపాన నివసించే పల్లెటూరి యువ ప్రేమికులు మల్లి, నాగరాజు. తెలియక వెటకారానికి, మారువేషంలో వున్న రాయలు, పెద్దనలతో రాణివాసం పల్లకి కోరి, తద్వారా ప్రేమికులు విడిపోయి, విరహ వేదన అనుభవిస్తారు. అలనాడు మహాకవి కాళిదాసు ప్రేమికుల సంకేతాలను 'మేఘ సందేశం' గా రచించగా, ఈ చిత్రంలో నాయికా నాయకుల నడుమ తొణికిసలాడే ప్రణయ స్పందనా తరంగాలను 'ఆకాశ వీధిలో హాయిగా' తేలియాడే మబ్బు తునకతో పంపారు కృష్ణ శాస్త్రి. అంతేకాదు ఈ మల్లీశ్వరి మేఘమాల నిజంగానే దేశదేశాలు తిరిగింది, చైనాతో సహా. సాలూరికి ఇష్టమైన చక్కని ఈ పాటను రాగ మాలిక గా భీంపలాస్, కీరవాణి, హంసానంది రాగాలలో కూర్చి ఘంటసాల, భానుమతి గార్లతో అందాల ఓ మేఘమాల పాట పాడించారు సాలూరు వారు. నందమూరి తారక రామారావు, భానుమతి, సురభి కమలాబాయి, బేబీ మల్లిక, మాస్టర్ వెంకటరమణ, న్యాపతి రాఘవరావు, ఋష్యేంద్ర మణి, శ్రీవాత్సవ, కుమారి, వంగర, కమలాదేవి తదితరులు తమ పాత్రలలో ఒదిగి పోయారు. చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలన నేపథ్యంలో ఈ చిత్ర కథ నడుస్తుంది. అప్పటి రాజవిధానం ప్రకారం రాజాంతః పురంలో పని చేయడానికి ఇష్టపడిన యువతులను వారింటికి పల్లకీ పంపి, వారి కుటుంబానికి ధన కనక బహుమానాలు ఇచ్చి, రాజాస్థానా నికి పిలిపించే వారు. కాని ఒకసారి అంతఃపురంలో చేరిన యువతు లకు బయటి మగవారితో సంబంధాలు నిషిద్ధం. ఈ నియమాన్ని అతిక్రమించిన వారికి ఉరిశిక్ష వేసేవారు. చిత్రంలో పాటలు అన్నీ విశేషంగా జనాదరణ పొందాయి. లంబోదర లకుమికరా - పురందర దాసు కీర్తనబీ కోతీ బావకు పెళ్ళంట, కోవెల తోట విడిదంటబీ పిలచిన బిగువటరా ఔరౌరాబీ ఔనా! నిజమేనా! మరతునన్నా మరువలేనుబీ ఉషా పరిణయం యక్షగానం- కమలాదేవి, భానుమతి, పరుగులు తీయాలి, గిత్తలు ఉరకలు వేయాలిబీ మనసున మల్లెల మాలలూగెనేబీ ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు బీ ఎన్నినాళ్ళకీ బతుకు పండెనో, ఎంత హాయి ఈ రేయి నిండెనోబీ ఝుం ఝుం ఝుం తుమ్మెదా తుమ్మెదా తదితర పాటలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఒక సంప్రదాయ గానం, మరొక పురందరదాసు కీర్తన (గణేశ ప్రార్థన) తప్పించి మిగిలినవన్నీ దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనలే. స్త్రీలను ఆకర్షించేందుకు భక్తి పాటలను ఏదో విధంగా చొప్పించే రోజుల్లో ఈ సినిమాలో టైటిల్స్ శ్రీగణనాథం అనే గీతం తప్ప మిగతా పాటలన్నీ సినిమాకు ముఖ్య కథాంశమైన అనురాగం, ప్రణయం, రెండవ థీం అయిన విజయనగర వైభవం చుట్టూ ఉండేలా రూపొందించారు. మొత్తం పాటల స్వరకల్పనకు ఆరు నెలల కాలం పట్టింది. సినిమాలో మల్లీశ్వరి నాగరాజు ముందు ప్రదర్శించిన నృత్య గానాలను మారువేషంలో చూసిన అల్లసాని పెద్దన ఆశువుగా ఆమెను మెచ్చుకుంటూ ఓ పద్యం చెప్పే సన్నివేశం ఉంది. అల్లసాని పెద్దన రాసినట్లుగా అల్లిక జిగిబిగితో రావాలన్న జాగ్రత్త వల్ల కృష్ణశాస్త్రితో 108 పద్యాలు రాయించుకుని అందులో ఒక్కటి ఎంపిక చేసుకున్నారు బి.ఎన్.రెడ్డి. మల్లీశ్వరి చలనచిత్రం ద్వారా చిత్రరంగానికి ప్రముఖ కవి, భావకవితోద్యమంలో ముఖ్యుడైన దేవులపల్లి కృష్ణశాస్త్రిని పరిచయం చేశారు. ఈ చిత్రాన్ని సర్వేపల్లి రాధాకృష్ణ చూశారు. ఆయన గమనించిన విషయం - చిత్రంలో మల్లి, నాగరాజులు, మారువేషంలో ఉన్న రాయలవారిని కలిసింది పెద్దవర్షం వచ్చిన కారణంగా. ఐతే రాయలవారు వీరితో మాట్లాడి తిరిగి వెళ్ళిపోయే సమయంలో గుర్రాల స్వారీ వల్ల ధూళి రేగుతుంది. ఇది ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చరకలు



# విలీనం.. అభివృద్ధికి దూరం

వేములవాడ: మున్సిపాలిటీలో తమ గ్రామాలు విలీనమైతే మెరుగైన అభివృద్ధి ఉంటుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. వీధుల్లో కనీసం మురుగు కాలువలు, సీసీ రోడ్ల వసతి నేటికీ సమకూరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ మున్సిపాలిటీలో తిప్పాపూర్, నాంపల్లి, అయ్యోరుపల్లి, శాత్రాజుపల్లి, కోనాయిపల్లి గ్రామాలను ఐదేళ్ల క్రితం విలీనం చేశారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల పరిపాలన మున్సిపల్ పరిధిలోకి వెళ్లి పోయింది. అప్పటి నుంచి తమకు సమస్యలు మొదలయ్యాయని ప్రజలు అంటున్నారు. ఏచిన్న పని కావాలన్నా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సి రావడంతో సమస్యలు మరింత పెరిగాయి. చాలా దూరంలో ఉన్న గ్రామాలను సైతం మున్సిపల్‌లో విలీనం చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. నాంపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి గ్రామాలు పట్టణానికి దాదాపు మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. ఏదేని అవసరాలకు వేములవాడలోని మున్సిపల్ కార్యాలయానికి రావడం తమకు ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**శివారు కాలనీల్లోనూ...**

ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణం రోజు రోజుకూ విస్తరిస్తుండటంతో శివారు ప్రాంతాల్లో కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పట్టణం చుట్టూ బైపాస్ రహదారులు, శివారు వీధులతో పాటు సాయినగర్, కోరుట్ల వైపు రోడ్డు, మల్లారం రోడ్డు, తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు నేటికీ లేవు. పట్టణం నుంచి మల్లారం వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి మురుగు కాలువ లేక పెద్ద ఎత్తున మురుగు రోడ్డుపై పారుతోంది. దుర్గంధం వెదజల్లడంతో తాము రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఆయా నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని అంటున్నారు. లేకుంటే వర్షాకాలంలో మురుగు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

**మౌలిక వసతులేవీ...**

విలీన గ్రామాల్లో మౌలిక వసతులు అంతంతమాత్రమే ఉన్నాయి. చాలా గ్రామాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల సదుపాయం లేదు. వర్షాకాలంలో చాలా వీధులు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ మన్సిపల్‌లో రెండేళ్ల క్రితం టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20 కోట్లతో పాటు ఇతరత్రా నిధులను మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి వెచ్చించినప్పటికీ అవి సరిపోలేదు. చాలా గ్రామాల్లోని అంతర్గత వీధుల్లో మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. వర్షాకాలంలో మురుగు వీధుల్లో పారుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్యలు మొరపెట్టుకున్నా పరిష్కారం కావడం లేదని అంటున్నారు.

**నిధులు మంజూరు కావాల్సి ఉంది**

గతంలో మంజూరైన నిధులతో పట్టణంలోని వివిధ వార్డులతో పాటు విలీన గ్రామాల్లోనూ మురుగు కాలువలు, సీసీ రోడ్ల పనులు చేపట్టాము. పలుచోట్ల ఇంకా మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# ముందుగానే మేఘాలు

వీర్నపల్లి: నైరుతి రుతుపవనాలతో నమోదైన వర్షపాతం మీదే అన్నదాతల భవితవ్యం ఆధారపడుతుంది. తొలకరి ఆలస్యమైతే ఆరుతడి పంటలపై కొంత ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయని అన్నదాతలు అభిప్రాయపడుతుంటారు. మునుపెన్నడూ లేని విధంగా రోహిణికార్తెలో నే ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో ఎడతెరిపి లేని వానలు కురిశా యి. దానికి ఊతమిచ్చేలా గతంతో పోలిస్తే రెండువారాల ముందుగానే నైరుతి పలకరించింది.రాజన్నసిరిసిల్ల జిల్లాలో 2.43 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. జిల్లాలో ప్రధానంగా వరిని సాగుచేస్తుండగా వాణిజ్య పంటగా పత్తి రెండో స్థానంలో సాగవుతుంది. సుమారు 1.84 లక్షల ఎకరాల్లో వరి, 49 వేల ఎకరాల్లో పత్తి, 9 వేల ఎకరాలకుపైగా మొక్కజొన్న, అపరాలు, ఇతర పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పంట కాలువలతో పోలిస్తే రైతులు ప్రధానంగా గొట్టపు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. గొలుసుకట్టు చెరువులు నిండితేనే వరి సాగు ఊపందుకుంటుంది. ప్రస్తుతం పత్తి, మొక్కజొన్న, అపరాల సాగు చేసే కర్షకులు కమతాలను సిద్ధం చేసుకుంటున్నారు. పంటకు మేలుచేసే సేంద్రియ ఎరువులు, రాయితీ జీలుగ విత్తనాలు చల్లుతున్నారు. వానాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు సన్నద్ధమవు తున్నారు.

**కల్లాల్లో కర్షకుల కలవరం** ఉపరితల ఆవర్తణ ద్రోణి ప్రభావం, నైరుతి ఆగమనంతో జిల్లాలో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోకి ఈ నెల 26న రుతుపవనాలు ప్రవేశించడంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. మే 29 వరకు సాధారణంగా 61 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ప్రస్తుతం 190 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యి ంది. జిల్లాలో సుమారు 90 శాతానికి పైగా ధాన్యం సేకరణ పూర్తయ్యిం ది. బస్తాల్లో ధాన్యం ఇప్పటికే నింపి పెట్టగా వాటిని మిల్లులకు తరలింపులో కొంత ఆలస్యం జరుగుతోంది. సన్నధాన్యం సేకరణ విషయంలో మిల్లర్లు అనాసక్తి కనబర్చడంతో గింజలు మొలకెత్తుతున్నాయి.

# సాగుకు సన్నద్ధం

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని మొదటి జోన్‌లో ఉన్న జిల్లాలో వరి పంట సాగు అధికంగా ఉంది. యాసంగిలో ఆశించిన దానికన్నా అధిక దిగుబడులు సాధించారు. ఏటా సాధారణంగా వినియోగించే యూరియా కన్నా ఎకరానికి ఒకబస్తా అదనంగా వాడాలని శాస్త్రవేత్తలు సూచించారు. దీంతో రైతులు అధికంగా యూరియా వినియోగించారు. జిల్లాలో వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేయగా సాగు అంచనాలకు తగిన విధంగా ఎరువులకు ప్రతిపాదనలు పంపారు.

నల్గొండ జిల్లాలో 11,47,000 ఎకరాల మేరకు పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు ముందస్తుగా అంచనా వేయగా.. 1.44 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదించారు. సెప్టెంబరు నాటికి 61 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, పొటాష్ 33వేల మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 11.14 వేల మెట్రిక్ టన్నులు, సూపర్ 12వేల మెట్రిక్ టన్నులు అవసరం.

జిల్లాలో ప్రస్తుతం 30 వేల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. 9 వేల మెట్రిక్ టన్నులు డీలర్ల వద్ద, 17వేలు మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్, 4 వేల మెట్రిక్ టన్నులు గోదాముల్లో నిల్వలు ఉన్నాయి.

అంచనాకు మించి వినియోగం–శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

గతేడాది వ్యవసాయ శాస్త్రవేత్తలు యాసంగి సీజన్‌లో అదనంగా ఒక బస్తా యూరియా వేయాలని సూచించడంతో అవసరం ఎక్కువ అయింది. కానీ రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా సర్దుబాటు చేశాం. వానాకాలం సీజన్‌కు సరిపడా ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ ముందుకు సాగాలి.

# పెరిగిన అంచనాలు.. నత్తనడకన పనులు



సారంగాపూర్: బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ అంచనాలు ఏటా పెరుగుతున్నప్పటికీ పనులు మాత్రం పూర్తి కావడం లేదు. బీర్‌పూర్, ధర్మపురి మండలాల చివరి ఆయకట్టుకు నీరందించాలన్న లక్ష్యంతో 2016లో రూ.60.23కోట్ల ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. నిధులు మంజూరైన ఏడాదికి పనులు ప్రారంభించగా నత్తనడకన సాగడంతో 2022లో అంచనాలు పెరిగి రూ.136.81 కోట్లకు చేరుకున్నాయి. అటవీ అధికారుల అభ్యంతరం, ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో ఇటీవల ప్రభుత్వం రూ.153 కోట్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 95 శాతం పనులు పూర్తయినప్పటికీ, తూములకు షట్టర్లు బిగించడం, కొంత మేర కట్టకు రాళ్లద్దడం మత్తడి పనులు మిగిలిపోయాయి. ఆయా పనులు కూడా నత్తనడకనే సాగుతుండడం.. వర్షాలు ప్రారంభం కావడంతో ఈ ఏడాది కూడా పూర్తి స్థాయిలో ఆయకట్టు రైతులకు సాగు నీరందడం ప్రశ్నార్థకంగానే మారింది.

**వాతావరణం అనుకూలిస్తేనే**

ప్రస్తుతం కట్టకు రాళ్లద్దడం కొనసాగుతున్నప్పటికీ తూము గేట్లు బిగించాలంటే తూము ప్రాంతంలో పనులు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వర్షాలు ప్రారంభం కావడంతో పనులు చేయడం కష్టంగా మారింది. ఇటీవల ప్రభుత్వం అంచనాలు రూ.153 కోట్లకు పెంచగా ఇందులో రూ.కోటితో మూడు గేట్ల తయారీకి వ్యయం చేయనున్నారు. ప్రస్తుతం కట్టకు మిగిలిపోయిన పనులు కొనసాగుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో నీరందించాలంటే తూముల వద్ద షట్టర్ల బిగింపు ప్రక్రియ తప్పనిసరి అవసరముంటుంది. ఆయా పనులే ఆలస్యం చేయడంతో ఆయకట్టు రైతుల్లో నిరసన వ్యక్తమవుతోంది.

**రాష్ట్ర అటవీ ఉన్నతాధికారుల పరిశీలన తర్వాతే**

ముంపునకు గురవుతున్న అటవీ భూమికి బదులు జిల్లాలోని గొల్లపల్లి, పెగడపల్లి, ధర్మపురి మండలాల్లోని పలు ప్రాంతాల్లో 335 హెక్టార్ల రెవెన్యూ భూమిని ఇప్పటికే అటవీశాఖకు అప్పగించారు. ముంపు ప్రాంతంతోపాటు అప్పగించిన రెవెన్యూ భూములను ఇటీవల సీపీఎఫ్ శరవణ్ పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం రాష్ట్ర పీసీసీఎఫ్(రాష్ట్ర ముఖ్య అటవీ అధికారి) పరిశీలించాల్సి ఉంది. త్వరితగతిన అనుమతి ప్రక్రియ పూర్తి చేస్తేనే గేట్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

**ప్రత్యామ్నాయ చర్యలు**

చక్రునాయక్, డీఈఈ, రోళ్లవాగు ప్రాజెక్టు

రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం. పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. గేట్ల బిగింపు ప్రక్రియ వాతావరణం అనుకూలిస్తే పూర్తి చేసేలా చూస్తాం. ప్రాజెక్టు ఆధునికీకరణ మిగులు పనులు పూర్తి చేసేలా కొనసాగుతున్నాయి.

# నాణ్యమైన విత్తు.. రైతన్న పొత్తు



మిర్యాలగూడ : వానాకాలం సీజన్ సమీపించింది. రైతులు నాణ్యమైన విత్తనం కోసం ఆరా తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రైతులు అధికంగా వరిసాగు చేస్తారు. విత్తనం నాణ్యంగా ఉంటే చీడపీడల బాధ తగ్గి ఆశించిన దిగుబడి వస్తుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చర్యలు చేపడుతుంది.

**రెండు ల్యాబ్‌ల్లో నాణ్యత పరీక్షలు**

మిర్యాలగూడలోని నందిపాడులో విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ (ఉమ్మడి జిల్లా) ప్రధాన కార్యాలయంతోపాటు గోదాములు, 130 ఎకరాల సాగు భూమి ఉన్నాయి. శాస్త్రవేత్తలు సూచించిన విత్తనాలను ఇక్కడి అధికారులు తమ సాగు భూమితో పాటు పలువురు ఎంపిక చేసిన రైతులకు అందించి సాగులో సలహాలు ఇస్తూ పంట నాణ్యతతో వచ్చే విధంగా చర్యలు చేపట్టి ఆ ధాన్యాన్ని కనీస మద్దతు ధర కంటే పది శాతం అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తారు. ఆ ధాన్యంలో ఎలాంటి బెరుకులు, ఇతర రకం ధాన్యం గింజలు లేకుండా వేరు చేసి హైదరాబాద్‌లోని రెండు ల్యాబ్‌ల్లో పరీక్షిస్తారు. అక్కడ అనుమతి పొందిన వాటిని 25 కిలోల చొప్పున సంచులో నింపి ప్రత్యేక ట్యాగ్, హెూలోగ్రామ్ అంటిస్తారు. ఇవి విత్తనాల నాణ్యతకు సూచికలుగా పరిగణిస్తారు. ఈ విత్తనాలు ప్యాకింగ్ తేదీ నుంచి 9 నెలల పాటు సాగుకు వినియోగిస్తారు.

**విక్రయాలకు డీలర్ల నియామకం**


విత్తనాభివృద్ధి సంస్థ తయారు చేసే విత్తనాలను రైతులకు విక్రయించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్, డీసీఎంఎస్, రైతు సంఘాలతో పాటు లైసెన్స్ పొందిన డీలర్లను నియమించారు. ప్రస్తుతం వంద మందికి పైగా డీలర్లు ఉన్నారు. వీరి వద్ద సంస్థ సూచించిన ధరకే విత్తనాలు కొనుగోలు చేయవచ్చు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించి సంస్థ వద్ద 8 రకాల వరి విత్తనాలు, మినుములు, కందులతో పాటు పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగలు, జనుము, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రెండు వేల టన్నుల కంటే ఎక్కువ కొనుగోలు చేసే రైతులకు ఉమ్మడి జిల్లాలో ఎక్కడికైనా ఉచితంగా రవాణా చేస్తారు. **4వేల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం**

–వినయ్‌కుమార్, ఆర్ఎం, విత్తనాభివృద్ధి సంస్థ, మిర్యాలగూడ

నందిపాడులోని గోదాముల్లో వరి, పెసర, కంది, పచ్చి రొట్టపైర్ల విత్తనాలు ప్రస్తుతం 4వేల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. అవసరానికి అనుగుణంగా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు నేరుగా విత్తనాభివృద్ధి సంస్థలో కొనుగోలు చేయొచ్చు.

# సర్వేలతో సరి.. అమలెప్పుడు మరి?

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పురపాలికలో బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అమలుకు నోచుకోవడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, వాహనాలతో రోడ్లు, మురుగు కాలువలు సరిపోని పరిస్థితి. 1999–2000లో ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ ఆధారంగానే రోడ్లు, ఇతర నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రాబోయే 30ఏళ్ల వరకు జనాభా ఎంత మేరకు పెరుగుతుందనే విషయాలను అంచనా వేస్తూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కలిగేలా బృహత్ ప్రణాళిక అమలు చేయాల్సి ఉంది.2018లో నూతనంగా మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో దిల్లీకి చెందిన ప్రైవేట్ ఏజెన్సీతో బల్దియాలో సర్వే చేపట్టారు. 150 అంశాలతో క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి 30 ఏళ్లలో బల్దియా ఎలా ఉంటుందనే అంచనాలతో బృహత్ ప్రణాళిక రూపొందించారు. అనంతరం ప్రభుత్వం మారడంతో అమలులో వెనుకబడింది.అమృత్ 2.0 పథకంలో డ్రోన్ సర్వే ద్వారా మూలాధార( బేస్) మ్యాప్‌లను తయారు చేసేందుకు ఈ ఏడాది జనవరిలో సర్వే ఆఫ్ ఇండియాకు బాధ్యతలు అప్పగించారు. 40 గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను ఏర్పాటు చేసి డ్రోన్ ద్వారా సర్వే చేశారు. ఇళ్లు, పరిశ్రమలు, రిజర్వాయర్లు, సీసీ రోడ్లు, తారు రోడ్లు, తదితర వాటన్నింటినీ చిత్రంలో పొందుపర్చి, 3డీ చిత్రీకరణతో భవనాల ఎత్తు, రహదారులు, ఇతర ప్రాంతాల ఎత్తు పల్లాలు, పొడవు, వెడల్పులు వంటి సూక్ష్మస్థాయి వివరాలను సైతం చేర్చి డీటీసీపీకి అందజేశారు. సర్వే పూర్తయి అయిదు నెలలు కావస్తున్నా.. ముందడుగు పడటం లేదు.



**చేకూరనున్న ప్రయోజనాలు**

రాబోయే 30 ఏళ్లలో పట్టణ జనాభా ఏ మేరకు పెరగనుంది, అందుకు అనుగుణంగా ఉండాల్సిన మౌలిక సౌకర్యాలను కల్పించేలా నివేదికలు సిద్ధం చేస్తారు. బల్దియాలో ఉన్న 30 వార్డులతోపాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, గల్లీలు, మూలమలుపులు, పట్టణ సరిహద్దు ప్రాంతాలను గుర్తించి, పూర్తి స్థాయిలో రాబోయే 30 ఏళ్లకు అనుగుణంగా ఉండే విధంగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారు. ప్రధాన రోడ్లు, కూడళ్లు, అంతర్గత రోడ్ల వెడల్పుతోపాటు రక్షిత మంచినీటి పథకాల ఏర్పాటు, నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు లైన్లు తదితర అంశాలను అందులో చేర్చుతారు.

ప్రభుత్వ భూములు, అటవీ భూములు, భవనాలు, మురుగు కాలువలు, జలవనరులకు తదితర వాటికి సంబంధించి ఇప్పటికే రెవెన్యూ, అటవీ, మున్సిపల్ మ్యాప్‌లతో సర్వే ఆఫ్ ఇండియా ఇచ్చిన మ్యాప్‌తో సరిపోల్చడం ద్వారా ఎక్కడెక్కడ ఆక్రమణలు ఉన్నాయో సులభంగా గుర్తించవచ్చు.

**కసరత్తు జరుగుతోంది**

బల్దియాలోని ప్రతి వార్డులో 10శాతం ఇళ్ల వివరాలు, ఆర్థిక స్థితిగతులు తదితర వివరాలు సేకరించాం. సర్వే నివేదిక ఆధారంగా బృహత్ ప్రణాళిక రూపొందించడంలో ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్(ఎన్ఐయూఎం) ప్రణాళిక సిద్ధం చేస్తోంది. యశ్వంత్, పట్టణ ప్రణాళిక అధికారి, కాగజ్‌నగర్

# రోడ్ల వెంబడి యథేచ్ఛగా పారబోత

హైదరాబాద్–విజయవాడ 65వ జాతీయ రహదారితో పాటు సూర్యాపేట ఖమ్మం 365వ జాతీయ రహదారి పొడవునా ఎక్కడపడితే అక్కడ ఇలా పారిశ్రామిక వ్యర్థాలను పడేస్తున్నారు. చివ్వెంల మండలం వల్లభాపురం, ఖాసీంపేట, జగన్‌నాయక్‌తండా, అక్కలదేవిగూడెం, చందుపట్ల గ్రామాల సమీపంలో వ్యర్థాలను పారబోస్తుండగా స్థానికులు వారిని పట్టుకొని పోలీసులకు ఫిర్యాదులు చేసిన ఘటనలు ఉన్నాయి.

**నేల, నీరు కలుషితం..**

వ్యర్థాలను పారబోసిన ప్రాంతం గ్రామాలకు సమీపంలో ఉండడంతో వాటి నుంచి వచ్చే దుర్గంధాన్ని పరిసర వాసులు భరించలేకపోతున్నారు. దీంతో శ్వాసకోస సంబంధిత వ్యాధులు వస్తాయనే ఆందోళనలో ఉన్నారు. అవశేషాల ప్రభావానికి ఆయా ప్రాంతాల్లో చెట్లు చనిపోవడమే కాకుండా అక్కడ మరో చెట్టు పుట్టి పెరిగే పరిస్థితి లేకుండా పోతోంది. అవి భూమిలోకి ఇంకి బోరుబావుల నీళ్లు సైతం కలుషితమయ్యే పరిస్థితి వస్తుందంటున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం:

బైరు రవీందర్, జగన్‌నాయక్‌తండా

వల్లభాపురం, ఖాసీంపేట, జగన్‌నాయక్‌తండా పరిసర ప్రాంతాల్లో రహదారుల వెంట ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. ఎన్నోసార్లు వారిని పట్టుకొని అధికారులకు అప్పగించాం. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో షరామామూలైంది. వాటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాం.

ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు

బాసిపంగు సునీల్, చందుపట్ల

గత ఐదేళ్ల నుంచి రోడ్ల వెంట గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. పర్యావరణానికి హాని, శ్వాసకోస సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నమూనాలు సేకరించాం:

పురుషోత్తంరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి

ఇటీవల అక్కలదేవిగూడెం వద్ద పారబోసిన వ్యర్థాలలో నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించాం. అవి హానికరమైనవా లేదా అనేది తేలాల్సి ఉంది. తుది నివేదిక రాగానే తగు చర్యలు తీసుకుంటాం. పోలీసులు సైతం దీనిపై దృష్టిపెట్టి కేసులు నమోదు చేయాలి.

# ఆరోగ్యం పణం.. రక్షణ సామగ్రి కనం!

మెదక్ : జిల్లాలోని నాలుగు పురపాలికల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందికి సకాలంలో రక్షణ సామగ్రి అందజేయడం లేదు. వివిధ పనులు చేస్తున్న వారికి సబ్బులు, నూనె, మాస్కులు, శానిటైజర్లు, హెల్మెట్లు, బూట్లు, ఆర్ఫాన్లు(రేడియంతో కూడిన జాకెట్లు) ఇవ్వాల్సి ఉన్నా, అధికారులు దృష్టి సారించడంలేదు. నెలల తరబడి ఇదే విధంగా కొనసాగడంతో వారు అనారోగ్యానికి గురవుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**వారి వల్లే శుభ్రత**

పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చడంలో వారు ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా శ్రమిస్తారు. ఇందులో భాగంగా నిత్యం మురుగు కాల్వలు శుభ్రం చేయడం, వీధులు ఊడ్చడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, రసాయన ద్రావణాలు పిచికారీ చేయడం వంటివి చేపడుతుంటారు. చెత్తను ట్రాక్టర్ ఎత్తడం, డంప్ యార్డులకు తరలించడం వంటి పనులు చేస్తున్నారు. మురుగు కాల్వల్లో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగిస్తున్నారు. వివిధ రకాల పనులు చేస్తూ పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దోమల నియంత్రణకు మందులు పిచికారీ చేస్తున్నారు. వీరికి సరైన రక్షణ సామగ్రి లేక అనారోగ్యానికి గురవుతున్నారు. కొందరు తరచూ సెలవులు పెడుతున్నారు.

**నెలల తరబడి ఆలస్యం..**

ఏటా రెండు, మూడు సార్లు రక్షణ సామగ్రి ఇవ్వాలి. దుస్తులు, మురుగు కాల్వల్లో చెత్తను తీసే పారలను, కాల్వల్లో దిగేందుకు పెద్ద పరిమాణంలో ఉన్న బూట్లను, చేతులకు రక్షణ పరికరాలను ఇవ్వాల్సి ఉంటుంది. వాస్తవానికి సామగ్రి ఇవ్వకుండానే పనులు చేస్తున్నారు. కాలువలో చేరిన వ్యర్థాలను చేతితో ఎత్తి బయట పారేస్తున్నారు. ఈ సమయంలో గాజు ముక్కలు కాళ్లకు గుచ్చుకుంటున్నాయి.

మెదక్ పురపాలికలో ఆరు నెలల కిందట ఇచ్చారు. రెండోసారి అందజేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈనెలాఖరులోగా ఇస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ చెప్పారు. టెండరు ప్రక్రియ ద్వారా వీటిని పంపిణీ చేస్తామన్నారు. కార్మికులు మాత్రం అడిగితేనే ఇస్తున్నారంటున్నారు.నర్సాపూర్‌లో సిబ్బందికి నాలుగు నెలలుగా ఇవ్వలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఆగస్టు 15న ఇస్తామని అంటున్నారు. గ్లౌజ్‌లు, ఫేస్ షీల్డులు, బూట్ల జాడేలేదు. మూడు నెలలుగా సబ్బులు ఇవ్వలేదు. రేడియంతో కూడిన జాకెట్లు లేవు. రోడ్లు శుభ్రపర్చే సమయంలో ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తూప్రాన్ పురపాలికలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రెండు విడతలుగా ఇచ్చే వాటిని ఒకేసారికి కుదించారు. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. రామాయంపేటలో దుస్తులు ఇచ్చారు. మూడు నెలలుగా సామగ్రి ఇవ్వలేదు. ఇబ్బందులు తీరుస్తాం–రామకృష్ణారావు, కమిషనర్, నర్సాపూర్ వర్షాకాలానికి ముందు కార్మికులకు ఏటా సామగ్రి అందజేస్తాం. వారి ఇబ్బందులను మా దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తాం.

# కస్తూర్బాలకు ఇంటర్ వెలుగులు

సంగారెడ్డి : కస్తూర్బా విద్యాలయాల్లో పేద, అనాథ బాలికలు చదువుతారు. ఇక్కడ పదో తరగతి వరకు చదివిన బాలికలు కొన్ని చోట్ల ఇంటర్మీడియట్ లేకపోవడంతో విద్యకు దూరమవుతున్నారు. దీన్ని గుర్తించిన విద్యాశాఖ 2025–26 సంవత్సరానికి మరో ఏడు చోట్ల ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. కస్తూర్బాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలి.

**వసతి.. నాణ్యమైన విద్య..** కస్తూర్బా పాఠశాలల్లో ప్రత్యేకాధికారులు, బోధకులు తాత్కాలిక పద్ధతిన పనిచేస్తారు. ఈ విద్యాలయాల్లో వసతితో పాటు.. నాణ్యమైన విద్య అందిస్తున్నారు. ఇక్కడి విద్యార్థినులు 2024–25 విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 62.72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 75.48 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇప్పటికే కస్తూర్బాల్లో ఇంటర్ అమలవుతుండగా.. తాజాగా మరో ఏడు చోట్ల అవకాశం కల్పించారు. కాశీపూర్, హత్నూర, తాటిపల్లి, న్యాల్‌కల్, పుల్‌కుర్తి, కంగ్టి, ఉస్మాన్‌నగర్‌లోనూ ఇంటర్ తరగతులు నిర్వహించనున్నారు. వీటిలో జూన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఒక్కో పాఠశాలకు 80 సీట్లు కేటాయిస్తారు. అనాథ, పేద బాలికలు వీటిలో చదువుకునే అవకాశం కల్పిస్తారు.కొత్త కోర్సులకు అవకాశంకస్తూర్బాల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు మాత్రమే అమలు చేసేవారు. వచ్చే ఏడాది నుంచి మరిన్ని కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎంఎల్‌టీ, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కోర్సులు కూడా అందుబాటులోకి వస్తాయి.

# కార్తెలు పలకరించక ముందే.. కాడిని కట్టండి

గరిడేపల్లి: యాసంగి పంట చేతికి వచ్చింది. ముందుగా పంట అమ్మిన రైతులకు సొమ్ము చేతికందింది. ఆలస్యంగా కోతలు కోసిన రైతులకు మరో వారంలో అందుతుంది. ఈలోగా రైతులు ఖాళీగా కూర్చోకుండా వానాకాలం పంటకు ప్రణాళిక వేసుకోవాలి. పూర్వం రైతులు కార్తెల ప్రకారం పంటలు వేసేవారు. కత్తెర పంట పూర్తవగానే ఆరుద్ర కార్తెలో మెట్ట పంటలకు దుక్కులు సిద్ధం చేసుకునే వారు. నాగలి, గొర్రు, గుంటక, దంతె ఇలా చెక్కతో చేసే పరికరాలన్నీ వడ్రంగి వద్ద చెట్టుకింద కొలిమి పెట్టి బాగు చేయించేవారు. ఎంత ఎండ ఉన్నా నీడలో కూర్చుని చేసే పనులను పగలంతా చేసేవారు. అవసరమైతే దుక్కులు దున్నడానికి వేకువజామునే వెళ్లి మధ్యాహ్ననికి ఇంటికి వచ్చేవారు. ఇప్పుడు రైతులు ట్రాక్టర్లతో వ్యవసాయం చేస్తున్నం దున ట్రాక్టర్ల మరమ్మతులు, దున్నడానికి అవసరమైన కల్టివేటర్, పడ్లర్, రోటోవేటర్, కేజీవీల్స్, గొర్రు వంటివి సిద్ధం చేసుకోవాలి. ఇళ్లల్లో పశువుల ఎరువు ఉంటే పొలానికి తోలుకోవాలి. తొలకరి వర్షం పడితే కరిగిపోయేలా చూసుకోవాలి. చేతిలో ఉన్న నగదు, వానాకాలానికి అయ్యే ఖర్చు అంచనా వేసుకోవాలి.

గత అనుభవాలను, చుట్టు పక్కల రైతులు వేసిన అధిక దిగుబడినిచ్చే వంగడాలు, తెగుళ్లు, పురుగుల తాకిడి తట్టుకునే రకాలు తెలుసుకోవాలి. అవి ఎక్కడ లభ్యమవుతాయో సమాచారం తెలుసుకోవాలి. ఇప్పుడు



తెచ్చుకుంటే ఇంట్లో లేదా కొట్టులో ఎలుకలు ఉండే అవకాశం ఉంది. తొలకరి వర్షాలు పడిన వెంటనే తెచ్చుకునేలా డబ్బు, సమాచారం సిద్ధంగా ఉంచుకోవాలి.

ఇటీవల మహబూబ్‌నగర్ ప్రాంతం నుంచి గొర్రెల మందలు వస్తున్నాయి. వాటిని పొలంలో ఉండేలా చేసి ఎరువు ఏర్పాటు చేసుకోవాలి. సేంద్రియ ఎరువుల కోసం జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి విత్తనాలు తెచ్చి జూన్‌లో చల్లుకోవాలి.

దుక్కుల వేడి తగ్గడంతో పాటు నేలకు భూసారం అందించే ఎరువు లభ్యమవుతుంది. ఇప్పుడు అధికంగా వేప పండ్లు, కాయలు దొరుకుతాయి. వాటిని సేకరించుకోవాలి. వానాకాలం కోసం వ్యర్థాలను సేకరించి వర్మీ కంపోస్టు, కంపోస్ట్ ఎరువులు తయారు చేసుకోవచ్చు. జీవ, వృక్ష సంబంధ కషాయాలు, జీవామృతం కోసం అవసరమైన మెటీరియల్ సేకరించుకోవాలి. ప్రధానంగా రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఏయే పోషకాలు లేవో వాటిని కచ్చితంగా వేసుకునేలా సంబంధిత పోషకాలను తెచ్చిపెట్టుకోవాలి.

వివిధ ప్రాంతాలలో(పరిశోధనా స్థానాల్లో) కొత్తగా వచ్చే హైబ్రిడ్, అధిక దిగుబడినిచ్చే రకాలు తెచ్చుకోవాలి. ఇప్పుడు హడావుడి లేకుండా చూసుకుంటే నైరుతి రుతు పవనాలు రాగానే సాగుకు సన్నద్ధం కావచ్చు.

# కొత్త పరిశ్రమలొస్తున్నాయ్!

సంగారెడ్డి : జిల్లా జనాభా: 15.27లక్షలు

యువత: 7.20లక్షలు

కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు అందిన దరఖాస్తులు: 501

పెట్టుబడి వ్యయం(అంచనా): రూ.18,097 కోట్లు

ఉపాధి: 21,477 మందికి..

పారిశ్రామికంగా జిల్లా ఇప్పటికే ముందంజలో ఉంది. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలోనే ఉండటం యువతకు కలిసివచ్చే అంశం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం ఇక్కడ ఉపాధి అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. జిల్లాలో కొత్తగా మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే అనుమతుల కోసం సంబంధిత శాఖలకు దరఖాస్తులు అందాయి. ఈ నేపథ్యంలో యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుంది. **ప్రక్రియ వేగవంతం..**

జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు అన్ని రకాల వనరులు అందుబాటులో ఉండటంతో ఎక్కువ మంది పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. పరిశ్రమ ఏర్పాటుచేయాలంటే గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా సమస్యలు లేవు. టీజీఐపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేస్తే సరిపోతుంది. 18 ఏళ్లకు పైబడిన వారెవరైనా సూక్ష్మ, మధ్యతరహా, భారీ పరిశ్రమల ఏర్పాటు కోసం టీజీఐపాస్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ఇస్తోంది. పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు దక్కించుకోవాలంటే యువత నైపుణ్యాలు పెంచుకోవడం ముఖ్యం. ఐటీఐ, డిప్లొమా కోర్సుల్లో చేరిన విద్యార్థులు నూతన సాంకేతిక యంత్రాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలి. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిభ చాటితే ఉద్యోగావకాశాలకు కొరత లేదు.

**జిల్లా అభివృద్ధికి దోహదం**

జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధికి బాటలు పడనున్నాయి. పరిశ్రమ ఏర్పాటు చేసిన గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు యాజమాన్యాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద కూడా జిల్లా యంత్రాంగానికి నిధులు అందజేస్తున్నారు. లాభాల్లో కొంత వాటాను సీఎస్ఆర్‌కు కేటాయిస్తున్నారు. ఇటీవల సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు అత్యాధునిక వసతులతో 18 తరగతుల సముదాయం సీఎస్ఆర్ నిధులతో నిర్మించారు.

**భారీగా పెట్టుబడులకు అవకాశం**

2024–25 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 501 పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తులు అందాయి. ఆయా పరిశ్రమలు నెలకొల్పేందుకు 837 అనుమతులు సంబంధిత శాఖల నుంచి రావాల్సి ఉండగా.. ఇప్పటికే 568 అనుమతులు మంజూరు చేశారు. కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమలతో జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. భారీగా పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం విశేషం. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ద్వారా అనుమతుల ప్రక్రియను సైతం వేగవంతం చేశారు. అతి త్వరలోనే పరిశ్రమలన్నీ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

**జాప్యానికి తావులేకుండా..** –తుల్జానాయక్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్పరిశ్రమల ఏర్పాటుకోసం టీజీఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. నిబంధనలకు అనుగుణంగా ఉంటే అనుమతులు వెంటనే జారీ చేస్తున్నాం. యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

# గాడి తప్పుతున్న జల శుద్ధి



కరీంనగర్ : కరీంనగర్ నగరానికి తాగునీటి అవసరాలకు దిగువ మానేరు జలాశయాన్ని వినియోగిస్తున్నారు. ఇక్కడి నుంచి నీటిని శుద్ధి కేంద్రానికి తరలిస్తారు. అనంతరం రిజర్వాయర్ల గుండా గొట్టపు మార్గంలో ప్రతి ఇంటికి నల్లాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ప్రైవేటు డబ్బా నీళ్ల కంటే ఎక్కువగా శుద్ధి చేస్తూ.. నాణ్యతపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తుండటంతో అధిక శాతం ప్రజలు నల్లా నీటినే పలు రకాలుగా వడబోసి తాగుతున్నారు. ఆ నీటి విషయంలో ఈ మధ్య నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఆలం, క్లోరినేషన్ నిల్వలు లేకపోవడంతో నీటిశుద్ధి ప్రక్రియ ఎలా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**పరీక్షలు చేశాకే రిజర్వాయర్లకు...**

నగరానికి హైలెవల్ జోన్‌కు మిషన్ భగీరథ ద్వారా, లోలెవల్‌కు పాత ఫిల్టర్‌బెడ్ ద్వారా నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ దగ్గర ఎలాంటి ఇబ్బంది లేకపోగా, పాత ఫిల్టర్‌బెడ్ దగ్గర మూడు నెలలుగా ఆలం నిల్వలు లేకపోవడంతో క్లోరినేషన్‌తోనే శుద్ధి చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాం నుంచి వచ్చే రావాటర్‌ను బెడ్స్‌లలో పలుమార్లు శుద్ధి చేసిన తర్వాత ఆలం పాయింట్‌కు వెళ్తాయి. అక్కడ మురికి నీటిని తెల్లగా చేసి క్లోరినేషన్ దగ్గరకు చేరుస్తారు. ఇక్కడ పరీక్షలు చేసిన తర్వాత రిజర్వాయర్లకు నీటిని పంపిణీ చేస్తున్నారు.

**వర్షాకాలంలో ఇదేంటి..**

వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో జల నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. కొత్తగా వచ్చే నీరు కలిసి సమస్యలు వచ్చే అవకాశముంటుంది. మురికి, మలినాలతో వచ్చే నీటిని శుద్ధి చేయాలంటే కచ్చితంగా ఆలం అవసరమే. అప్పుడే నీటి రంగు మారుతోంది. లేదంటే మురికిగా వస్తున్నాయనే ఫిర్యాదులు వచ్చే అవకాశముంది. ఇప్పటికే ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేసేందుకే నానావస్థలు పడుతున్నారు. పలుచోట్ల నీరు కలుషితం అవుతుందని అంటున్నారు. దాంతో రిజర్వాయర్ల దగ్గర అప్పుడప్పుడు బ్లీచింగ్ పౌడర్ కలుపుతున్నారు.


**సరఫరాలో జాప్యం..**

నీటిశుద్ధి కేంద్రంలో ఆలం, క్లోరినేషన్ సిలిండర్లు ఎప్పటికప్పుడు నిల్వ ఉంచుకోవాల్సి ఉండగా మూడేళ్లుగా ఎప్పటికప్పుడే సరఫరా చేస్తుండటంతో నీటి నాణ్యతపై ప్రభావం పడుతోంది. సరఫరా చేసే సమయంలో ఆలస్యం జరిగితే పరిస్థితి ఏమిటనే విషయాన్ని గుర్తించడం లేదు. నీటిని శుద్ధి చేసేందుకు రోజుకు 50 కిలోల ఆలం అవసరం ఉంటుంది. వారానికి ఒక క్లోరినేషన్ సిలిండర్ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఆలం లేకపోవడంతో నెలకు 12 క్లోరినేషన్ సిలిండర్లు వాడుతున్నట్లు సమాచారం.

**నిల్వ ఉండేలా ఆదేశాలు**

నీరు శుద్ధి చేసేందుకు కావాల్సిన ఆలం, క్లోరినేషన్ సిలిండర్లు నిల్వ ఉండేలా ఆదేశాలు జారీ చేశాం. కొత్తగా నీరు వచ్చే సమయంలో అవసరముంటుంది. సరఫరాలో ఆలస్యం చేయడంపై చర్యలు చేపట్టాం. కచ్చితంగా నీటి శుద్ధిని పరిశీలించిన తర్వాతే సరఫరా చేస్తాం.
ఆర్.యాదగిరి, ఈఈ, కరీంనగర్ నగరపాలిక

# నిండు జీవితం.. ఘర్షణలతో హతం



సిరిసిల్ల : మానవత్వం మంటగలుస్తోంది. కారణం ఏదైనా హత్యలకు దారితీస్తోంది. జిల్లాలో తరచూ దారుణాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది అయిదు నెలల్లో ఏడు హత్యలు జరిగాయి. మొన్నటికి మొన్న చందుర్తిలో ప్రధాన రహదారిపై కిరాతకంగా హత్యచేసి వచ్చి పోలీసులకు లొంగిపోయిన తీరు భయోత్పాతాన్ని సృష్టిస్తోంది.

**పట్టు సడలుతున్న నిఘా**

జిల్లాలో నిఘా వ్యవస్థ పట్టు కోల్పోతోంది. నేరం జరిగిన తర్వాత పోలీసులు హడావుడి చేస్తున్నారు. చందుర్తికి చెందిన మనోజ్ 2023 సెప్టెంబరు 23న గంగారాం అనే వ్యక్తిని హత్యచేశాడు. అప్పుడు అతను మైనర్. జైలుకు వెళ్లి వచ్చాడు. తర్వాత అతనిపై నాలుగు కేసులు నమోదయ్యాయి. 2024లో రౌడీ షీట్ తెరిచారు. నిత్యం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిరావడంతో అక్కడి సిబ్బందితో కలివిడిగా ఉంటున్నాడు. ఈ నెల 26న హత్య జరిగిన రోజు ఓ ప్రేమ జంట ప్రేమ వ్యవహారంలో మధ్యవర్తిత్వానికి వెళ్లినట్లు సమాచారం. అలాగే ఒక వ్యక్తిని గంజాయి కేసులో ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. ఈ కేసు విచారణలో తప్పని తేలడంతో ఇద్దరు కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారులు మెమోలు జారీచేశారు. జిల్లాలో 121 మందిపై రౌడీషీట్లు ఉన్నాయి. వీరు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు తరచూ వెళ్తున్నారు. వీరిలో చాలా మందిని పోలీసులు ఇన్ఫార్మర్లుగా మార్చుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని వారు గ్రామాల్లో మరింతగా రెచ్చిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చందుర్తి ఘటనలో మల్లవ్వ కుటుంబసభ్యులు తమకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ హత్య జరిగిన రోజు కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

**శిక్షలు తక్కువే..**

జిల్లాలో జరుగుతున్న హత్యల్లో జీవితకాలం, పది సంవత్సరాలకు పైగా శిక్షలు పడుతున్నవి తక్కువే. 2023, 2024లో ముగ్గురు చొప్పున జీవితకాల శిక్షలు పడగా పది సంవత్సరాలు శిక్షలు పడింది అయిదుగురికి మాత్రమే. హత్యలు చోటు చేసుకున్న తర్వాత హంతకులు బాధిత కుంటుంబ సభ్యులను బెదిరించడం ఇతర మార్గాల్లో పైరవీలతో రాజీకి ఒప్పిస్తున్నారు. పోలీసుల హత్య కేసులు త్వరగా పరిష్కరించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచి నిందితులకు శిక్షలు పడేలా చేస్తే ఇలాంటి రాజీలకు తావుండదు.

**ఇటీవలి ఘటనలు ఇలా..**

మే 27న చందుర్తికి చెందిన మల్లవ్వ కుటుంబ సభ్యులతో హత్యచేసిన మనోజ్ కుటుంబసభ్యులకు కొంత కాలంగా భూవివాదం కొనసాగుతోంది. పోలీసులు, పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. ఎలాగైనా మల్లవ్వను అడ్డు తొలగించుకోవాలని భావించి తన తల్లి మోహినవ్వ ప్రోత్సాహంతో మనోజ్ హత్య చేశాడు.

ఏప్రిల్ 13న వేములవాడకు చెందిన పర్శరాములు కొన్నేళ్లుగా అతని మిత్రులతో కలిసి గంజాయి విక్రయించేవాడు. కొన్ని రోజులకు అతను ఆ దందా నుంచి పక్కకు తప్పుకున్నాడు. ఇతర పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గతంలో పనిచేసిన వారిపై పలు కేసులు నమోదయ్యాయి. పర్శరాములే గంజాయి రవాణా సమాచారం పోలీసులకు అందజేస్తున్నారని మిత్రులు అనుమానపడ్డారు. ఈ క్రమంలోనే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

# సీసీ లైనింగ్ పనులకు అంచనాలు సిద్ధం



గుర్రంపోడు : ఏఎమ్మార్ ప్రాజెక్టు ప్రధాన కాల్వ సీసీ లైనింగ్ పనుల ప్రతిపాదనలను సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. నేడో, రేపో ఈ ప్రతిపాదనలపై ప్రాజెక్టు సీఈ అనుమతి తీసుకోగానే ఎక్కడి పనులకు అక్కడే టెండరు నోటీసులు ప్రకటించనున్నారు. ఏప్రిల్ 30న ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ సీసీ లైనింగ్ పనులకు రూ.442 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతిని ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో నాటి నుంచి ప్రాజెక్టు అధికారులు సీసీ లైనింగ్ అంచనాల తయారుచేయటం ప్రారంభించారు. పుట్టంగండి నుంచి గుర్రంపోడు సమీపంలోని హెడ్‌రెగ్యులేటర్ (ప్రధాన కాల్వ 23.500 కి.మీ. నుంచి 47 కిలోమీటరు వరకు) రూ.99 కోట్లతో అంచనాలు సిద్ధం చేయగా, గుర్రంపోడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి పానగల్ ఉదయ సముద్రం వరకు (47.760 కి.మీ నుంచి 93.530 కి.మీ) రూ.171.55 కోట్లు, ఉదయ సముద్రం దిగువ నుంచి మూసీ వరకు (100 కి.మీ నుంచి 136.కి.మీ ) రూ.93.6 కోట్లు అంచనాలు సిద్ధం చేసినట్లు అధికారి ఒకరు వెల్లడించారు. రూ.78 కోట్లు సీనరేజీ ఛార్జీలకు, మట్టి, కంకర పనులకు సంబంధించి అనుమతుల ఫీజులు, 0.1 శాతం ప్రొవిజన్ టవర్స్ ఎన్ఏసీ ఛార్జీలు, 1 శాతం ప్రొవిజన్ టవర్స్ లేబర్ ఛార్జీలు, 18 శాతం జీఎస్టీ చెల్లింపులకు వినియోగిస్తారు. అంతేకాక అయిదు శాతం ఈవీసీ, కరెంటు స్తంభాలను మార్చటం, ఇంజినీర్లకు కొలతలకు టేపులు, క్రాస్‌టాప్ వంటి సామగ్రి కొనుగోళ్లు, సైన్ బోర్డులు, ఫొటోగ్రఫీ, ఇతరాల కోసం ఖర్చు చేయాల్సి ఉంది. ఎస్ఎస్ఆర్ 2024–25 రేట్ల ప్రకారం వీటిని తయారు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే పనులకు టెండర్లు ప్రకటించి పనులను గుత్తేదారులకు అప్పగించనున్నట్లు చెబుతున్నారు. **కాల్వ తవ్వి 40 ఏళ్లకు పైనే**

ప్రధాన కాల్వ 1985 నుంచి 1988 వరకు తవ్వకం పనులు సాగాయి. అవి పూర్తయి సుమారు 40 ఏళ్లకు పైనే కాగా 2001లో నీటిని విడుదల చేశారు. ఈ మధ్య కాలంలో ప్రధాన కాల్వ చాలా చోట్ల కోతకు గురైంది. ప్రధానంగా గేట్లు రెండు వైపులా రెండు నుంచి నాలుగు అడుగుల మందం మట్టి కొట్టుకు పోయినట్లు చెబుతున్నారు. ఇంకా చాలా చోట్ల కంప చెట్లు పెరిగి గట్టు దెబ్బతిన్నాయి. తొలుత కోతకు గురైనా మట్టిని పునరుద్ధరించిన అనంతరం దానిపై 100 మిల్లీ మీటర్ల మందంతో సీసీ వేస్తారు.

# పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం–ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.

ముఖ్యాంశాలిలా..

మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం

ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు.ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.

ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ–ఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.

పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ
ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

# నాణ్యతా ప్రమాణాలు పట్టేదెవరికి?

పెద్దపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్దేశించిన ఈ–నామ్ వ్యవస్థ వ్యాపారులకు వరంగా మారింది. పెద్దపల్లి మార్కెట్‌లో రైతులు తెచ్చిన పత్తికి నాణ్యతతో సంబంధం లేకుండా ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ విషయంలో భారత పత్తి సంస్థ(సీసీఐ) చెల్లించే మద్దతు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో 8 శాతం తేమ కలిగిన పత్తి క్వింటాలుకు రూ.7,520 ఉండగా ఇటీవల నాణ్యత తగ్గిందనే ఉద్దేశంతో సీసీఐ మద్దతు రూ.7,430కు కుదించింది. పత్తిలోని వివిధ ప్రమాణాల స్థాయిని బట్టి మద్దతు ధర అటు ఇటుగా మారుతోంది. **పట్టించుకోని అధికారులు**సీసీఐ పత్తిలో 8–12 వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుంది. నిబంధనల ప్రకారం ఒక శాతం తేమ పెరిగితే ధర కూడా ఒక శాతం తగ్గుతుంది. 12 శాతం ఉంటే రూ.7,132కు కొనుగోలు చేస్తుంది. ఈ నిబంధనను వ్యాపారులకు వర్తింపజేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ 18 శాతం ఉండగా ధర రూ.5003గా నిర్ణయించారు. ఈ మేరకు సంచిపై మార్కర్‌తో రాశారు. నిబంధనల ప్రకారం రూ.6,687 వరకు చెల్లించాలి. మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరను ప్రామాణికంగా తీసుకున్నా రూ.6,319 చెల్లించాలి. శుక్రవారం మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,022 వరకు నమోదైంది. అయితే ఇవేవీ వ్యాపారులకు ప్రామాణికంగా కనిపించడం లేదు.

**వ్యాపారికి నచ్చిందే ధర**

పెద్దపల్లి మార్కెట్‌లో 11 మంది క్రియాశీలక అడ్తీదారులుండగా వీరి వద్ద 7 నుంచి 8 మంది కొనుగోలుదారులు ఖరీదు చేస్తున్నారు.

వారం రోజులుగా ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులే తీసుకుంటున్నారు. మిల్లర్లు మార్కెట్‌వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక ఆన్‌లైన్‌లో ఇతర మార్కెట్‌కు చెందిన ట్రేడర్లు కొనుగోలు చేసే స్థాయిలో వ్యవస్థం అభివృద్ధి చెందలేదు. నాణ్యతను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. సిబ్బందిని కూడా నియమించలేదు.

# బుక్కుతున్న డిపాజిత్తులు

నంద్యాల : పాములపాడు మండలం కనకయ్య కొట్టాలలో కేసీ కాల్వ 13వ డిస్ట్రిబ్యూటరీలో పనులు చేసినట్లు ఎం.బుక్కులు చేశారు. రూ.1.40 కోట్లతో చేసిన ఈ పనులకు సంబంధించి రూ.70 వేల డిపాజిట్ మొత్తం తిరిగి చెల్లించేందుకు రూ.5 వేల వరకు వసూలు చేశారు. బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలం వరకు జరిగిన పనులకు ఒక్కో బిల్లుకు రూ.1500 వరకు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. కేసీ కాల్వ పరిధిలో 2018లో చేసిన నీరు– చెట్టు పనుల డిపాజిట్ మొత్తాలకు సంబంధించి కొన్ని రోజులుగా ఎం.బుక్కులు చేస్తున్నారు. ఆయా పనులకు తుది(ఫైనల్) బిల్లు చేయాలంటే కచ్చితంగా నిర్ణీత మొత్తం లంచం ఇవ్వాల్సిందేనని కొంతమంది అధికారులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బిల్లులు చేయడం లేదని గుత్తేదారులు గగ్గోలుపెడుతున్నారు.

కార్యాలయంలో కాసుక్కూర్చున్నారు

ఉమ్మడి జిల్లా పరిధిలో కేసీ కాల్వ పొడవునా 2 వేల వరకు పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి గుత్తేదారులకు డిపాజిట్ మొత్తం రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సిన ఉంది. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 ఎం.బుక్కులకు సంబంధించి రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. 500 మంది గుత్తేదారులకు ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ.27 వేలు చొప్పున డిపాజిట్ మొత్తాలు తిరిగి ఇవ్వాల్సి ఉంది. రూ.27 వేలు రావాల్సిన గుత్తేదారుల నుంచి రూ.1500, రూ.70 వేలు రావాల్సిన వారి నుంచి రూ.2,500 వరకు కేసీ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవ్వకుంటే పక్కన పెట్టేస్తారుఅడిగినంత ఇవ్వకుంటే ఎం.బుక్కులు కార్యాలయాల్లోనే ఉండిపోతున్నాయి. ఈ మొత్తాలు త్వరగా ఇస్తే పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి వెళ్తాయి. లేదంటే కేసీ కార్యాలయా ల్లోనే పేరుకుపోతున్నాయి. నందికొట్కూరు, బండిఆత్మకూరు, గడివేముల, శిరివెళ్ల మండలాలకు చెందిన కొన్ని పనులకు అడిగినంత ఇవ్వకపోవడంతో రోజులకొద్దీ ఎం.బుక్కులు కార్యాలయంలోనే ఉండిపోయాయి. చివరికి గుత్తేదారులు దిగొచ్చాకే బిల్లులయ్యాయి. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ గుత్తేదారు అధికారులను ప్రసన్నం చేసుకోవడంతో పెద్ద మొత్తంలో బిల్లులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రూ.350 కోట్ల పనులకు చెల్లింపులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కేసీ కాల్వ పరిధిలో 2018లో నీరు– చెట్టు పనులు జరిగాయి. వీటిని సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం రాజోలి వరకు సుమారు 180 కి.మీల పొడవున చేపట్టారు. రూ.350 కోట్లు వెచ్చించి చెరువుల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, ఆయకట్టు పరిధిలోని పొలాల్లో మట్టి రహదారులు వంటి పనులు చేశారు.

చురకలు

మంగళవారం 3 జూన్ 2025

# కన్నేస్తే కనిపెట్టేస్తారు

హైదరాబాద్ : నగర శివారు ప్రాంతాల్లో చెరువులు, జలవనరుల ఆక్రమణకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. ప్రతి చెరువు, జలవనరుకు సంబంధించిన వివరాలను సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాల్లోని చెరువుల్లో అరవై శాతానికిపైగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, ప్రధానంగా ఐటీ కారిడార్, ఉప్పల్, మేడ్చల్ చుట్టూ విస్తరించి ఉన్నాయి. ఈ క్రమంలో ఆక్రమణలు, కబ్జాలకు గురికాకుండా గ్రామ నక్షాలు, సర్వే, డిజిటల్ సర్వే నిర్వహించి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను నిర్ధారిస్తున్నారు. అనంతరం ప్రతి చెరువుకు జియోట్యాగ్ చేసి వివరాలను హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. చెరువులు, జలవనరుల రక్షణకు రెండు జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు స్థిరాస్తి వెంచర్ల సమీపంలోని చెరువులను తరచూ పరిశీలించి ఫొటోలు, వీడియోలు తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాయి. చెరువుల వద్ద సీసీ కెమెరాలు పెట్టనున్నారు.

**గుర్తించిన అంశాలు**



గ్రామ నక్షాలు, సర్వే ఆధారంగా చెరువులకు సమీపంలో వెంచర్లు వేసిన, భవనాలు నిర్మించిన వారిలో కొందరు బఫర్‌జోన్‌లను ఆక్రమించినట్లు గుర్తించారు. శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని తేల్చారు. వందకుపైగా చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లను మార్చేసినట్లు తేలింది.కుత్బుల్లాపూర్ మండలంలో బఫర్‌జోన్‌లో ఓ వ్యక్తి విల్లాలు నిర్మించగా వాటిని కూల్చి హద్దులు ఏర్పాటు చేశారు.

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చెరువులు: 2094
సర్వే చేసేందుకు గుర్తించినవి 1698
ప్రాథమికంగా పూర్తయినవి 1189
వెబ్‌సైట్‌లో నమోదైనవి 275

# అప్రమత్తతే.. ప్రాణాలకు రక్ష

జగిత్యాల : విద్యుదాఘాతంతో ప్రాణనష్టాన్ని నివారించేందుకు విద్యుత్తు సంస్థ ఈనెల 7 వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తోంది. సిబ్బందికి విద్యుత్తు ప్రమాదాల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూనే ప్రజలు విద్యుదాఘాతానికి గురికాకుండా ఉండేందుకు అవగాహన కల్పించే చర్యలు క్షేత్రస్థాయిలో ఈ వారం రోజులపాటు తీసుకోనున్నారు. మొదట విద్యుత్తు సిబ్బందికి భద్రత సూచనలపై అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రత్యేక చర్యలు**

ఇటీవల విద్యుత్తు సంస్థ ఆన్‌లైన్ లైన్ క్లియర్(ఎల్‌సీ) విధానాన్ని తీసుకొచ్చిన విషయం విదితమే. ఇందులో క్షేత్రస్థాయి అధికారికి ఆన్‌లైన్‌లో లైన్ క్లియరెన్స్ ఎందుకోసం తీసుకుంటున్నామనే దానిపై సమాచారం ఇవ్వాలి. అనంతరం ఆపరేటర్‌కు ఆన్‌లైన్‌లోనే ఏ ఫీడర్‌కు లైన్ క్లియర్ కావాలో తెలియజేయాల్సి ఉంటుంది.

ఫీడర్ తాలుకా ఫొటో సైతం ఆపరేటర్ లైన్‌మెన్‌కు పంపాల్సి ఉంటుంది. ఇలా సంస్థ ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనుంది.

క్షేత్రస్థాయి సిబ్బంది లైన్ క్లియర్(ఎల్‌సీ) తీసుకున్న లైన్‌కు రెండు చోట్ల ఎర్తింగులు బిగించాలి. డబుల్ ఫీడర్ ఉంటే విద్యుత్తు కనిపెట్టే పరికరాన్ని వెంట తీసుకువెళ్లి ఫీడర్‌లో సరఫరా లేదనే విషయాన్ని నిర్ధారించుకోవాలి.



**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్తు స్తంభాలను, సంబంధిత ఉపకరణాలను ముట్టుకోరాదు.

పశువులను మేతకు తీసుకువెళ్లినప్పుడు అవి నియంత్రికలు, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలి.

ఇంట్లో నాణ్యమైన విద్యుత్తు ఉపకరణాలను వాడాలి.

మోటారు మరమ్మతు అర్హత కలిగిన మెకానిక్, ఎలక్ట్రీషియన్‌తో చేయించాలి.విద్యుదాఘాతానికి గురైన వారిని రక్షించడానికి వారిని నేరుగా పట్టుకోరాదు. కర్రతో విద్యుత్తు తీగను వేరు చేయాలి.

తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఉన్న తక్కువ ఎత్తులోని విద్యుత్తు తీగలను తాకకూడదు. వీటిని గమనించిన వెంటనే స్థానిక విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారుల చరవాణి నంబర్ లేకుంటే విద్యుత్తు సంస్థ ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేయాలి.

**వ్యవసాయ మోటార్ల వద్ద..**

రైతులు వ్యవసాయ మోటారుతోపాటు, స్టార్టర్ బాక్సులకు ఎర్తింగ్ చేయించుకోవాలి మోటారుకు వినియోగించే తీగ అతుకులు లేకుండా చూడాలి. వ్యవసాయ క్షేత్రంలో నేలపై ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్తు వైర్లు వేయరాదు స్టార్టర్ బాక్సులు ఇనుప వాటి స్థానంలో ప్లాస్టిక్ డబ్బాలు వాడాలిప్రతి రైతు తన వెంట టెస్టర్ తీసుకువెళ్లడం ఉత్తమం

**అవగాహన కల్పిస్తున్నాం** విద్యుత్తు విషయంలో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు జరుగుతుంటాయి. రైతులు, వినియోగదారులు ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలి. వారోత్సవాల్లో భాగంగా అధికారులు, సిబ్బంది భద్రత చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.
రమేశ్‌బాబు, ఎస్ఈ, కరీంనగర్

# అక్రమ లేఅవుట్లపైకి బుల్డోజర్లు



హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పరిధిలో సర్వే నంబరు 124, 125లో 20 ఎకరాలలో హౌసింగ్ సొసైటీ పేరుతో లేఅవుట్ వేసి విక్రయించారు. అనంతరం లేఅవుట్‌లోని రహదారులు, పార్కుల కోసం కేటాయించిన స్థలాలను కబ్జా చేసి వాణిజ్య నిర్మాణాలు చేపట్టారు. ఓ కన్వెన్షన్ సెంటర్‌ను కట్టారు. దీనిపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.మేడ్చల్ జిల్లా పోచారం పుర పరిధి అన్నోజిగూడలో సర్వే నంబరు 9, 10లో పది ఎకరాల్లో లేఅవుట్ వేశారు. పార్కు, ఇతర సామాజిక అవసరాల కోసం వదిలిన ఎకరా స్థలంలోనూ ప్రస్తుతం లేఅవుట్ వేసి యజమాని విక్రయిస్తున్నట్లు హైడ్రాకు ఫిర్యాదులు రావడంతో వెంటనే చర్యలకు ఉపక్రమించారు. నిన్నా మొన్నటి వరకు చెరువులు, ప్రభుత్వ ఆక్రమణలపై కన్నెర్రజేసిన హైడ్రా కొద్దిరోజులుగా అక్రమ లేఅవుట్లు, సామాజిక స్థలాల కబ్జాలపై బుల్డోజర్లను పంపిస్తోంది. లేఅవుట్లపై కొద్దిరోజులుగా హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**లేఅవుట్ల ఆక్రమణల తీరు** హెచ్ఎండీఏ పరిధిలో లేఅవుట్లను వేసే ముందు అనుమతులు తీసుకోవాలి. వ్యవసాయ భూమికి ముందుగా భూమార్పిడి రుసుము చెల్లించాలి. లేఅవుట్‌లో 10 శాతం స్థలాన్ని సామాజిక ప్రయోజనాలకు, పార్కు ఇతరత్రా అవసరాలకు వదిలిపెట్టాలి. రహదారులు 40, 60 అడుగులు ఉండాలి. ఇవన్నీ చేశాకే నివేశన స్థలాలు విక్రయించాలి. కొన్ని దశాబ్దాలుగా రియల్ వ్యాపారులు ఇవేమీ పట్టించుకోకుండా లేఅవుట్‌లను ఏర్పాటు చేశారు. తక్కువ ధరకే వస్తున్నాయని అనుమతులు లేకపోయినా చాలామంది కొనుగోలు చేశారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇలాంటి లేఅవుట్లు వేల సంఖ్యలో ఉన్నాయి. **అనుమతులు లేకుండానే..**

భూమార్పిడి, మ్యూటేషన్‌లు చేయకుండా స్థలాలు విక్రయించడంతో రెవెన్యూ రికార్డులు మారలేదు. దీంతో లేఅవుట్ వేసిన వ్యాపారులు రోడ్లను మూసేసి, పార్కుల కోసం వదిలివేసిన స్థలాలను తాజాగా విక్రయించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. మ్యూటేషన్ చేయకపోవడంతో ఆ భూమి వారసులు తమదేనంటూ కొత్త వివాదాలు సృష్టిస్తున్నారు. రికార్డులు చూస్తే భూమి పట్టాదారు పేరుపై ఉంటోంది. చేసేది లేక కొనుగోలుదారులు పట్టాదారులు అంటూ వస్తున్న వారసులతో 'బేరాలు' కుదుర్చుకుని రాజీ చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వడంతో చాలామంది సామాజిక ప్రయోజనాల కోసం వదిలిన స్థలాలను రూ.కోట్లలో విక్రయించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.

**స్వరూపం మార్చితే చర్యలు- ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్**

లేఅవుట్ల స్వరూపం మార్చినా.. రహదారులకు అడ్డంగా ప్రహరీలు నిర్మించినా కఠిన చర్యలు ఉంటాయి. ప్రజావసరాలకు వదిలిన స్థలాలను ఆక్రమించి విక్రయిస్తున్నారు. ఇలాంటి ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం.

# అనుమతి మాటున.. అక్రమాల మేట!



తాండూరు : ఇసుక అక్రమ రవాణా భూగర్భ జలాలను అడుగంటిపోయేలా చేస్తోంది. కొందరి ధనార్జన అందరి ప్రయోజనాలను కాలరాసేలా చేస్తోంది. ప్రభుత్వ పనుల పేరిట కాగ్నా నదిలో ఇసుక తరలింపునకు అనుమతులు పొందుతూ.. ఇష్టానుసారం తోడేస్తున్నారు. ఈ అక్రమాలకు కట్టడి చేయాల్సిన వారే ఇందులో భాగస్వామ్యం కావడం శోచనీయం. వీరి తీరుతో నీటితో కలకలలాడాల్సిన కాగ్నా అడుగంటిపోయింది.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రహదారులు, ట్యాంకులు, కాల్వలు, ప్రభుత్వ భవనాలు వంటి నిర్మాణాలకు అవసరమైన ఇసుక పొందేందుకు రెవెన్యూ అధికారులు అనుమతి పత్రాలు జారీ చేస్తున్నారు. తాండూరు మండలం ఖాంజాపూర్, పాతతాండూరు కాగ్నా నదిలోంచి ఇసుక తరలించేందుకు అనుమతి ఇచ్చారు. దూరం ప్రకారం రోజుకు ఒక్కో ట్రాక్టర్‌లో 4 ట్రిప్పులు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు తరలించాలన్నది నిబంధన. అయితే క్షేత్రస్థాయిలో కొందరు ఆరు నుంచి ఎనిమిది ట్రిప్పులు తరలించి, ఇసుక మేటలను కొల్లగొడుతున్నారు. రాత్రి 7గంటల వరకు దర్జాగా ప్రైవేటు పనుల వద్దకు చేరవేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.4వేల నుంచి రూ.5వేలకు విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి ఇస్తున్న రెవెన్యూ, గనులు భూగర్భ శాఖల అధికారులు పర్యవేక్షణ చేయడం లేదు. దీంతో అక్రమ రవాణాకు అడ్డు లేకుండా సాగిపోతోంది.

సమాచారం ఇస్తే దాడులు..: కొందరు అర్ధరాత్రి కూడా తవ్వకాలు చేపడుతున్నారు. గతనెలలో వీర్‌శెట్టిపల్లి శివారు కాగ్నా నదిలో యాలాల మండలం అగ్గనూరుకు చెందిన వారు అర్ధరాత్రి ఇసుక తరలిస్తుండగా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను ఎస్సై జప్తు చేసి కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై ఇసుక తరలింపుదారులు దాడి చేసి గాయపరిచారు.

**అరికట్టాల్సిన వారే..:** ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కొందరు పోలీసులు అర్ధరాత్రి నది వద్దకు వెళ్లి ట్రాక్టర్లను జప్తు చేసి కేసు నమోదు చేస్తున్నారు. కొందరు ఇందుకు భిన్నంగా ఏకంగా ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. యాలాల మండలంలోని ఓ పోలీసు అధికారి రెండు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా ఖాంజాపూర్ కాగ్నా నది నుంచి ఇసుక రవాణా చేయిస్తున్నారు. అక్రమాన్ని అడ్డుకోవాల్సిన అధికారే ఇసుక తరలించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

నిఘా పెట్టి చర్యలుబాలకృష్ణారెడ్డి, డీఎస్పీ

కాగ్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణాపై సిబ్బందితో నిఘా పెట్టిస్తాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేస్తాం. అనుమతి ఇచ్చిన ప్రకారమే తరలించాలి. లేదంటే చర్యలు తప్పవు.


# నిధులు 'మురుగు'పాలు!

నల్గొండ: జిల్లా ఆసుపత్రిలో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ట్రీట్‌మెంట్ ప్లాంటు ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకుంటోంది. సంబంధిత గుత్తేదారు అసంపూర్తి పనులు చేసి చేతులెత్తేశారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**వ్యర్థాల నిర్వహణ ప్లాంటుపై నిర్లక్ష్యం**

ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం వేలాది మంది రోగులు రాకపోకలు సాగిస్తుంటారు.. రోజువారీ వచ్చే రోగులు కాకుండా వారితో పాటు బంధువులు, శ్రేయోభిలాషుల తాకిడి సైతం ఉంటుంది. వీరందరికీ సరిపడేలా జిల్లాసుపత్రిలో మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో ఉన్నాయి. నిత్యం వ్యర్థాలు చుట్టుపక్కల వదిలేయడంతో స్థానికుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని 2022లో పట్టణ ప్రగతి నిధుల కింద ప్లాంటు మంజూరైంది.

**సమన్వయ లోపం**జిల్లాసుపత్రిలో మాతాశిశు సంరక్షణ నుంచి మొదలు జనరల్, శస్త్ర చికిత్స, అత్యవసర, క్రిటికల్ కేర్, ఇతరత్రా 30 విభాగాలకు నిత్యం మిలియన్ లీటర్ల నీరు అవసరం అవుతుంది. దీనికి తోడు శస్త్రచికిత్సల సమయంలో, థియేటర్లు శుద్ధీకరణ చేసే సమయంలో వ్యర్థ నీళ్లు నిత్యం వృథా అవుతున్నాయి. ఆ నీటిని ఈ ప్లాంటుకు పంపించి శాస్త్రీయంగా శుద్ధి చేస్తే నీటి కొరత ఉండదు. భూగర్భ జల వనరులు సమతుల్యంగా ఉంటాయి. ఈ ప్లాంటును పురపాలక సంఘం పారిశుద్ధ్య విభాగం, సివిల్ పనుల గుత్తేదారులు పూర్తి చేయాల్సి



ఉన్నప్పటికీ తరచూ ఎన్నికలు రావడం, నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో వారు అనుసంధాన పనులు చేయకుండానే వెళ్లిపోయారు. ఆసుపత్రి విభాగాల నుంచి ఈ ప్లాంటుకు వ్యర్థ నీటి అనుసంధానం చేయకపోవడంతో మూడేళ్ల నుంచి నిరుపయోగంగానే ఉంది. ఆసుపత్రికి వెనుక వైపు ప్లాంటును నిర్మించినప్పటికీ అనుసంధాన పనులు అసంపూర్తిగా ఉండటం, మధ్యలో ఎన్నికల కోడ్, చేసిన పనులకు నిధులు సకాలంలో రాకపోవడం మూలంగా ఇలా ప్లాంటు మొత్తం ముళ్ల కంపతో కనిపిస్తోంది. ఈ విషయాన్ని పురపాలక శాఖ ఏఈ దిలీప్‌తో ప్రస్తావించగా ఇటీవలే తాను బాధ్యతలు స్వీకరించానని, ప్లాంటు నిర్మాణం పూర్తయ్యిందని ఆసుపత్రి వారే బాధ్యత వహించాలని తెలిపారు. జిల్లాసుపత్రి డాక్టర్ అరుణ కుమారి దృష్టికి తీసుకెళ్లగా పురపాలక శాఖ బాధ్యులు అసంపూర్తి పనులు చేశారని, ఆసుపత్రికి సంబంధం లేదని చెప్పడం గమనార్హం.

# అన్నదాతల్లో ఆశలు

జగిత్యాల : ఇటీవల రైతుల సాగుభూముల భూసార పరీక్షలు తగ్గినందున మట్టిపరీక్షలను తప్పనిసరి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించటంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తాయి. సాధారణంగా ప్రతి 2.5 ఎకరాలకొక నమూనాను తీసి విశ్లేషిస్తేనే కచ్చితమైన ఫలితాలు వస్తాయి. కానీ తక్కువ విస్తీర్ణంలో నమూనాలు తీయటం, ఫలితాలను ఆలస్యంగా ఇవ్వటంతో చాలామంది రైతులు ఆచరించటంలేదు. భూసార పరీక్షల్లేక, ఫలితాలు పొందినవారు కూడా రసాయన ఎరువుల మోతాదును విస్మరించటంతో సిఫారసుకన్నా 15-51 శాతం వరకు అధికంగా ఎరువులు వాడుతున్నారు. 2.5 ఎకరాలకొక మట్టినమూనాను విశ్లేషించాలన్న ప్రభుత్వం అంచనా ప్రకారం జిల్లాలోని భూమినిబట్టి కనీసం 1.75 లక్షల పరీక్షలు చేయాలి. ఒకసారి పరీక్షిస్తే మళ్లీ 2-3 సంవత్సరాల తరువాత మళ్లీ పరీక్షించాలి. ఎరువుల ధరలు, కాలుష్యం పెరిగిన నేపథ్యంలో భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగానే ఎరువుల మోతాదును నిర్దేశించుకోవటం అవశ్యంగా మారింది.

జిల్లాలో సరైన విశ్లేషణకేంద్రం లేక మట్టినమూనాలను కరీంనగర్‌కు పంపించాల్సి వస్తుండగా జిల్లాలోనే పూర్తిస్థాయి పరీక్షలకు ఇకమీదట ఏర్పాట్లు చేయాలి. 71 ఏఈవో క్లస్టర్లలోని రైతు వేదికల్లో మినీ భూసార పరీక్ష కేంద్రాలకు నిధులు విడుదల చేసి వినియోగంలోకి తేవాలి.



అధికారుల సిఫారసు మేరకు జగిత్యాలలో రూ.60 లక్షల నిధులతో భూసార పరీక్ష కేంద్రాన్ని నిర్మించాలి. చల్‌గల్ వాలంతరి ప్రదర్శన క్షేత్రంలోని ల్యాబ్‌ను వినియోగించటం, పొలాస వ్యవసాయ కళాశాల, పొలాస పరిశోధనస్థానంలోనూ భూసార పరీక్షలు చేయించటంద్వారా భూసార పరీక్షల సంఖ్యను పెంచవచ్చు. కేంద్రం సూచించినట్లుగా భూసార పరీక్ష ఫలితాల కార్డులున్నవారికే రసాయన ఎరువులను విక్రయించాలి. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించి భూసార పరీక్షలను చేయించాల్సి ఉంది.

**సమగ్ర వివరాలతో కార్డులివ్వాలి**

ప్రతి మొక్క తన జీవిత చక్రం పూర్తి చేసుకోవడానికి 17 రకాల పోషకాలు అవసరం. వీటిలో కర్బనం, ఆక్సిజన్, హైడ్రోజన్, నీరు, బొగ్గుపులుసు వాయువు, ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, ద్వితీయ పోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్‌తో పాటు సూక్ష్మపోషకాలైన ఐరన్, జింక్, కాపర్, బోరాన్, నికెల్, మాలిబ్దినం, మాంగనీస్ ఉండాలి. భూసార పరీక్షల ద్వారా ప్రధాన, ద్వితీయ, సూక్ష్మపోషకాల శాతం తెలిస్తే మనం వేయాల్సిన ఎరువుల శాతం తెలుస్తుంది. భూమి స్వభావం పీహెచ్ స్థాయి అంటే ఆమ్ల గుణమా క్షార గుణమా, మధ్యస్థమా అనే వివరాలు, ఎలక్ట్రో కండక్టివిటీ (ఈసీ) లవణాల మోతాదును, సస్యరక్షణ సిఫారసులు తెలుస్తాయి కాబట్టి రైతులందరి నేలలను పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.రైతుభరోసా పోర్టల్‌లో జిల్లాలోని సాగుదారులు: 2.41 లక్షలు
మొత్తం సాగుయోగ్య భూమి: 4,33,801 ఎకరాలు
భూసార పరీక్షలు చేసిన భూమి: 55,021 ఎకరాలు

# పడకేసిన బృహత్ ప్రణాళిక

ధర్మపురి : ధర్మపురి పట్టణంలో శాశ్వత, బృహత్తర ప్రాజెక్టులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. ఆలయ అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాను అమలు, కరకట్ట నిర్మాణాలు, భక్తులకు వసతులు, నదీ పరిశుభ్రత తదితర సమస్యలను పట్టించుకోవడంలేదు. గత పురపాలక కమిషనర్ శ్రీనివాస్ అనిశాకు పట్టుబడగా.. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా రాజశేఖర్ పనిచేస్తున్నారు. ప్రత్యేక అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ వ్యవహరిస్తున్నారు.

ధర్మపురి పట్టణంలో బృహత్ ప్రణాళిక చేపట్టాలని గత రెండేళ్ల కిందటే ఉత్తర్వులు వచ్చాయి. ఈ లోపు శాసనసభ ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. రూ.25 కోట్లతో పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా పనులు చేపట్టగా.. ఈ పనులు సగం వరకు పూర్తయి నిలిచిపోయాయి. స్థానికులు కంకర రహదార్లతో ఇబ్బందులు పడుతున్నారు. పటేల్ కూడలి నుంచి రహదారి విస్తరణ చేపట్టినా.. పనులు మధ్యలోనే ఆగిపోయాయి.

**వేతనాలకు ఎదురుచూపులు**

గత ఆర్థిక సంవత్సరం మున్సిపల్ ఆదాయం రూ.1.20 కోట్లు రాగా.. ప్రస్తుతం సిబ్బంది, కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఔట్ సోర్సింగ్ సిబ్బంది, కార్మికుల వేతనాలకు రూ.95 లక్షల నిధులు ప్రభుత్వం విడుదల చేసినా.. నేటికి చెల్లించలేదు. 51 మంది కార్మికులకు మూడు మాసాలుగా, 12 మంది కార్మికులకు 6 నెలల వేతనాలు రావాల్సి ఉంది. 2 ట్రాక్టర్లు, 1 స్వచ్ఛ ఆటో మరమ్మత్తులకు నోచుకోక మూలన పడ్డాయి.

**ప్రతిపాదన దశలోనే కరకట్ట నిర్మాణం**

వర్షాకాలంలో భారీగా వర్షాలు.. ఆపై కడెం జలాశయం నుంచి నీటి విడుదలతో ధర్మపురికి లక్షలాది క్యూసెక్కుల వరద నీరు చేరి వానాకాలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. ఈ సమస్య నివారణకు కేవలం నదికి 2 కి.మీ.ల దూరంలో రక్షణగా కరకట్టను నిర్మించాలనే ప్రతిపాదన ఏళ్ల తరబడి ఉంటోంది. దీనికి గత ప్రభుత్వ హయంలో రూ.4 కోట్లతో మున్సిపల్‌శాఖ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించింది. **నదీ జలాల స్వచ్ఛత ఇంకెప్పుడు?**

ధర్మపురి గోదావరి నదిలో డ్రైనేజీ నీరు కలవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.8 కోట్లతో మహా కాలువను నిర్మించినా.. రెండుచోట్ల మురుగు కాలువలను నిర్మించాల్సి ఉంది. ఓ వైపు ఎల్లంపల్లి జలాశయం చివరి ప్రాంతం ధర్మపురి బ్రహ్మగుండం కావడంతో ఈ నీరంతా అక్కడి వరకు చేరి నిలిచిపోతుంది. ఈ సమస్యలు తొలగాలంటే నీటిశుద్ధి ప్లాంటు నిర్మాణంతోనే సాధ్యపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి ఇరిగేషన్ విభాగం నుంచి రూ.17 కోట్లతో ఇటీవల అధికారులు ప్రతిపాదనలు పంపారు.

**తీరని పార్కింగు సమస్యలు**

పుణ్యక్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడి వాహనానికి రూ.50 రుసుము విధిస్తున్నారు. అయితే అధికారులు పార్కింగు సమస్యలపై పెట్టడంలేదనే విమర్శలున్నాయి. దీంతో వాహనాన్ని ఎక్కడ పడితే అక్కడే నిలుపుతున్నారు. ఏటా పార్కింగు నుంచి రూ.40 లక్షల ఆదాయం వస్తుండగా.. ఈ సమస్యను పరిష్కరించలేకపోతున్నారు.

# సెస్సు మిన్న రైతు బంధు సున్నా

ఆళ్లగడ్డ : 15 వ్యవసాయ మార్కెట్లు.. ఏటా రూ.60 కోట్ల ఆదాయం.. సెస్సు రూపంలో కోట్లు సమకూరుతున్నా అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలవడం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు అందాలి. వైకాపా ఆపేసిన 'రైతుబంధు' పథకాన్ని పునరుద్ధరించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు. 2014లో తెదేపా ప్రభుత్వం రైతు బంధును అమలు చేసింది.. ప్రభుత్వ గోదాముల్లో ధాన్యాన్ని దాచుకున్న రైతుకు రూ.2 లక్షల వరకు మార్కెట్ కమిటీనే మొదటి ఆరు నెలలు ఆర్థిక సాయం అందించేది. ఆరునెలల పాటు ఎలాంటి వడ్డీ ఉండదు. తర్వాత 6 నుంచి 9 నెల వరకు 12 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు క్వింటాకు నెలకు 60 పైసలు తీసుకునే వారు. 2019లో గత వైకాపా దీన్ని అటకెక్కించింది. రైతుబంధు నిలిచిపోవడంతో ప్రభుత్వ గోదాముల్లో రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో ఇవన్నీ ఖాళీగా మారాయి. ఇప్పటికీ ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములు దాదాపుగా రైతులకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంది.



ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో రూ.2.34 కోట్లు ఖర్చు చేసి 5 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ గోదామును ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చారు. వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న ఆళ్లగడ్డలో రైతుల కోసం 18 ఎకరాల విస్తీర్ణంలో కొత్త మార్కెట్ యార్డును నిర్మించారు. రైతుబంధు పథకం లేకపోవడంతో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. దీన్ని రైతులు ఉపయోగించుకోవడం లేదు.

**ప్రైవేటు గోదాములతో భారం**

వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో వంద బస్తాల నిల్వకు కేవలం రూ.200 చెల్లించాలి. ఏడాది పొడవునా నిల్వ ఉంచినా కేవలం రూ.2400 అవుతుంది. ఎన్ని నెలలు నిల్వ ఉంచితే అంతే అద్దె చెల్లించొచ్చు. అదే ప్రైవేటు గోదాములో 100 సంచులకు రూ.500 వసూలు చేస్తారు. ఏడాదికి రూ.6000 అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేటు గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచుకునే రైతుపై రెట్టింపు కంటే ఎక్కువ భారం పడుతోంది.

పి.నాగిరెడ్డిపల్లెకు చెందిన నరసింహులు రబీలో 12 ఎకరాల్లో వరి సాగు చేశారు. 400 సంచుల వడ్లను ప్రైవేటు గోదాములో నిల్వ ఉంచారు. ఇందుకు సంచికి రూ.5 చొప్పున నెలకు రూ.2వేలు అద్దె చెల్లిస్తున్నారు. బీమా కింద ఏడాదికి రూ.2400 చెల్లించారు. అదే ప్రభుత్వ గోదాములో కేవలం నెలకు రూ.800 మాత్రమే చెల్లిస్తే సరిపోయేది. ప్రభుత్వ గోదాములు అందుబాటులో లేకపోవడంతో ఆయనకు నెలకు రూ.1200 భారం పడింది.

ఆదాయంలో కేటాయింపులు ఇలా (శాతాల్లో)

పింఛన్లకు : 20

సెంట్రల్ మార్కెట్ ఫండ్‌కు: 25

ఉద్యోగుల జీతాలకు: 25


ప్రభుత్వ ఖాతాలోకి : 30 ఎరైతుకు: 0

# ముురుగుశుద్ధి.. లేదు చిత్తశుద్ధి

బొబ్బిలి : పట్టణాల్లో మురుగు సమస్యకు పరిష్కారంగా కేంద్రం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రత్యేక నిధులతో మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణాన్ని తలపెట్టింది. గత ప్రభుత్వ హయాంలో 2022లో నిధులు మంజూరు కాగా.. పనులు మాత్రం ముందుకు కదల్లేదు. బొబ్బిలిలో రూ.8 కోట్లతో ఆరు ప్లాంట్లు రాగా.. ఒక్కటీ పూర్తి కాలేదు. వీటిని పూర్తి చేసి, నిర్వహణలోకి తీసుకొస్తే మురుగు రహిత పట్టణంగా మారుతుంది.

**అయిదు మినీ.. ఒక భారీ ప్లాంటు**

బొబ్బిలిలో అయిదు చోట్ల మినీ, మరోచోట భారీ మురుగు శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఒక్కో మినీ ప్లాంటు ద్వారా 30 వేల లీటర్ల మురుగు శుద్ధి చేసే విధంగా టెండర్లు పిలిచారు. ఐటీఐ కాలనీ, పాతబొబ్బిలి, మల్లంపేట, తారకరామకాలనీ, గొల్లపల్లిలో వీటిని నిర్మించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రాగా.. టెండర్లు పిలిచి గుత్తేదారుకు అప్పగించారు. ఐటీఐ కాలనీ, పాతబొబ్బిలిలో పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్ల కానరావడం లేదు. కొన్నిచోట్ల స్థల



సమస్య ఉంది. దీనికితోడు బిల్లులు ఇవ్వకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపేసినట్లు తెలుస్తోంది.

**ఎక్కడికక్కడ నిల్వతో నరకం..** పట్టణంలో పక్కా కాలువ వ్యవస్థ లేదు. శివారు ప్రాంతాల్లో కచ్చాలే దిక్కు. ఆ మురుగంతా ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. ప్రధాన కాలువల నుంచి వచ్చే నీరు బయటకు పోవడం లేదు. వర్షం పడితే రహదారులపైకి రావడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఇలాంటి చోట్ల శుద్ధి ప్లాంట్లు నిర్మించాలని భావించి, రోజుకు 3 లక్షల లీటర్ల మురుగు పారుతుందని అంచనా వేసి అప్పట్లో ప్రతిపాదించారు.

**ప్రత్యామ్నాయం చూడరే..**

పాకివీధిలో సుమారు 3 లక్షల లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే భారీ ప్లాంటును తలపెట్టారు. పురపాలక స్థలంలో పనులు ప్రారంభిం చారు. ఆ స్థలాన్ని ఇళ్ల పట్టాలకు కేటాయించాలని పారిశుద్ధ్య కార్మికులు పనులు అడ్డుకోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా సుమారు ఎకరం స్థలాన్ని చూడాల్సి ఉన్నా.. అధికారులు చర్యలు చేపట్టడం లేదు.


**ఇదీ పరిస్థితి**పట్టణంలో కాలువల పొడవు: 121.6 కి.మీ

ప్రధాన డ్రైన్లు: 11.03 కి.మీ బీ మధ్య, చిన్న తరహా: 47 కి.మీ, 61 కి.మీ కచ్చా కాలువలు: 2.2 కి.మీ

పూర్తికి చర్యలుప్లాంట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. రెండు చోట్ల పనులు ప్రారంభించాం. మిగిలినవి త్వరలోనే మొదలు పెడతాం. స్థలం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ఎల్.రామలక్ష్మి, పురపాలక కమిషనర్

# 'ఎత్తి'పోయలేక 'నీరు'గార్చారు



ఒంగోలు : తాళ్లూరు మండలం మల్కాపురంలోని చిలకలేరు వాగుపై 2017లో రూ.2.13 కోట్లతో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకం ఇది. రెండేళ్ల క్రితం విద్యుత్తు పరివర్తకం చోరీకి గురైంది. తర్వాత మరమ్మతులు చేపట్టక నిరుపయోగంగా మిగిలింది...

నాగులుప్పలపాడు మండలం కనపర్తిలోని ఈ ఎత్తిపోతల పథకం 300 రైతులకు చెందిన 4,200 ఎకరాలకు సాగు నీరందిస్తోంది. రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా నిలిచింది. కొన్నేళ్ల క్రితం బిగించిన మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ప్యానల్ బోర్డు పాతవి కావడంతో షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్తు తీగలు కాలిపోతున్నాయి. కొత్తవి బిగించాల్సి ఉంది...

వేల ఎకరాలకు సాగు నీరందించిన పథకాలవి. నేల తల్లినే నమ్ముకున్న చిన్న, సన్నకారు రైతులకు భరోసాగా నిలిచాయి. బీడు భూములను పచ్చని పంటలతో కళకళలాడేలా చేశాయి. అటువంటి బంగారు బాతులను గత వైకాపా ప్రభుత్వం విస్మరించింది. నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా పదుల సంఖ్యలో పథకాలు పడకేశాయి. మోటార్లు బాగుచేయకపోవడం, చిన్నపాటి మరమ్మతులనూ పట్టించుకోకపోవడంతో మరికొన్ని అరకొర పనిచేస్తున్నాయి. దీంతో నీరు లేక కర్షకులు కాడి పడేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి సాగుకు ఊతమిస్తుందని ఆశిస్తున్నారు.

47 శాతం పడకేసిన పథకాలు: జిల్లాలోని ముసి, గుండ్లకమ్మ, పాలేరు నదులు, వాగులోంచి నీటిని ఎత్తిపోసి.. పంట పొలాలకు అందించేందుకు రాష్ట్ర నీటి వనరులు, అభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో రూ.139.02 కోట్లతో 141 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. 2021కి ముందు వీటి ద్వారా 61,604 ఎకరాలకు సాగు నీరందింది. ఆ తర్వాత మొత్తం 67 పథకాలు పనిచేయకపోవడంతో పక్కన పెట్టారు. మిగిలిన వాటిలో ప్రస్తుతం 30 పూర్తిస్థాయిలో.. 44 పథకాలు పాక్షికంగా(మూడు, నాలుగు మోటార్లకు ఒక్కటే నడవడం) పనిచేస్తున్నాయి. ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం ఏర్పాటుచేయగా.. మొదటి రెండేళ్లు గుత్తేదారులే నిర్వహించారు. తర్వాత ఆయా పథకాల ఆయకట్టు పరిధిలోని రైతులకు అప్పగించారు. కర్షకులే నిర్వహణ బాధ్యతలు చూసుకోవాలి. చిన్నచిన్న మరమ్మతులకు డబ్బులు పోగు చేసి బాగుచేసుకోవాలి. పెద్ద మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తే నిధులు మంజూరయ్యాక బాగుచేసేవారు. కొన్నేళ్లుగా సాగునీటి ఇక్కట్లు తీర్చిన పథకాలు అకస్మాత్తుగా పనిచేయకపోయినా.. వైకాపా పాలకులు పట్టించుకోలేదు.

**సిబ్బంది జీతాలకూ పాట్లు**: ఎత్తిపోతల పథకాల నిర్వహణకు ప్రభుత్వం అందజేసే నిధులే ఉద్యోగులకు ఆధారం. సర్కారు ఇచ్చిన నిధుల్లోంచి సుమారు 20 శాతం మేర వేతనాలకు ఖర్చు చేస్తుంటారు. జిల్లాలో ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణకు 35 మంది రెగ్యులర్, 150 పొరుగు సేవల విభాగంలో పనిచేస్తున్నారు. వీరికి పదమూడు నెలలుగా జీతాలు లేవు. ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టలేదు. ఎత్తిపోతల పథకాల నిర్వహణపై ఏపీఎస్ఐడీసీ ఈఈ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మరమ్మతులకు ఎక్కువ మొత్తం నిధులు అవసరమైతే సర్కారు సాయం కోసం సిఫార్సు చేస్తామన్నారు. వేతనాలు అందక సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

# పట్టణ పేదలకు గూడు దక్కేనా..?



చిత్తూరు : పట్టణ పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు తలపెట్టిన టిడ్కో పథకం వైకాపా తీరుతో నిర్వీర్యమైంది. మూడు విభాగాల్లో ఇళ్ల పంపిణీకి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వైకాపా పాలన ఐదేళ్లలో మొదటి విభాగంలో కొన్ని ఇళ్లు పూర్తిచేసి హడావుడిగా అందించారు. రెండు, మూడు విభాగాల కోసం దరఖాస్తులు ఇచ్చిన వారి పరిస్థితి త్రిశంకు స్వర్గంలో ఉంది. పంపిణీ చేసిన ప్రాంతాల్లో సరైన రోడ్లు, నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. చిత్తూరు నగర శివారుల్లోని పూనేపల్లెలో టిడ్కో గృహాల నిర్మాణాన్ని చేపట్టారు. 2,832 గృహాలు పూర్తి చేయగా ఇందులో ఒకటో కేటగిరీ 2256, రెండో కేటగిరీ 240, మూడో కేటగిరీ 336 గృహాలుగా విభజించారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంతో పనులు వేగంగా సాగలేదు. గృహ సముదాయాల ప్రాంగణంలో రోడ్లు, కాలువలు, నీటి సరఫరా పైప్‌లైన్లు పూడ్చే పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తాగునీటి సదుపాయం లేదు. నియంత్రికలు ఏర్పాటు చేసినా గృహాలకు కనెక్షన్లు ఇవ్వలేదు. 2019కి ముందు 30 మందికి తాళాలు ఇచ్చారు. ఇంకా 2,800 మంది లబ్ధిదారులకు గృహాలు అప్పగించాల్సి ఉంది.

**తొలగని వైకాపా రంగులు**

పురపాలిక పరిధిలో 1,040 మంది అర్హులుగా గుర్తించారు. రూ.58 కోట్లతో 2018 నవంబరు 28న పనులు ప్రారంభించారు. 432 ఇళ్లు శ్లాబు పోశారు. వైకాపా అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి. అవే పనులను 2021 మళ్లీ శంకుస్థాపన చేశారు. 2024 ఎన్నికల సమీపిస్తుండటంతో మౌలిక వసతుల కల్పనకు వైకాపా ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసి సీసీరోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి ట్యాంకు, బోర్లు ఏర్పాటు చేశారు. అసంపూర్తి నిర్మాణాల గురించి పట్టించుకోలేదు. కొన్ని పునాదుల దశల్లోనే ఉన్నాయి. వైకాపా రంగులు ఇంకా తొలగలేదు.

**వసతుల్లేమి.. భద్రత కరవు**

పట్టణంలో 1,536 మందికి టిడ్కో ఇళ్లు అందించారు. రోడ్లు, కాలువలు, విద్యుత్తు వసతి కల్పించారు. నీరు తాగేందుకు పనికి రావడం లేదు. దీంతో ప్రైవేట్ శుద్ధ జల కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఓహెచ్ఎస్ఆర్ పనులు అర్ధాంతరంగా ఆపేశారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. కాలువల్లో పూడికతీత, పరిసరాల శుభ్రత మరిచారు. విషపురుగుల బెడద ఎక్కువగా ఉంది. సరైన రవాణా వసతి లేక చాలా మంది లబ్ధిదారులు చేరలేదు. నీటి తొట్టెలు, సెప్టిక్ ట్యాంకులు దుస్థితికి చేరుకున్నాయి. చాలా ఇళ్లు ఖాళీగా ఉండటంతో భద్రత లేదని వాపోతున్నారు.

రాత్రివేళల్లో బయటకు రావాలన్నా.. బయటికి వెళ్లాలన్నా భయమేస్తోంది.

టిడ్కో భవనాల్లో నివసించే వారికి భద్రత కరవైంది. లబ్ధిదారుల్లో కొందరు సొంత డబ్బు వెచ్చించి సౌకర్యాలు కల్పించుకుంటున్నారు. ఇళ్లకు ఇళ్లకు మధ్య దూరం దూరంగా లబ్ధిదారులు నివసిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో బయటకు రావాలన్నా.. బయటి నుంచి ఇంట్లోకి వెళ్లాలన్నా భయమేస్తోంది. రత్నమ్మ, స్థానికురాలు

# మట్టి.. కొల్లగొట్టి

తాడిపత్రి : అక్రమాలకు కాదేదీ అనర్హం అన్నట్టు కొండలు, గుట్టలు, వంకలు, వాగులు, చెరువులు ఇలా దేన్నీ వదలడం లేదు. సులువుగా డబ్బు సంపాదించే ఆలోచనలో ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. ఈకోవలోనే పల్లెల్లోని చిన్నపాటి వంకలను చెరబడుతున్నారు. వంకల్లోనే మట్టిని వెంచర్లకు భారీగా తరలిస్తూ అక్రమార్జన సాగిస్తున్నారు. తాడిపత్రి మండలంలోని వీరాపురం పరిసరాల్లో వంక ఉంది. ఈ వంక తాడిపత్రిలోని చల్లవారిపల్లి గ్రామం వద్ద నుంచి సుమారు 12 కి.మీ.ల మేర ప్రవహిస్తుంది. వీరాపురం వద్ద కొందరు వంకలో మట్టి తవ్వకాలు చేపట్టారు. జేసీబీతో రోజూ 50 ట్రాక్టర్లతో వందలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో డిమాండ్‌ను బట్టి టిప్పర్లతోనూ తరలిస్తున్నారు.

**పొరుగు జిల్లాకు..**

పొరుగున ఉన్న కడప జిల్లా సరిహద్దు గ్రామాలతోపాటు తాడిపత్రిలోని పలు వెంచర్లలోకి వంక మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. తాడిపత్రిలోని సజ్జలదిన్నె, ఆర్డీటీ కాలనీ, కోమలి, గంగాదేవిపల్లి, ఇగుడూరు తదితర గ్రామాల్లో ఉన్న వంకల్లోనూ భారీగా తవ్వి మట్టిని అక్రమంగా



తరలిస్తున్నారు. పట్టపగలే మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం– రజాక్‌వలీ, తహసీల్దార్**

వంకల్లోని మట్టిని రైతులు పొలాల్లోకి తీసుకెళ్లవచ్చు. రియల్టర్లు మట్టిని వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటే వారిపై చర్యలు తప్పవు. ఆయా వంకల వద్ద భూగర్భ గనులశాఖ అధికారులతో తనిఖీలు చేస్తాం. అలాంటి వారిని గుర్తించి మట్టి వ్యాపారాన్ని అడ్డుకుంటాం.

# వాహనాలకు సామర్థ్య పరీక్షే

కర్నూలు : రవాణా శాఖ జారీ చేసే వాహన సామర్థ్య(ఫిట్‌నెస్) పత్రాలు ఇక నుంచి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు ప్రైవేటు కేంద్రాలకు అనుమతి లభించింది. వాహనాల సామర్థ్య కేంద్రం నంద్యాల జిల్లా చాబోలు వద్ద వారం రోజుల కిందట ప్రారంభమైంది. కర్నూలు జిల్లాలో చిన్నటే కూరు వద్ద ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఆయా కేంద్రాల్లో 54 రకాల పరీక్షలు చేస్తారు. శబ్ద కాలుష్యం, వాహన టైర్ల సామర్థ్యం, బ్రేక్‌లు, వాహన బరువు, హెడ్ లైట్ తదితర పూర్తిస్థాయి పరీక్షలు చేపడతారు. వాహనానికి సంబంధించిన వివరాలన్నీ కంప్యూటరులో నమోదు చేస్తారు. అనంతరం వాహన సామర్థ్యం ఆధారంగా పత్రం ఇస్తారు.

**చిన్నపాటి లోపం ఉన్నా**

వాహన బ్రేకులు సరిగా లేకపోయినా, రంగులు, నంబరు ప్లేట్లు, రేడియం స్టిక్కర్లు లేకున్నా.. ఇలా చిన్నపాటి లోపమున్నా వెనక్కి పంపుతారు. ఆయా కేంద్రాల్లో కంప్యూటర్లను రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయానికి అనుసంధానం చేశారు. వాహన సామర్థ్యం బాగుంటే పత్రం జారీ అవుతుంది. లేకుంటే తిరస్కరిస్తారు. ఇలా రెండుసార్లు పరీక్షలు నిర్వహించేందుకు అనుమతిస్తారు. రెండుసార్లు విఫలమైతే దానిని తుక్కు వాహనం కింద పరిగణించి రహదారిపైకి రాకుండా చూస్తారు.



ఏడేళ్లలోపు వాహనాలు రెండేళ్లకోసారి, ఏడేళ్లు దాటిన వాహనాలు ఏడాదికోసారి వాహన సామర్థ్య పత్రం తీసుకోవాలి. 15 ఏళ్లు దాటిన ద్విచక్ర వాహనాలకు రూ.600, ఎల్ఎంవీలకు రూ.800, ఎంఎంవీ, హెచ్ఎంవీ వాహనాలకు రూ.1,200 ఫీజుగా వసూలు చేస్తారు.

**తప్పని దూరభారం**

ఉమ్మడి జిల్లాలో కర్నూలు, ఆదోని, నంద్యాల, డోన్, ఆత్మకూరు పట్టణాల్లో రవాణా శాఖ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో మోటారు వాహన, సహాయక మోటారు వాహన తనిఖీ అధికారులు ఉంటారు. వారి పర్యవేక్షణలో నిత్యం 60 వాహనాలను పరిశీలిస్తుంటారు. ఇప్పుడా బాధ్యత ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు.


ఉమ్మడి జిల్లాలో రెండు కేంద్రాలే ఏర్పాటు చేయడం.. మిగిలిన ప్రాంతాల వాసులు అక్కడికి వెళ్లాలంటే అవస్థలు తప్పేలా లేవు. డోన్‌కు చెందిన వాహనదారులు చాబోలు కేంద్రానికి రావాలంటే సుమారు 70 కి.మీ., నందికొట్కూరు 50, ఆత్మకూరు 50, ఆళ్లగడ్డ, బనగానపల్లి 40, కొలిమిగుండ్ల వంటి ప్రాంతాల నుంచి 80, సున్నిపెంట వంటి ప్రాంతాలవారు సుమారు 150 కి.మీ. మేర ప్రయాణించి ఎఫ్‌సీ చేయించుకుని వెళ్లాల్సిన పరిస్థితి. నంద్యాలలోని ఏటీసీ కేంద్రంలో నిత్యం 45 స్లాట్ బుకింగ్ అవుతున్నాయి. రోజుకు 25 నుంచి 30 వాహనాలకే సామర్థ్య పరీక్షలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వెనక్కి వెళ్తున్నారు.

# అవినీతి పునాదులు.. బహుళ అక్రమాలు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం మందకొడిగా సాగుతుండటంతో కొందరు నిర్మాణదారులు అక్రమాలకు తెరలేపారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కుమ్మక్కై భవనం నిర్మాణ సమయంలోనే ఫ్లాట్లను విక్రయించి వాటికి మార్టిగేజ్‌ను విడుదల చేయిస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలూ ఇప్పిస్తున్నారు. మరికొన్నింటికి మున్సిపాల్టీతో సంబంధం లేకుండానే తనఖా రిజిస్ట్రేషన్ అలాగే ఉంచి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు ముట్టజెబుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**పుర ఆదాయానికి గండి**

నిబంధనల ప్రకారం మున్సిపాల్టీల్లో చేపట్టే అపార్ట్‌మెంట్ల ఆస్తి విలువలో 10 శాతం పురపాలిక పేరుతో మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్ చేయాలి. నిర్మాణదారులు ప్లాన్‌లో చూపిన విధంగానే నిర్మాణాలు చేయాలి. నిర్మాణాలు పూర్తయిన తర్వాత అన్నీ సవ్యంగా ఉంటే తొలుత చేసిన మార్ట్‌గేజ్‌ను విడుదల చేస్తారు. అక్రమాల్లో ఆరితేరిన కొంతమంది నిర్మాణదారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నిర్మాణాలు పూర్తవకుండానే మార్టిగేజ్‌లను విడుదల చేయించుకుంటున్నారు. ఇందుకు కొంతమంది టీపీవోలు, టీపీఎస్, బిల్డింగ్



ఇన్‌స్పెక్టర్లు వత్తాసు పలుకుతుండగా ఉన్నతాధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారు. దీంతో మున్సిపాల్టీలు పెద్దఎత్తున ఆదాయం కోల్పోతున్నాయి.

**అన్నింటా అక్రమాలే**

జిల్లా కేంద్రం నంద్యాలలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం వేగంగా చేస్తారనే పేరున్న ఓ నిర్మాణదారు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో అంటకాగుతుంటారు. ఈయన ఆధ్వర్యంలో పద్మావతినగర్, ఎన్జీవో కాలనీల్లో చేపట్టిన అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే రూ.కోట్ల విలువైన ఫ్లాట్లను తనఖా పూచీకత్తు రిజిస్ట్రేషన్లను విడుదల చేశారు. ఆ పత్రాలతోనే నిర్మాణదారుడు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు శాఖల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులకు రుణాలు ఇప్పించారు. వచ్చిన డబ్బుతో మరికొన్ని నిర్మాణాల్లో పెట్టుబడులు పెట్టారు.

కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ, సంతోష్‌నగర్‌లలో రెండేళ్ల క్రితం బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన గుర్తింపు పొందిన నిర్మాణ సంస్థ కార్పొరేషన్‌లో పూచీకత్తు ఒప్పందం విడుదల చేయకుండానే అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. మరికొన్ని ఫ్లాట్లను ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇతరులకు విక్రయించి వాటిని బ్యాంకులో తనఖా పెట్టించి మరి రుణాలు ఇప్పించారు. ఇదే సంస్థ నంద్యాలలో కూడా ఇటీవల ఇదే ప్రయోగం చేస్తుంది.

నంద్యాల ఫరూక్‌నగర్‌లో ఒక నాయకుడు నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యాపారి రెండేళ్ల కిందట రూ.65 లక్షలతో ఫ్లాట్ కొనుగోలు చేశారు. అప్పట్లో ఇది మార్టిగేజ్‌లో ఉండగానే బ్యాంకులో తనఖా పెట్టి రూ.38 లక్షల రుణం తీసుకున్నారు.

చురకలు



# అక్రమాల లోతెంత?

విశాఖపట్నం: భీమిలి వద్ద తీరంలో వైకాపా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సాగించిన అక్రమాల లోతులను అధికారులు పరిశీలిస్తున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కట్టడాలను పూర్తిగా తొలగించి పూర్వస్థితి తీసుకురావాలని హైకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ నేపథ్యంలో పునాది ఎంత లోతు ఉంది? ఎంత ఖర్చు అవుతుంది? అని అంచనా వేయడానికి నిర్ణయించుకున్నారు. రెండు రోజుల కిందట మనుషులతో పునాదుల వద్ద సమాంతరంగా తవ్వి లోతును గుర్తించేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. దీంతో బుధవారం జేసీబీతో పునాది పక్కన ఇసుక తవ్వి లోతు పరిశీలించారు. పునాదిని నిర్మించిన తీరు చూసి ప్లానింగ్ అధికారులు ఖంగుతిన్నారు. 588 మీటర్ల పొడవున్న పునాది సుమారు 6-8 అడుగుల్లోతు వరకు ఉంది. అడుగు భాగాన పునాది వెడల్పు 10 అడుగుల మేర ఉంది. కోర్టు ఆదేశాల ప్రకారం ఇదంతా పూర్తిగా తొలగించడానికి రూ.50 లక్షలపైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే



స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలు కూల్చడానికి రూ.4లక్షలు ఖర్చు అయినట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. కట్టడాలు కూల్చడానికి పెట్టిన ఖర్చు నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ నుంచి వసూలు చేయాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

**నక్షత్రాల హోటల్‌కేనా?:** విజయసాయిరెడ్డి కుమార్తె భీమిలి తీరాన్ని ఆనుకుని అవ్యాన్ ఎల్‌ఎల్‌పీ సంస్థ పేరిట ఉన్న స్థలంలో భారీ నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘన అంశం తెరపైకి వచ్చిన సమయంలో ఐదు నక్షత్రాల హోటల్ నిర్మాణం కోసమే శాశ్వత కట్టడాలు చేపడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సముద్రానికి దగ్గరిగా నిర్మించిన ప్రహరీ పునాదులు పరిశీలించగా.. అడుగున పది అడుగుల మేర వెడల్పుతో కాంక్రీట్ పర్చడం హోటల్ కోసమేనని స్పష్టమవుతోందని పలువురు భావిస్తున్నారు.

17న పరిశీలన: తీరంలో శాశ్వత కట్టడాలను కూల్చడానికి అయ్యే ఖర్చుతోపాటు, నిర్మాణాల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసేందుకు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అధికారులతో నిపుణుల కమిటీతో అంచనా వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నిపుణులు కమిటీలో అధికారి ఈనెల 17వ తేదీన పరిశీలించే అవకాశం ఉంది. పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేసి కోర్టుకు చెప్పాల్సి ఉండటంతో కేసు వాయిదాకు ముందే ఈ తనిఖీ పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులకు కోర్టు నిర్దేశం చేసింది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

# సొంతింటి కలకు కొండంత అండ

నక్కపల్లి : సొంత గూడు ఉండాలని ప్రతి కుటుంబం కోరుకుంటుంది. గడిచిన వైకాపా పాలనలో జగనన్న ఇళ్ల పేరిట ఆర్భాటంగా మొదలు పెట్టిన గృహ నిర్మాణాలకు సరైన సహకారం అందించక పోవడంతో అవన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి నిర్మాణాలను కొనసాగించేలా తీపికబురు చెప్పింది. లబ్ధిదారుల్లో వెనుకబడిన వర్గాలకు అదనపు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలో వేలాదిమందికి మేలు జరగనుంది.అయిదేళ్ల పాలనలో జిల్లాలో 61 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేశారు. దీనికి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం రూ. 1.8 లక్షలు అమలు చేస్తూ, జగన్ పేరును ప్రచారం చేసుకున్నారు. కాగా ధరాభారం, ప్రోత్సాహం లేకపోవడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేక పోయారు. జగన్ అధికారం కోల్పోయేనాటికి అసలు ప్రారంభం కానివి, వివిధ స్థాయిల్లో ఆపేసినవి సుమారు 40 వేలకు వరకు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించి గడిచిన రెండు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ పెట్టి చాలా ఇళ్లను పూర్తిచేయించగా, జిల్లాలో సుమారు 5500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం మరో ఏడువేల ఇళ్లను పూర్తి చేయించే పనిలో ఉన్నారు. ఇవన్నీ పోనూ మిగిలిన వాటిలో దాదాపు బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల వారు ఎక్కువగా ఉండటంతో వీరందరికీ అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, చేనేత వర్గాలకు అదనపు ఆర్థిక సాయం చేయనుంది. ఆ మేరకు జిల్లా పరిధిలో దాదాపు 26,800 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇందులో ఓసీలు సుమారు 5800 మంది ఉన్నారు. ఇవి మినహాయిస్తే, దాదాపు 21 వేల మందికి మేలు జరగనుంది. ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఇలాంటి వివరాలను సేకరించే పనిలో పడింది.

**సాయం ఇలా..**

ఎస్సీ, బీసీ, చేనేతలకు: రూ. 50 వేలుఎస్టీలు: రూ. 75 వేలు ఎస్టీల్లో బాగా వెనుకబడిన వారికి: రూ. లక్షజిల్లాలో ఇళ్ల పరిస్థితి ఇది మొత్తం ఇళ్లు: 61,505పూర్తయినవి: 26,699ప్రారంభం కానివి: 17,559వివిధ దశల్లో నిలిచినవి: 17,247

**సద్వినియోగం చేసుకోండి**

అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన 13,548 మంది లబ్ధిదారులకు రూ.70.04 కోట్ల అదనపు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. జిల్లాలో మే చివరినాటికి 13,687 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నామన్నారు.

# పథకం.. పట్టదా?



అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 1,059 గ్రామాలకు పైగా తాగునీరు అందించే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నిలిచిపోయి రెండు నెలలు కావస్తోంది. కార్మికులు 53 రోజులుగా సమ్మె చేస్తున్నా... సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమ్మెలోకి వెళ్లిన ప్రతిసారీ సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు తప్ప.. ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదని కార్మిక సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. పెండింగ్ జీతాలు, పీఎఫ్ బకాయిల సాధనకు సమ్మెలోకి వెళ్లిన కార్మికులతో అధికారులు పలుమార్లు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో పంపుహౌస్‌లు మూతపడ్డాయి. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. కొన్నిచోట్ల స్థానిక పథకాల నుంచి నీరందిస్తున్నా చాలడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా అరకొరగా అందిస్తున్నారు.

**రూ.5 కోట్లు విడుదల చేసినా..**

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో 630 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వైకాపా పాలన ముగిసే నాటికి ఏడాది జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సమస్యను పరిష్కరించేందుకు కొంతమేర నిధులు విడుదల చేసి కార్మికులకు జీతాలు చెల్లించారు. నిర్వహణకు సరిపడా నిధులు మంజూరు చేయకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ప్రస్తుతం ఫేజ్-1లో 6 నెలలు, ఫేజ్-2లో 10 నెలలు, ఫేజ్-4లో 4 నెలల జీతాలు చెల్లించాల్సి ఉంది. వీటితో పాటు సుమారు 30 నెలలకు సంబంధించిన పీఎఫ్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల రూ.5 కోట్ల మేర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వాటితో కేవలం 2, 3 నెలల జీతాలకు సరిపోతాయని కార్మికులు చెబుతున్నారు. ఇందులోనూ గుత్తేదారులు రూ.2 వేలు కోత విధించి ఇచ్చారని ఆరోపిస్తున్నారు.

**అన్ని దశల్లో చర్చలు విఫలం**

ఏప్రిల్ 6 నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. మే 2న అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 6న కలెక్టర్ కార్మిక సంఘ నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. 7న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కార్మికులతో చర్చలు జరిపినా ఫలితం దక్కలేదు. 8న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన కార్మికులు సమస్యలపై వినతిపత్రం అందించారు. 11న గుత్తేదారులు బలవంతంగా మోటార్లు ఆన్ చేయగా లీకేజీల కారణంగా వెనక్కి తగ్గారు. 12న కలెక్టర్, 13న ఆర్డీవో కేశవనాయుడు జరిపిన చర్చలు విఫలమయ్యాయి.

**శాశ్వత పరిష్కారం చూపుతాం- వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం**

జీతాల కోసం రూ.5 కోట్లు విడుదల చేసినా కార్మికులు సమ్మె విరమించలేదు. గతంలో జరిగిన కొన్ని తప్పుల కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న టెండర్ల గడువు ముగిసింది. త్వరలోనే టెండర్లు పిలిచి కొత్తవారికి అప్పగిస్తాం. ఇకపై కార్మికుల జీతాలను ప్రభుత్వమే పర్యవేక్షిస్తుంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం.

# అర్హులే మిగలాలి.. అనర్హుల లెక్క తేలాలి!



అనంతపురం : వీధి వ్యాపారులు, చిరు వర్తకుల కుటుంబాలకు అండగా నిలవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మాదిరిగా అనర్హులకు రుణాలు మంజూరు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. లెక్క పక్కాగా చేసి వారికి స్వల్పకాలిక రుణాలతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సర్వే చేస్తున్నారు.

**వైకాపా మద్దతుదారులకే లబ్ధి**గతంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రీసోర్స్ పర్సన్ల మద్దతుదారులకే కార్డులతో సహా రుణాలు ఇచ్చారు. దీంతో అర్హులైన వారికి మొండిచేయి లభించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మెప్మా అనుసంధానంగానే సచివాలయం సిబ్బందితో సర్వే చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన సంపూర్ణ వివరాలను క్రోడీకరిస్తున్నారు.గత వైకాపా హయాంలో ఆయా ప్రాంతాల్లోని కార్పొరేటర్లు, వార్డు కౌన్సిలర్లు, వైకాపా నేతలు ప్రతిపాదించిన వారికే రుణాలు దక్కాయి. టైలర్లకు, దుకాణదారులకు అసలు ఎలాంటి వ్యాపారం చేయని వారు కూడా లబ్ధిపొందారు. వీధి వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి పథకం ప్రవేశపెట్టింది. వ్యాపారులకు మూడు దశల్లో రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు చొప్పున ఇచ్చారు.

**మెప్మాకు స్వానిధికి భారీ వ్యత్యాసం**

మెప్మా నమోదు చేసిన వివరాలకు, పీఎం స్వానిధి డేటాకు వ్యత్యాసం ఉంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో మెప్మా డేటా ప్రకారం 12,764 మంది ఉంటే స్వానిధిలో మరో 26,224 మంది మొత్తంగా 38,988 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. 2014లోనే తెదేపా హయాంలో వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం సచివాలయ సిబ్బందిని క్షేత్రస్థాయిలో సమగ్ర వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించడంతో 15 రోజులుగా వివరాలు క్రోడీకరిస్తున్నారు. వీధి వ్యాపారుల ఆధార్ నంబరు, ఏ రకం వ్యాపారం చేస్తున్నారు, సంపాదన, కుటుంబ వివరాలను సేకరిస్తున్నారు. మరో వారం రోజుల్లో అర్హులెవరో తేలనుంది. మెప్మా పీడీ విశ్వజ్యోతి మాట్లాడుతూ.. అర్హులను గుర్తించి వారి వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. మరో వారం రోజుల్లో సర్వే పూర్తి అవుతుందన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి.. సేవలకు సుస్తీ



గుంతకల్లు : గుంతకల్లులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు అరకొర వైద్యంతో అవస్థలు పడుతున్నారు. వంద పడకల ఆసుపత్రికి చుట్టూ పక్కల ఉన్న మండలాల ప్రజలు, సరిహద్దు లోని కర్నూలు జిల్లాకు చెందిన గ్రామీణ ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ఈక్రమంలో సిబ్బంది సక్రమంగా వైద్యం అందించటం లేదని రోగులు, వారి సహాయకులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కొన్ని రకాల మందులను సైతం బయటికి రాసిస్తున్నారని పలువురు వాపోయారు. ఏరియా ఆసుపత్రిలో రోజువారి ఓపీ 600 నుంచి 700 దాకా ఉంటుంది. 30 మందికి పైగా జ్వరం, దగ్గు, వాంతులు వివిధ జబ్బులతో ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు. రోగులకు కేటాయించే మంచాలకు బెడ్ కవర్లు ఉండటం లేదు. ఇంటి నుంచి తెచ్చుకున్న బెడ్‌సీట్లను పరుచుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాక సెలైన్ బాటిల్స్ ఎక్కించాల్సి ఉంటుంది. మొదటి రోజు బాటిల్ ఎక్కిస్తారని, మరుసటి రోజు బయట తెచ్చుకోమని చెబుతున్నారని రోగి బంధువులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆసుపత్రిలో మందుల కొరత లేదని చెబుతూనే ఉన్నా వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని రోగులు వాపోతున్నారు.

వేధిస్తున్న స్టాఫ్‌నర్సుల కొరత

ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల కొరత వేధిస్తోంది. 24 మందికి గాను 14 మంది నర్సులు ఉన్నారు. రోగులకు వైద్యసేవలు అందించడానికి ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతున్నారు. ఇక్కడ పది వరకు స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీలు ఉండటం గమనార్హం.

**ఇబ్బంది పడుతున్నాం - జమీనా, గుంతకల్లు తగిన వైద్యసేవలు**

వాంతుల కావడంతో వారం రోజుల కిందట ఆసుపత్రిలో చేరా. మొదటి రోజు మాత్రమే సెలైన్ బాటిల్ ఎక్కించారు. తర్వాత ప్రైవేటు మందుల దుకాణంలో సెలైన్ కొనుక్కోవాలని చెబుతున్నారు. వైద్యులు రోజుకు రెండు రౌండ్లు చెకప్‌కు వస్తున్నారు. పిలిచేంత వరకు సిబ్బంది రావటం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. **అందిస్తున్నాం- డా.అజేంద్రరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్** ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందిస్తున్నాం. స్టాఫ్‌నర్సుల కొరత ఉంది. ఉన్నవారితోనే వైద్యం సక్రమంగా అందిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం.

# జలం నిలవాలి జనం మురవాలి

కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలభగ్నం చేసింది.. నిర్వహణకు పైసా ఇవ్వలేదు.. కేసీ చెదిరింది.. ఎస్సార్బీసీ ఏడిపిస్తోంది.. అలగనూరు కుప్పకూలింది.. గోరుకల్లు లీకేజీ అవుతోంది.. అవుకు అధోగతి పాలైంది.. పెండింగ్ ప్రాజెక్టుల దస్త్రాన్ని అటకెక్కించారు.. తుంగభద్ర, హంద్రీ, కృష్ణమ్మ నదులు పారుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి.. ప్ర'జల'కు ప్రాధాన్యం ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జలాశయాల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరుల బాగుకు రూ.1,568 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు.

**వీటికి మోక్షం కలిగేనా**

పశ్చిమ ప్రాంతంలో ఆర్డీఎస్, వేదవతి జలాశయాల నిర్మాణానికి గతంలో తెదేపా పునాది వేసింది. 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు రూ.90 కోట్లు ఖర్చు చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.

కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు నీరందించేలా రూ.1,985 కోట్ల వ్యయంతో ఆర్డీఎస్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ.12.60 కోట్ల వరకు వెచ్చించారు. అందుబాటులోకొస్తే 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సుంకేసుల (రూ.27 కోట్లు)

కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల పరిధిలో 2.65 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సుంకేసుల జలాశయానికి రూ.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాల్వ అధ్వానంగా మారడంతో 1,500 క్యూసెక్కులు ప్రవహించని పరిస్థితి నెలకొంది.సుంకేసుల, అలగనూరు, ముచ్చుమర్రి జలాశయాలకు కలిపి తొలుత రూ.107 కోట్లకు ప్రతిపాదించారు.. ఆ తర్వాత రూ.27 కోట్లకు కుదించారు.

ఎస్సార్బీసీ (రూ.89 కోట్లు)

శ్రీశైలం కుడిగట్టు కాల్వకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుంటారు. జలాశయం పనులు పూర్తికాకపోవడంతో 12 టీఎంసీలు నిల్వ చేయని పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో కట్ట కుంగింది. ఈ నేపథ్యంలో రూ.89 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.

అవుకు (రూ.40కోట్లు)

గత ఐదేళ్లుగా అవుకు జలాశయం నిర్వహణ పనులు చేపట్టలేదు. గేట్ల వద్ద నీటి లీకేజీ కొనసాగుతోంది. గత ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.. రెండో విడత పనులకు సంబంధించి రూ.24 కోట్లు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంది.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అవుకు సొరంగం, జలాశయం నిర్వహణకు రూ.40 కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

హంద్రీనీవా (రూ.700కోట్లు)

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) కాల్వను విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మల్యాల నుంచి జీడిపల్లి (0-216 కి.మీ.) వరకు కాల్వ వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.700 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదించారు.

ప్రస్తుతం కాల్వలో 1,900 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విస్తరించి 3,850 క్యూసెక్కులు తరలించనున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గురు రాఘవేంద్ర (రూ.57కోట్లు)తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు స్థిరీకరించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా కనీసం విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు.. నిర్వహణలేక మోటార్లు సతాయిస్తున్నాయి. వీటిని బాగు చేసేందుకు రూ.57 కోట్లు అవసరమవుతాయి.

శ్రీశైలం (రూ.18కోట్లు)కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.18 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులతో కొంతవరకు పనులు చేసేందుకు అవకాశముంటుంది, డ్రిప్ ద్వారా నిధులు విడుదలైతే తప్ప పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు అవకాశముందదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ రూ: 313 కోట్లు

కేసీ, రాజోలి, జొలదరాశి (235)

గాజులదిన్నె (35)

చెరువుల నిర్వహణ (46)

సిద్ధాపురం ఎత్తిపోతల (8)

# ఉపాధి మేడలు

కర్నూలు : ఐదేళ్ల వైకాపా కాలంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. 'కొత్త ఇసుక విధానం' పేరిట రీచ్‌లను మూసేశారు. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. భవనాలు, ఇళ్ల పనులన్నీ ఆగిపోవడంతో కార్మికులకు నెలల తరబడి ఉపాధి కరవైంది. ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అర్ధాకలితో అలమటించేలా చేసింది. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్మికులకు చేతినిండా పని దొరుకుతోంది. పనుల స్థాయిని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తోంది. ఏడాదిలో అక్టోబరు నుంచి మే వరకు నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉంటుంది. 'కూటమి' ప్రభుత్వం పల్లె పండగ పేరుతో సిమెంటు దారులు నిర్మిస్తోంది.



ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,000, రూ.1,500, రూ.2 వేలకు అందుబాటులో ఉంది. కారుచౌకగా ఇసుక లభిస్తుండటంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు." నగరంలో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపన చేశాం.. రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు" బ్యాంకు ఉద్యోగి నవీన్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే గత నెలలో వంద ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

**దండిగా ఇసుక నిల్వలు** గతంలో టన్ను రూ.326 ఉండగా.. దాన్ని కూటమి ప్రభుత్వం రూ.320కు తగ్గించింది. ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను రూ.202, మరలి ఇసుక రీచ్‌లో రూ.119, గుడికంబాలి రూ.39, నదిచాగిలో రూ.40 నామమాత్రపు ధరకు ఇసుక లభిస్తోంది.ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 1,45,350

# నీటిశుద్ధి నిర్వ'హరణం'



కర్నూలు : ప్ర'జల' గొంతు తడపడాల్సిన పథకాలు అవి'ని ధి'మయంగా మారాయి. పూర్తిస్థాయిలో పనిచేయకున్నా గుత్తేదారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 59 సీపీడబ్ల్యూఎస్ (సమగ్ర రక్షిత నీటి పథకం) ఉన్నాయి. అందులో కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో తుంగభద్ర దిగువ కాల్వపైనే 31 వరకు ఉన్నాయి. వీటి నిర్వహణకు ఏటా ప్రభుత్వం రూ.45 కోట్ల వరకు కేటాయిస్తోంది. చుక్కనీటిని శుద్ధి చేయకుండానే బిల్లులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**పని చేయకున్నా పైసలిచ్చారు**

దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఫిల్టర్ బెడ్లు పనికిరావని అధికారులే నిర్ణయించారు..ఇలాంటివి కర్నూలు జిల్లాలో 19, నంద్యాలలో 16 వరకు ఉన్నాయి. వీటి నిర్వహణకు మాత్రం బిల్లులు చెల్లిస్తున్నారు. ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీటిని ఫిల్టర్ బెడ్లలోకి పంపింగ్ చేసి శుద్ధి చేసి బయటకు పంపాల్సి ఉంటుంది. ఫిల్టర్ బెడ్లను నీటి ప్రవాహానికి అనుగుణంగా కనీసం మూడు, నాలుగేళ్లకోసారి మార్చాల్సి ఉంటుంది. వీటిలో అధిక శాతం 35 ఏళ్ల కిందట నిర్మించారు. నిబంధనల ప్రకారం ఇసుక మార్చి ఎస్ఎస్ ట్యాంకుల్లో పూడిక తొలగించాల్సి ఉంది. గుత్తేదారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు.

**గుడ్డిగా సంతకాలు**

మంత్రాలయం మండలం పెసలబండ సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా 24 గ్రామాలకు నీరు అందించాలి. ఏటా రూ.135 లక్షలు ఖర్చు చేస్తున్నా సగం గ్రామాలకు నీరు అందడం గగనమవుతోంది. అన్ని గ్రామాలకు నీరు అందిస్తున్నట్లు గుత్తేదారులు సిద్ధం చేసిన ఎం.బుక్‌లపై సంబంధిత అధికారులు మాత్రం సంతకాలు చేసేస్తున్నారు.

ఆలూరు నియోజకవర్గ పరిధిలోని ఖాసీపురం పథకం ద్వారా 8 గ్రామాలకు నీరు ఇవ్వాలి. ఈ పథకానికి ఏటా రూ.112 లక్షలు వెచ్చిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరవవడంతో గుత్తేదారుడు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

ఆలూరు పథకం ద్వారా రూ.90 లక్షల వ్యయంతో 20 గ్రామాలకు మంచినీరు అందించాల్సి ఉంది. కానీ సగం గ్రామాలకు అందని పరిస్థితి.పత్తికొండ పథకానికి ఏటా రూ.170 లక్షలు వెచ్చిస్తున్నారు. 50 గ్రామాలకు నీరు అందాల్సి ఉండగా.. శుద్ధి చేయకుండగానే అధిక శాతం గ్రామాలకు విడుదల చేస్తున్నారు.

" ఫిల్టర్ బెడ్ల ద్వారా తాగునీరు శుద్ధి చేయకుండా నేరుగా సరఫరా చేస్తే బిల్లులు మంజూరు చేయం. కచ్చితంగా నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలి. కొన్ని ఫిల్టర్ బెడ్లు పనిచేయడం లేదు. వాటి బిల్లులు నిలిపేస్తాం. మూడేళ్లకోసారి ఇసుక మార్చాలి. ఇందుకోసం ప్రతిపాదనలు పంపాం. ఇటీవల కొన్ని మార్చామని" ఆదోని డివిజన్ డీఈ సాంబయ్య తెలిపారు.

**ఏటా రూ.45 కోట్లు కేటాయింపు**

మంచినీటి పథకాల నిర్వహణకు ఏడాదికోసారి టెండర్లు పిలుస్తారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో నామినేషన్ విధానాన్ని తీసుకొచ్చారు. దీంతో నిర్వహణ బాధ్యత కొందరి చేతుల్లోకి వెళ్లింది. కర్నూలు జిల్లాలో 33 పథకాలకు ఏటా రూ.25.70 కోట్లు, నంద్యాలలో 26 పథకాలకు ఏటా రూ.19.53 వెచ్చిస్తున్నారు.

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో 24 తాగునీటి పథకాలు ఉన్నాయి. నీటి శుద్ధి, సరఫరా, కార్మికుల వేతనాలు, బిల్లులు తదితర వాటి కోసం ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఆదోని డివిజన్ వ్యాప్తంగా 415 గ్రామాలు ఉండగా.. 241 ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఆదోని, ఆస్పరి, ఆలూరు, కౌతాళం, హొళగుంద, చిప్పగిరి, హాలహర్వి, మంత్రాలయం, దేవనకొండ, గోనెగండ్ల తదితర మండలాల్లో తాగునీటి సమస్య ఉంది.

## బర్డ్ రెక్కలు తొడిగేనా!

తిరుపతి : నిత్యం 30కి పైగా శస్త్ర చికిత్సలు.. వందల మంది అవుట్ పేషంట్లు.. 350 పడకల నిండుగా రోగులు.. సందర్శకులు, బంధువుల తాకిడితో కిటకిటలాడేది ఒకప్పుడు బర్డ్ ఆస్పత్రి. ఐదేళ్లుగా రెక్కలుడిగింది. దివ్యాంగులైన వారికి వైద్యం దూరమైంది. ఎన్నో అవినీతి కథలు, విజిలెన్స్ విచారణలు.. బర్డ్‌లో మోకీళ్లు మార్చుతున్నారా అని అడిగే పరిస్థితి నెలకొంది. పాత సంచాలకులే అయినా కొత్తగా వస్తున్న డాక్టర్ గుడారు జగదీష్ బర్డ్ రెక్కలు తొడిగేనా.. వేచిచూడాల్సి ఉంది..! పుట్టుకతో కలిగిన అంగవైకల్యాన్ని నయం చేసి ఆత్మగౌరవంతో అందరిలా బతకాలనే లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తితిదే సహకారంతో బర్డ్ ఆస్పత్రిని ప్రారంభించారు. 300 పడకల ఆస్పత్రి ద్వారా పోలియో, ఇతర వైకల్యం ఉన్న వారికి ఉచిత సేవలు అందుబాటులోకి తెచ్చారు. కొంతకాలానికి ఆ రోగులు



తగ్గుముఖం పట్టడంతో రోడ్డు ప్రమాదాల్లో ఎముకలు దెబ్బతిన్నవారు, పోషకాహార లోపాలతో మోకీళ్ల మార్పిడి అవసరమైన వారిని గుర్తించి ఆ దిశ సేవలు మార్చుకుంది. నెలకు 250 మోకీళ్ల మార్పిడి, ఉచిత ఆపరేషన్లు చేసేవారు. పడకలు సరిపోక స్విమ్స్‌లో వంద పడకలు తీసుకునేవారు. ఉచితంగా ఆపరేషన్లు ప్రోత్సహిస్తే అందరూ ఆశ్రయిస్తారనే సాకు చూపి రూ.72 వేలు పరికరం విలువ వసూళ్లకు శ్రీకారం చుట్టారు. అక్కడి నుంచే బర్డ్‌లో పరిపాలన గాడి తప్పింది.

ఇవి గాడిలో పెట్టాలి: వైద్యులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఏ మేరకు బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. వైద్యుల మధ్య సమన్వయం, బాధ్యత పెంచాలి. పారదర్శకంగా టెండర్లు నిర్వహించాలి. పడకల సామర్థ్యం.. శస్త్రచికిత్సల సంఖ్య పెంచాలి. ఉచిత శస్త్రచికిత్సల్లో పారదర్శకత చూపాలి.

## నిఘానేత్రాలు.. దొంగలను పట్టేస్తున్నాయ్

చిత్తూరు : గుడిపాలలో గతేడాది జులైలో ఏటీఎం చోరీ జరిగింది. కొద్ది రోజులకే పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. నేర పరిశోధనలో ప్రతిష్ఠాత్మకమైన ఏబీసీడీ అవార్డు సొంతం చేసుకున్నారు. పూతలపట్టులో గతేడాది అక్టోబరులో దుండగులు ఓ వృద్ధురాలి మెడలో గొలుసు తెంపారు. దొంగలు గొలుసుతో పరారైతే.. వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు ఛేదించారు. జిల్లాలో పోలీసుల నిఘానేత్రాలు దొంగలను ఇట్టే పట్టిస్తున్నాయి. సీసీ కెమెరాలు దొంగల ముఖచిత్రాలతో పాటు వారి జాడ కూడా చూపుతున్నాయి. జిల్లా పోలీసులు నేరాల నియంత్రణకు కొంతకాలం నుంచి సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. చిన్న దుకాణాల మొదలు పెద్ద దుకాణాల లోపల, బయట కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు



జారీ చేశారు. దీంతో దుకాణదారులు తమ దుకాణాలతో పాటు ఇళ్లకు కూడా వీటి ఏర్పాటుతో అన్ని ప్రాంతాల్లో ఇవి అందుబాటులోకి వచ్చాయి. పోలీసులు కూడా ప్రధాన కూడళ్లు, కాలనీల్లో ఏర్పాటు చేసి వాటిని చిత్తూరు కమాండ్ కంట్రోల్ రూమ్ అనుసంధానం చేసి వీక్షిస్తున్నారు.జిల్లాలో జరిగిన ద్విచక్ర వాహన చోరీలు, గొలుసు దొంగతనాలు, ఇళ్లల్లో చోరీలలో చాలావరకు సీసీ కెమెరాల సాయంతోనే పోలీసులు ఛేదించారు. చౌడేపల్లిలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, వాటి ద్వారా గొలుసు చోరీలు చేస్తున్న ఏడుగురు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి, రూ.25.74 లక్షల బంగారు ఆభరణాలు, 3 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పుంగనూరు గొలుసు చోరీ కేసునూ ఇలాగే ఛేదించారు.ప్రజలందరూ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు తగ్గుతాయని, ఒకవేళ జరిగినా ఛేదించడానికి సులువుగా ఉంటుందని పోలీసులు సూచిస్తున్నారు.

## సొమ్ము పెట్టలేదు.. చేప పుట్టలేదు

ఏలూరు: ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి, పెంపకం కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవు. వైకాపా అయిదేళ్ల పాలనలో నిధులివ్వక నిర్వహణ చతికిల పడింది. మరో వైపు సిబ్బంది కొరత వేధిస్తోంది. అసౌకర్యాల అవస్థలు.. జిల్లాలో ఏలూరు, కొవ్వలిలో చేప పిల్లల పెంపకం, బాదంపూడిలో చేప నారు (స్పాన్) ఉత్పత్తి కేంద్రాలున్నాయి. నారును 15 రోజులపాటు సిమెంట్ తొట్లలో పెంచుతారు. ఇవి ఎక్కడా సవ్యంగా లేవు. కొవ్వలిలో అసలు వీటిని ఏర్పాటు చేయలేదు. 40 వరకు అవసరం ఉంది. నీటి సరఫరాకు పైపు లైన్లు లేవు. ఏలూరులో ఉన్న 10 తొట్లలో నీరు లీకవుతోంది. మరో వైపు సిబ్బంది కొరత వేధిస్తోంది. ఫిషర్‌మెన్లు, ఫీల్డ్‌మెన్లు వాచ్‌మెన్లు, దాదాపు 20 మంది ఉండాల్సి ఉంటే 8 మంది ఉన్నారు. కొవ్వలిలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, బాదంపూడిలో ఎఫ్‌డీవోలు ఇద్దరూ ఇన్‌ఛార్జీలే. ఇది ఏలూరులో చేప పిల్లల పెంపకం కోసం కేటాయించిన చెరువు. నర్సరీల్లో చేప నారు (స్పాన్) మూడు అంగుళాలు పెరిగాక చెరువులో వేసేవారు. వైకాపా పాలనలో ఈ చెరువును పట్టించుకోలేదు. కనీసం పూడిక కూడా తీయక, తుప్పలతో నిండిపోయింది. ఈ పాపం వైకాపాదే.. ఏటా 2 కోట్ల చేప నారు ఉత్పత్తి, 34 లక్షల చేప పిల్లల్ని పెంపకం చేయాల్సి ఉంది. సంతానోత్పత్తి మొదలు మేత, మందులు, కేంద్రాల నిర్వహణ, పట్టుబడి కోసం కూలీల ఖర్చు, చేపపిల్లల రవాణా అన్నీ కలిపి రూ.25 లక్షలు అవసరం. వైకాపా ప్రభుత్వంలో మొక్కుబడిగా రూ.3లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. అధికారులకు తలకుమించిన భారంగా మారడంతో పూర్తిగా నిర్వహణ గాడి తప్పింది.

**రూ.2 కోట్లతో ప్రతిపాదనలు..** కూటమి ప్రభుత్వం రావడంతో కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించేందుకు రూ.2 కోట్లు వరకు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మంజూరు కాగానే పనులు చేపడతామని మత్స్యశాఖ ఇన్‌ఛార్జి జేడీ నరసింహారావు తెలిపారు.

## వేలిముద్రల కథ.. సాగుతుందలా!



పాలకొల్లు : జిల్లాలో జనవరిలో ప్రారంభించిన ఈకేవైసీ ప్రక్రియ నెలల తరబడి సాగుతోంది. ఏప్రిల్ 30తో గడువు ముగిసినా లక్ష్యం చేరలేదు. గడువులోగా ఈకేవైసీ పూర్తిచేసుకోకపోతే మే నెల నుంచి చౌక సరకులు నిలిపేస్తామని అధికారులు ప్రకటనలు జారీ చేసినా లబ్ధిదారులు పట్టించుకోలేదు. చివరకు చేసేదేంలేక మరో రెండు నెలలు గడువు పొడిగించారు.

భీమవరానికి చెందిన ఓ కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరు ఆన్‌లైన్ ఆసరాగా ప్రతినెలా రేషన్ పొందుతున్నారు. అయితే ఈకేవైసీ పూర్తిచేయడానికి పౌర సరఫరాల శాఖ సిబ్బంది, చౌకదుకాణం డీలర్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా భీమవరం వచ్చి ఆ ప్రక్రియ పూర్తిచేయలేదు. ఇలా ఒక్క భీమవరం పట్టణం, మండలాల పరిధిలో 9,933 మంది నేటికీ ఈకేవైసీ పూర్తిచేయనివారున్నారు.

15,67,322: జిల్లాలో మొత్తం సభ్యులు
14,54,703: ఈకేవైసీ పూర్తయినవారు
25,581: 5 ఏళ్లలోపు ఉన్న చిన్నారులు
925: 80ఏళ్లు పైబడినవారు
86,113 : ఈకేవైసీ పూర్తిగానివారు

బోగస్‌కే ఎక్కువ అవకాశం..

నెలల తరబడి గడువిచ్చినా ఈకేవైసీ కోసం ముందుకు రావడం లేదంటే అత్యధికంగా బోగస్ లబ్ధిదారులు ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఒక నెల సరకులు నిలిపేస్తే అవసరమైన వారంతా పరుగులు పెట్టుకొస్తారని, గడువు పెంచుకుంటూ పోతే ఎప్పటికీ లక్ష్యం పూర్తికాదని చెబుతున్నారు. ఒక పక్క కొత్త కార్డుల కోసం అర్హులంతా ఏళ్ల తరబడి వేచిచూస్తున్నారు. ఈకేవైసీ పూర్తయితేనే కొత్త కార్డుల మంజూరు ప్రక్రియ మొదలుకానుంది.

**ఆ మండలాల్లో ఎక్కువ..**

ఈకేవైసీ పూర్తిగాని మండలాల్లో భీమవరం ప్రథమస్థానంలో ఉండగా తర్వాత స్థానాల్లో నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు వరుసగా నిలిచాయి. ఆయా మండలాల్లో 5,500 నుంచి 9 వేలకు పైబడి పూర్తికావాల్సి ఉంది. పెంటపాడు, పాలకోడేరు, గణపవరం మండలాలు 2,600 నుంచి 2,900 వరకు బాగానే పూర్తిచేశారు.

## నైతికత పెంచి.. వసతులు కల్పించి!



పోడూరు : విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. విద్యార్థుల్లో నైతిక విలువల పెంపు.. క్రీడలు, వ్యాయామం, యోగాలో ప్రావీణ్యం కల్పించేందుకు పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఫర్ ఇండియా) పథకానికి శ్రీకారం చుట్టింది. గత విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా మండలానికో జడ్పీ ఉన్నత పాఠశాలను పీఎంశ్రీ కింద ఎంపిక చేసింది. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, క్రీడా మైదానాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. 6, 7 తరగతుల విద్యార్థులను స్కౌట్స్, గైడ్స్‌కు ఎంపిక చేసింది. ఆయా పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు శిక్షణ బాధ్యతలు అప్పగించింది. నీపోడూరు మండలం కవిటం జడ్పీ ఉన్నత పాఠశాల 2024-25లో పీఎంశ్రీ పథకానికి ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పాఠశాల క్రీడా మైదానంలో షటిల్, వాలీబాల్ కోర్టులు అభివృద్ధి చేశారు. ఆట స్థలంలో నడక దారి ఏర్పాటు చేశారు.

**జిల్లాలో మొదటి విడతలో ఎంపికలిలా..**

పాఠశాలలు: 25స్కౌట్స్, గైడ్స్ ఉపాధ్యాయులు: 50
6, 7 తరగతుల విద్యార్థులు: 300
కేటాయించిన నిధులు: రూ.82.50 లక్షలు
ప్రతి పాఠశాలకు రూ.3.25 లక్షలు..

జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో పీఎంశ్రీ పథకం అమలు చేస్తున్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు వాలీబాల్, షటిల్ కోర్టులు నిర్మిస్తున్నారు. ఇందుకు ప్రతి పాఠశాలకు రూ.3.25 లక్షలు విడుదల చేశారు. విద్యార్థుల యూనిఫాంకు మరో రూ.50 వేలు కేటాయించారు. దీనికితోడు దివ్యాంగ విద్యార్థుల రవాణా ఖర్చులకు ఒక్కొక్కరికి రూ.3 వేలు అందజేస్తున్నారు. జిల్లాలోని అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో దశలవారీగా పీఎంశ్రీ పథకాన్ని అమలు చేస్తామని తణుకు డీవైఈవో డీఎం సత్యనారాయణ తెలిపారు.

## వారు కొనలేరు.. వీరు అమ్మలేరు!

ఉంగుటూరు : జిల్లాలోనే ఉంగుటూరు మండలంలో అత్యధికంగా వరి దిగుబడి వస్తోంది. రబీలో 22,682 ఎకరాల్లో రైతులు వరి పండించగా.. 1.25 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. తొలుత 58,229 టన్నుల కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించగా.. పూర్తయిన కేంద్రాలకు మరో వంద టన్నుల చొప్పున పెంచారు. 23 ఆర్ఎస్‌కేల్లో ధాన్యం సేకరణ చేపట్టగా.. 18 చోట్ల లక్ష్యాలు పూర్తయ్యాయి. మిగతా కేంద్రాల్లోనూ ప్రక్రియ పూర్తి కావొస్తోంది. సుమారు 15 వేల టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉండిపోయింది. 30 లారీల్లో 600 టన్నులు బస్తాల రూపంలో ఎగుమతి చేసి ఉంచారు. లక్ష్యం పూర్తి కావడంతో ట్రక్కు షీటు నమోదు కావడం లేదు. ఫలితంగా రహదారుల పక్కన, భీమడోలు మండలం పూళ్ల వేబ్రిడ్జి వద్ద లారీలు



నిలిచిపోయి కనిపిస్తున్నాయి. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**

కొనుగోలు చేసిన ధాన్యం: 69,730 టన్నులు
జమైన నగదు: రూ.98.33 కోట్లు

ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరం ఆర్ఎస్‌కే ద్వారా రైతుల నుంచి 4,788 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా 9 లారీల్లో 4,700 బస్తాలు లోడ్ చేశారు. మరో 5,100 బస్తాల ధాన్యం పట్టుబడి పూర్తయింది. ఇంతలో లక్ష్యం పూర్తయిందంటూ అధికారులు చేతులెత్తేశారు.'పదెకరాల్లో వరి సాగు చేశా. కోత కోసి పది రోజులైంది. ఆర్ఎస్‌కేలో గోనె సంచులడిగితే లక్ష్యం పూర్తయిందని, సంచులు రావాల్సి ఉందని చెబుతున్నారంటూ బొమ్మిడికి చెందిన కౌలు రైతు పుష్పరావు ఆవేదన వ్యక్తం చేశారు.''ప్రభుత్వమిచ్చిన ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి చేశాం. ఇంకా కొనలేం. మీరు బయట అమ్ముకోండంటూ ఉంగుటూరు మండలంలో ఆర్ఎస్‌కే సిబ్బంది చెబుతున్నారు. ఓవైపు బస్తాలు, కల్లాల్లో ధాన్యం... మరో వైపు వాతావరణ మార్పులతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.'

## పసిగట్టి.. పట్టించి!

ఏలూరు : గగనతలంలో విహరిస్తాయి.. డేగ కళ్లతో ఎక్కడ ఏం జరుగుతుందో పసిగడతాయి.. నిషిద్ధ ప్రాంతాల్లోని గుట్టును రట్టుచేస్తాయి. నేరగాళ్లకు, వారి కార్యకలాపాలకు ముకుతాడు వేస్తాయి.. అవే జిల్లా పోలీసు శాఖ తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చిన డ్రోన్లు. పోలీసు కేసుల దర్యాప్తులో మారుతున్న సాంకేతికతను ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అందిపుచ్చుకొని.. డ్రోన్లు తీసుకొచ్చారు. కొన్నింటిని ప్రభుత్వమే సమకూర్చగా.. మరికొన్నింటిని ఇటీవల కొందరు పారిశ్రామికవేత్తలు వితరణ చేశారు. తాజాగా పోలీసు అధికారులు డ్రోన్ల పనితీరుపై డెమో నిర్వహించి, వాటి పనితీరు, సామర్థ్యాలు పరిశీలించారు.అడ్డూఅదుపూ లేక.. శివారు, అటవీ, నిర్మానుష్య ప్రాంతాల్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. జూదాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇక్కడికి పోలీసులు రారన్న ధీమాతో అడ్డూఅదుపూ లేకుండా వ్యవహరిస్తున్నారు. వీరికి చెక్ పెట్టేందుకు డ్రోన్లు వినియోగించనున్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులకు రక్షణగా వీటిని ఉపయోగించనున్నారు. కళాశాలలు, పాఠశాలలు విడిచిపెట్టే సమయాలు, రద్దీ కూడళ్లు, మహిళలు ఎక్కువ



సంచరించే ప్రాంతాల్లో డ్రోన్లు వాడనున్నారు. విద్యార్థినులను ఆకతాయిలు వేధించినా.. మహిళలపై దాడులకు యత్నించినా.. దేవాలయాలకు ఒంటరిగా వెళ్లే మహిళలను వెంబడించి చోరీలకు పాల్పడినా ఇవి కనిపెడుతుంటాయి. ప్రమాద తీవ్రత పసిగట్టి పోలీసులను అప్రమత్తం చేసేందుకు దోహదపడతాయి.

**ట్రాఫిక్ చక్కదిద్దేందుకు..**

ముఖ్యమంత్రులు, మంత్రులు, వీఐపీలు పర్యటనల్లో కట్టుదిట్టమైన బందోబస్తు, భద్రతకు డ్రోన్లు వాడనున్నారు. ట్రాఫిక్ పరిశీలనకూ వినియోగించనున్నారు. 'జిల్లాలో వివిధ నేరాలను అరికట్టేందుకు డ్రోన్లు అందుబాటులోకి తీసుకొచ్చాం. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో అవసరం మేరకు డ్రోన్లు వినియోగిస్తాం. ఇవి తప్పకుండా సత్ఫలితాలిస్తాయి' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

## ఉద్యానం.. మాయమైన పచ్చదనం!

ద్వారకాతిరుమలే: నిత్యం భక్తులతో కళకళలాడే శ్రీవారి క్షేత్రంలో ఉద్యాన వనాల నిర్వహణ అధికారులు పట్టించుకోకపోవడంతో వెలవలబోతున్నాయి. దీంతో భక్తులకు ఆహ్లాదం కరవైంది. ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి నిత్యం వేలాది మంది కుటుంబ సభ్యులతో కలిసి వస్తుంటారు. వారంతా సేద తీరేందుకు, ఆనందంగా గడిపేందుకు కొండపైన శ్రీవారి గోశాల, సెంట్రల్ స్టోర్, తితిదే కల్యాణ



మండపం ఎదురుగా, శివాలయానికి ఇరువైపులా ఉద్యానవనాలు ఏర్పాటు చేశారు. పచ్చని చెట్లు, కింద పచ్చిక, పూల మొక్కలు పెంచుతూ పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. వాటి నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారు. ఎండి పోయిన మొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా మారాయి. పచ్చదనం కోల్పోయి.. ఎడారిని తలపిస్తుండటంతో భక్తులు కనీసం లోపలకు అడుగు పెట్టడం లేదు. వేసవిలో రోడ్ల పక్కన ఉండే చెట్ల కింద సేద తీరుతున్నారు.

# ఖాద్రీశా.. కబ్జాలు కనవయ్యా!

కదిరి : ప్రాచీన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. స్వయంభువుగా వెలసిన ఉగ్ర నారసింహుడు. ఏటా లక్షలాదిగా భక్తులు.. రూ. 10 కోట్లకు పైగా ఆదాయం.. ఇదీ కదిరి ఖాద్రీశుడి ఆలయ ప్రాశస్త్యం. ఇంతటి విశిష్టత ఉన్న క్షేత్రానికి వరద సమస్య తప్పడం లేదు. స్వామి సన్నిధిలో సమస్యను పరిష్కరించి.. భద్రత కల్పించటంలో అధికారులు, పాలకవర్గంలో నిర్లక్ష్యం ఆవహించింది. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా మురుగుతో కలిసి వరద తప్పని ముప్పుగా మారింది. తీవ్రత పెరిగితే గర్భాలయాన్ని తాకుతుందని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

**ఎందుకిలా..**

గతేడాది అక్టోబరులో 55.2 మి.మీ వర్షం కురిసింది. జీవిమాను కూడలి పరిసర ప్రాంతాలకు దిగువన ఆలయం ఉంది. దీంతో ఖాద్రీశుడి సన్నిధిలోకి వరద వచ్చింది. హఠాత్పరిణామంతో భక్తులు కాసేపు అలజడికి గురవయ్యారు. రాత్రిపూట వరదలో ఉండలేక, ఎక్కడికెళ్లాలన్న ఆందోళన చెందారు.



గతంలో ఆలయ వీధులు విశాలంగా ఉండేవి. కాలక్రమంలో కబ్జాకు గురవుతూ కుదించుకుపోయాయి. ప్రాకారం ఆనుకున్న నిర్మాణాలతో నీటి ప్రవాహ మార్గం మూసుకుపోయింది. రోడ్ల నిర్మాణంతో వీధులు ఎత్తు పెరిగి ఆలయం వైపు వాలుగా మారాయి. ఆక్రమణలతో మురుగు కాలువలు ఉనికి కోల్పోయాయి. దీంతో వర్షపు నీరు వీధుల గుండా గుడి వైపే ప్రవహిస్తుంది. వరద, మురుగు కలిసి ఆలయంలోకి వెళ్తోంది. మురుగు పారుదల, వాన నీటి ప్రవాహాన్ని ఆలయ వీధికి ముందే మళ్లిస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది. ఇందుకు తొలుత ఆక్రమణలు తొలగించి కాలువలను పునరుద్ధరించాల్సి ఉంటుంది.

ఏటా దర్శనానికి వచ్చే భక్తులు: 4లక్షలు

గత ఆర్థిక సంవత్సరం ఆదాయం: రూ.15.76 కోట్లు

**సమస్యను పరిష్కరిస్తాం**

శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో

జీవిమాను కూడలి నుంచి వచ్చే వరద మళ్లింపుపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కలిసి చర్చించాం. ఆలయ ముందు భాగంలో కాలువను విస్తరించాల్సి ఉంది. తూర్పు ద్వారం నుంచి ఉత్తర మార్గంలోని కాలువ ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో పనులు చేపట్టి ఆలయంలో ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తాం.

# ట్రాఫిక్ ఆగితే... డ్రోన్ తిరుగుతుంది!

కదిరి : ప్రస్తుతం ఇంటి నుంచి రోడ్డుపైకి వస్తే చాలు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లే. ముఖ్యంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో సమస్య జటిలంగా మారింది. కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయి వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేసి..రాకపోకలు స్తంభించిన ప్రదేశాలను గుర్తించి క్రమబద్ధీకరిస్తున్నారు. కూటమి సర్కారు వచ్చాక పోలీసు శాఖ సాంకేతికంగా బలోపేతం అవుతోంది. రెండు పోలీస్ స్టేషన్లకు కలిపి డ్రోన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ట్రాఫిక్ నియంత్రణతోపాటు బహిరంగంగా మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఉక్కుపాదం మోపుతున్నారు.

**ఉదయం, సాయంత్రం వేళల్లో..**

జిల్లాలో అనంత నగరంతోపాటు తాడిపత్రి, గుంతకల్లులో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ప్రధానంగా నగరంలో ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్య రాకపోకలకు ఆటంకాలు తప్పడం లేదు.

అనంతపురం అర్బన్ పరిధిలోని రద్దీ ప్రాంతాల్లో నాలుగు డ్రోన్లను ఉదయం, సాయంత్రం వేళల్లో ఎగుర వేస్తున్నారు. వాటి ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమాచారాన్ని ఆయా పోలీసుస్టేషన్ల అధికారులకు చేరవేస్తారు. ఇందుకోసం ప్రతి స్టేషను నుంచి ఒకరు శిక్షణ పొందిన ఆపరేటర్ ఉంటారు. అతనికి సాయంగా ఆయా స్టేషన్ల బ్లూకోర్ట్స్ కానిస్టేబుళ్లు అందుబాటులో ఉంటారు.



ట్రాఫిక్ జామ్ ప్రదేశాన్ని గుర్తించి అధికారులకు సమాచారం ఇస్తారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని క్రమబద్ధీకరిస్తున్నారు. నగరంలో సుమారు 20 ట్రాఫిక్ పాయింట్లలో డ్రోన్లను ఎగురవేస్తున్నారు.

తాడిపత్రి, గుంతకల్లులో రెండు చొప్పున డ్రోన్లు వినియోగిస్తున్నారు. తాడిపత్రిలో అర్బన్ పోలీసుస్టేషన్ ఏరియా, మసీదు, యల్లనూరు రోడ్డు కూడలి... గుంతకల్లులో ఆర్టీసీ బస్టాండు, కసాపురం రోడ్లలో డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నారు.

**సైబర్‌సెల్ పర్యవేక్షణ**

జిల్లా కేంద్రంలోని సైబర్‌సెల్ విభాగం డ్రోన్ల నిర్వహణను నిత్యం పర్యవేక్షిస్తోంది. అధిక లోడుతో వెళ్లే వాహనాలు, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లే ఆటోలు, వ్యాన్లను డ్రోన్ ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. మొత్తానికి డ్రోన్ సాంకేతికతతో చక్కటి ఫలితాలు వస్తున్నాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

# కీలక శాఖ.. పోస్టులన్నీ ఖాళీ!



విశాఖ : విద్యాశాఖలో సమగ్ర శిక్షా పథకం కీలకం. ఈ విభాగం కార్యాలయం ద్వారా విద్యాశాఖలోని సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తారు. విద్యాశాఖకు గుండెకాయలాంటి ఈ పథకంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులన్నీ ఖాళీ అవడం గందరగోళానికి దారి తీస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను ఫారిన్ సర్వీసు లేదా డిప్యూటేషన్‌పై సమగ్ర శిక్షాపథకం సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా నియమిస్తారు. వైకాపా ప్రభుత్వం హయాంలో అడ్డదారిలో సెక్టోరియల్ అధికారులను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రీప్యాట్రేషన్ చేశారు. కొత్తగా నియమాకాలకు ప్రకటన జారీ చేశారు. ఇంటర్వ్యూలు నిర్వహించారు. కానీ నియామకాలు జరగలేదు. అందుబాటులో ఉన్న ఉపాధ్యాయలను ఇన్‌ఛార్జులుగా పథకాలు కొనసాగించారు. పాఠశాలలకు వేసవి సెలవులు ఆరంభం కాకముందే ఉన్న అధికారులంతా రిలీవ్ అయ్యారు. కీలక అధికారులు లేనందున కేజీబీవీల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల శిక్షణ, నాడు, నేడు పథకం, విద్యార్థుల కిట్లు, ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూత తదితర పథకాలపై ప్రభావం చూపనుంది.

**ప్రభావం ఇలా..**

సమగ్రశిక్షా పథకంలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) ప్రధానమైనవి. అనంత జిల్లాలో 32 కేజీబీవీలున్నాయి. వాటిపై పర్యవేక్షణకు గర్ల్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (జీసీడీవో) ఉంటారు. జూన్ మాసం నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. కొంత కాలం ఇన్‌ఛార్జిగా నియమించినా ఆమె కూడా వెళ్లిపోయారు.

ప్రత్యేక అవసరాల పిల్లల కోసం భవిత కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వాటి పర్యవేక్షణకు ఐఈడీ కోఆర్డినేటర్ ఉండాలి. ఆ పోస్టు కూడా 8 నెలల నుంచి ఖాళీగా ఉంది. ప్రత్యేక అవసరాల పిల్లలను చేయూత పథకాలు నిర్వహించాలి.

ఏఎంఓ ఒకరు, అసిస్టెంట్ ఏఎంఓలు ఇద్దరు ఉండాలి. ఆ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. విద్యా విషయక కార్యక్రమాలు, ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు, అకడమిక్ కార్యక్రమాలన్నీ నిర్వహించే అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అలెస్కో పోస్టులు 7 నెలల నుంచి ఖాళీగా ఉంది. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం ఆ విభాగం బాధ్యత. వేసవి సెలవుల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలి. కానీ ఆ సీటు ఖాళీగా ఉంది.

సీఎంఓ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులు, బూట్లు, పుస్తకాల సంచి, తదితర వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్లు సరఫరా చేసే బాధ్యత సీఎంఓపై ఉంటుంది. సెలవుల్లో వాటిని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. వాటిని పాఠశాలలకు పంపే బాధ్యత కలిగిన సీఎంఓ పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉంది.

ఏఎస్ఓ పోస్టు అత్యంత కీలకమైనది. సమగ్ర శిక్షా పథకంలో జరిగే కార్యకలాపాల నివేదికలన్నీ ఏఎస్ఓ ఆన్‌లైన్‌లో స్వీకరించి, పైఅధికారులకు చేరవేస్తారు. ఆ పోస్టు కూడా ఇటీవల ఖాళీ అయింది. ఏపీఓ మాత్రమే ఉన్నారు. ఆయన పదవీకాలం కూడా ముగిసిందని రిలీవ్ చేయడానికి రంగం సిద్ధమైంది.

సెలవుల్లో అధికారులు చేరే అవకాశముంది

సెక్టోరియల్ అధికారుల నియామకానికి డిసెంబరులోనే ఇంటర్వ్యూలు జరిగాయి. నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. విద్యా సంవత్సరం మధ్యలో ఎవరినీ చేర్చుకోవద్దని ఆదేశాలు వచ్చాయి. పాఠశాలలకు సెలవులు రావడంతో కొత్త అధికారులు చేరే అవకాశముందని భావిస్తున్నాం.

శైలజ, ఏపీసీ, సమగ్రశిక్షా పథకం

# 'మహా' నిర్లక్ష్యం




విశాఖ : మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలోని వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంది. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బదిలీ అయ్యాక గత మూడు నెలలుగా కొత్త అధికారి నియామకం జరగలేదు. మరోవైపు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి క్యాంపు రాజకీయాలకు వెళ్లడం, తాజాగా కూటమి అభ్యర్థి మేయర్‌గా ఎంపికవ్వడం తెలిసిందే. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను జీవీఎంసీ ఇన్‌ఛార్జిగా నియమించినా పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోయారు. శాశ్వత కమిషనర్ లేకపోవడంతో జోన్ల పరిధిలో పర్యవేక్షణ కరవైంది. కింది స్థాయి సిబ్బంది, గుత్తేదారుల ఇష్టారాజ్యంగా మారింది. **ధర్నాల పేరుతో చెత్త ఎత్తకుండా..:** క్లాప్ పారిశుద్ధ్య సిబ్బంది, డ్రైవర్లు ఎప్పుడు చూసినా ధర్నాలు చేస్తున్నారంటూ చెత్త తరలింపునకు గుత్తేదారు బ్రేక్ వేస్తున్నారు. వాస్తవానికి డ్రైవర్లు రాకపోయినా, సిబ్బంది ధర్నాలో ఉన్నా వేరే వాహనాలు అద్దెకు తీసుకొచ్చైనా చెత్తను తరలించాల్సిన బాధ్యత గుత్తేదారుదే. ప్రధాన కాంట్రాక్టరు ఎక్కడో ఉంటూ, మేస్త్రిలతో ఇక్కడ కథ నడిపిస్తూ మమ అనిపిస్తున్నారు. తాజాగా ఎన్నికైన కూటమి మేయర్ పీలా శ్రీనివాసరావు చెత్త సేనకరణ, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది. **వాహనాల జాడేది?:** ఒక క్లాప్ వాహనం రోజుకు 30 కి.మీ తిరగాలి. లేదా మూడుసార్లు వ్యర్థాలను వార్డుల్లో సేకరించి చెత్త కేంద్రానికి తరలించాల్సి ఉంటుంది. చెత్త సేకరణ కేంద్రంలోని సిబ్బంది, క్లాప్ వాహనాల డ్రైవర్లు కుమ్మక్కవుతున్నారన్న విమర్శలున్నాయి. పది, పన్నెండు కి.మీ మాత్రమే తిరుగుతూ వాహనాల్లో పెట్రోలు తీసి బయట అమ్మేస్తున్నారు. 'లోహి' అనే కంపెనీ 78 చెత్త సేకరణ ఆటోలు జీవీఎంసీ పరిధిలో పనిచేస్తున్నట్లు చూపిస్తున్నారు. అయితే వాటి జాడే కనిపించడం లేదన్న ఫిర్యాదులున్నాయి. ఏటా జీవీఎంసీ ఈ గుత్తేదారుకు రూ.3కోట్లు చెల్లిస్తుండటం గమనార్హం.

**పర్యవేక్షణ పడకేసి పైసా వసూల్**

క్లీన్ ఆంధ్రప్రదేశ్ పథకంలో భాగంగా క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరణ చేస్తున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పర్యవేక్షణ చేయాలి. వీరిపై వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, ఆపై సహాయ వైద్యాధికారులు పర్యవేక్షించాలి. ఈ బాధ్యతలు చూడాల్సిన అధికారులు బయటకు అడుగు పెట్టడం లేదు. దీంతో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడి చెత్త అక్కడే వదిలేస్తున్నారు. 'గతంలో చెత్త పన్ను చెల్లించేవారుగా.. అందులో సగం ఇవ్వండి, సకాలంలో చెత్త ఎత్తుతాం' అంటూ కొందరు క్లాప్ వాహనాల వెంట వెళ్లే సిబ్బంది ప్రజలతో బేరసారాలకు దిగుతున్నారు.

# కార్డుదారుల ప'రేషన్'

ఉరవకొండ : రేషన్ సరకుల కోసం కార్డుదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. మండే ఎండలో వరుసలో నిల్చొలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉరవకొండ మండలంలో 64 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో 230,40 కార్డులు ఉన్నాయి. వాటిలో 69,273 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ 3,465 క్వింటాళ్ల బియ్యాన్ని కేటాయించారు. ఇక ఎండీయూలు 13 ఉన్నాయి. ఉరవకొండ పట్టణంలో 24 దుకాణాలు ఉండగా, 8,931 కార్డులు ఉన్నాయి. అవన్నీ 6 ఎండీయూల పరిధిలోకి వస్తాయి. ఎక్కడా దుకాణాలు సరిగా తెరుచుకోవడం లేదు. రోజుకు నాలుగైదు దుకాణాలు తెరుచుకుంటుండగా, కార్డుదారులు బారులు తీరుతున్నారు. బియ్యం దొరుకుతాయో లేదోనన్న ఆందోళనతో గంటల కొద్ది పడిగాపులు కాస్తున్నారు. కొన్ని చోట్ల వేకువజామున 4 గంటలకే దుకాణాల వద్ద వేచి ఉంటున్నారు. డీలర్లు ఇష్టమొచ్చినప్పుడు తెరుస్తుండటంతో మండుతున్న ఎండల్లో లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. వృద్ధులు, దివ్యాంగుల




పరిస్థితి దారుణంగా ఉంది. ఈ విషయమై తహసీల్దార్ మహబూబ్‌బాషా వివరణ కోరగా రేషన్ దుకాణాల్లో 18వ తేదీ వరకు నిత్యావసరాల పంపిణీ ఉంటుంది. కార్డుదారులు ఆందోళన చెందాల్సిన పని లేదు. వేసవిని దృష్టిలో ఉంచుకుని దుకాణాలను ఉదయమే తెరిచేలా చర్యలు చేపడతామన్నారు.

# దోచుకున్నా.. దాచేస్తున్నారు!

తిరుపతి : చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లిలో ఆప్షన్-3 కింద 713 ఇళ్లను గుత్తేదారు నిర్మించాల్సి ఉండగా.. గృహ నిర్మాణ సంస్థలోని ఓ డీఈఈ.. అతని భార్య, తల్లి పేరిట పనులు దక్కించుకున్నారు. ఇదేవిధంగా రేణిగుంట మండలం జీపాళ్యం, వడమాలపేట మండలం కల్లూరులోనూ ఆ సంస్థ సిబ్బందే పనులు చేశారు. నిబంధనలు ఉల్లంఘించారని విజిలెన్స్ అధికారులు గుర్తించినా ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు.

పుంగనూరు నియోజకవర్గంలోనూ గతంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన ఇళ్లకు వైకాపా హయాంలో బిల్లులు చేసుకున్నారు. ఇది వాస్తవమేనని జగన్ పాలనలోనే గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సంస్థ అధికారులు, విజిలెన్స్ బృందాలు నిర్ధారించినా బాధ్యులపై చర్యలు లేవు.

వైకాపా హయాంలో గృహ నిర్మాణ సంస్థలో అవినీతి రాజ్యమేలింది. కొందరు అధికారులు, ఆ పార్టీ నాయకులు నిబంధనలకు యథేచ్ఛగా తూట్లు పొడిచారని ఆనాడే అక్రమాలన్నీ వెలుగు చూసినా ఉన్నతాధికారుల వరకు అంతా చోద్యం చూశారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత అప్పటి బాగోతాలపై విజిలెన్స్ యంత్రాంగం విచారణ జరిపింది. అక్రమాలు నిజమేనని తేల్చింది. అయితే ఆ నివేదికలను ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేయడంపై విస్మయం



వ్యక్తమవుతోంది. బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు నిధులు రాబడితే భవిష్యత్తులో తప్పులు చేయాలంటే ఎవరైనా భయపడతారు. సొంతంగా ఇల్లు కట్టుకోలేని పేదలకు గృహాలు నిర్మించేందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి వైకాపా ప్రభుత్వం టెండర్లు పిలిచింది. వీటిని ఆప్షన్- 3 ఇళ్లుగా పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో 16,393 గృహాలున్నాయి. వాస్తవంగా ఇవి గుత్తేదారులు కట్టాలి. ఇందుకు భిన్నంగా 2,180 ఇళ్లను గృహ నిర్మాణ సంస్థలోని ఇద్దరు డీఈఈలు, వార్డు సచివాలయ ఉద్యోగి, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒకరు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. మొత్తంగా రూ.12.05 కోట్లు వారికి బిల్లుల రూపేణా చెల్లించారు. సిమెంట్, స్టీల్, నిర్మాణ సామగ్రి పేరుతో మరో రూ.4.04 కోట్లు.. వెరసి రూ.16.09 కోట్లు సమర్పించారు.

**ప్రారంభంలో హడావుడి చేసి**

ఈ బాగోతంపై రెండు నెలల క్రితం గృహ నిర్మాణ సంస్థలోని విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. అంతకుముందు కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే రాష్ట్ర విజిలెన్స్ యంత్రాంగం సైతం ఆప్షన్-3 గృహాల నాణ్యత, చెల్లింపుల గురించి ఆరా తీసింది. బాధ్యులెవరో గుర్తించి క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. ప్రజాధనం ఎంత దుర్వినియోగమైందో స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఆ నివేదిక ప్రకారం ఎవరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.


రోజుల వ్యవధిలోనే పూర్తయ్యాయంటూ..: పుంగనూరు నియోజకవర్గంలో అవినీతి కొత్త పుంతలు తొక్కింది. 2014- 19 మధ్య తెదేపా హయాంలో నిర్మించిన, అర్ధంతరంగా ఆగిపోయిన గృహాలకు కూడా ఇక్కడ బిల్లులు చేశారు. రోజుల వ్యవధిలోనే గోడల దశ నుంచి ఇంటి నిర్మాణం పూర్తయిందంటూ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారు. అధికారులు, సిబ్బంది వాటాలు తీసుకొని వైకాపా అనుకూల వ్యక్తుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. దీనిపై సైతం ప్రభుత్వానికి నివేదిక అందింది. ఇదే తరహాలో వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ కాలనీలోనూ రూ.13.75 లక్షల అవినీతి జరిగిందని తేటతెల్లమైంది. 53 ఇళ్లు పూర్తి చేయకుండానే పూర్తి బిల్లులు చెల్లించేశారు.

**ఏ అవకాశాన్ని వదలకుండా దోచి..**

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2020 డిసెంబరులో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద గృహాలు మంజూరు చేశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ రెండు వ్యవహారాల్లోనూ అవినీతి జరిగింది. వీటితోపాటు స్థలాల కొనుగోలు, చదునులోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు వెదురుకుప్పం మండలంలోని కొండ కింద ఉన్న ఓ లే అవుట్‌ను చదును చేసేందుకు రూ.80 లక్షలు ఖర్చు చేశారు. ఇదే ఖర్చుతో అనువైన ప్రాంతంలో మంచి స్థలం కొనుగోలు చేయవచ్చని తెలిసినా ఆ దిశగా అడుగులు పడలేదు. ఇలా అడుగడుగునా వైకాపా నేతలు ప్రభుత్వ సొమ్మును దోచేశారు. సందట్లో సడేమియా అన్నట్టు పలువురు అధికారులు సైతం చేతివాటం ప్రదర్శించారు.

# ఇంతెందుకు.. తగ్గిద్దాం!

తిరుపతి : తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాల స్థానం లో శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల నిర్మాణాలకు వైకాపా హయాంలో ఏకకాలంలో రూ.600 కోట్లకు టెండర్లు ఖరారు చేయడాన్ని విజిలెన్స్ విభాగం గతేడాది ఇచ్చిన నివేదికలో తప్పు పట్టింది. ఎక్కువ కొటేషన్ల టెండర్లు ఆమోదించారని పేర్కొంది. తితిదే గణాంక అధికారి, ఇంజినీరింగ్ విభాగం ఏకకాలంలో రూ.300 కోట్లు అచ్యుతం, రూ.300 కోట్లు శ్రీపాదం వసతి భవనాలకు అనుమతులు ఇవ్వడంలో గత పాలకుల అవినీతి మరకలు ఉన్నాయంటూ నివేదిక సమర్పించింది. ఈ విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.ఈ రెండు సముదాయాల పనులు 2024 మార్చి 15 నుంచి ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు వసతి కేంద్రాలకు సంబంధించి రూ.300 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు వసతి




గృహాలకు సంబంధించి నిర్మాణ వ్యయం తగ్గించే అవకాశాలు ఉన్నాయంటూ ఇటీవల జరిగిన తితిదే పాలక మండలి సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో కొన్ని అంశాల్లో వ్యయం తగ్గించేందుకు ఇంజినీరింగ్ విభాగం నివేదికలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

**సదుపాయాలు ఇలా..**శ్రీపాదం, అచ్యుతం తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు ఉంటాయి. ఒకటో అంతస్తులో పార్కింగ్, 2వ అంతస్తులో రిసెప్షన్, అన్నదాన కేంద్రం ఉంటాయి. 3, 4 అంతస్తుల్లో 48 డార్మెటరీలు, 5 నుంచి 9 అంతస్తుల్లో 532 గదులు నిర్మిస్తున్నారు.

# సమంత కాస్త స్పీడ్ పెంచాల్సిందే..?

సిటాడెల్ తో బాలీవుడ్ ఆడియన్స్ కి మరింత దగ్గరైంది సౌత్ స్టార్ హీరోయిన్ సమంత. తెలుగులో ఈమధ్యనే శుభం సినిమాలో సర్ ప్రైజ్ చేసింది. ఈ సినిమా ఆమె సొంత నిర్మాణంలో రావడం విశేషం. సమంత నెక్స్ట్ మా ఇంటి బంగారం సినిమాతో వస్తుంది. ఐతే సమంత నెక్స్ట్ సినిమాల విషయంలో దూకుడు చూపించట్లేదు. ఆమె చేస్తున్న సినిమాల గురించి ఫ్యాన్స్ ఆసక్తి చూపిస్తుండగా అమ్మడు మాత్రం చాలా లేట్ చేస్తుంది. సమంత నెక్స్ట్ బాలీవుడ్ లో ఒక క్రేజీ ప్రాజెక్ట్ చేయబోతుందని తెలుస్తుంది. ఐతే ఆ మూవీకి సంబందించిన డీటైల్స్ బయటకు రాలేదు. సౌత్ సినిమాల విషయంలో ముఖ్యంగా తెలుగు సినిమాల విషయంలో సమంత ఆచి తూచి అడుగులేస్తుందని అర్థమవుతుంది. కమర్షియల్ సినిమాల్లో ఆమె చేస్తా అంటే ఛాన్స్ లు వస్తాయి కానీ ఎలాంటి సినిమా పడితే అలాంటి సినిమా చేయకూడదని అనుకుంటుంది. తెలుగులో ఖుషి సినిమా తర్వాత అంతగా ఇంప్రెస్



చేసిన సినిమా అయితే రాలేదు. అందుకే సమంత సినిమా చేయడానికి సుముఖంగా లేదు. మరోపక్క బాలీవుడ్ లో మాత్రం వరుస ప్రాజెక్ట్ లు చేసేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తుందట సమంత. సౌత్ సినిమాల కన్నా హిందీలో ప్రాజెక్ట్ లు చేయడం బెటర్ అని ఫిక్స్ అయినట్టు ఉంది సమంత. బాలీవుడ్ సీరీస్ లకు సమంత బెటర్ ఆప్షన్ అయ్యింది. ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్ ఇలా రెండు సీరీస్ లతో తన సత్తా చాటింది. కేవలం సీరీస్ లు మాత్రమే కాదు అక్కడ సినిమాలు కూడా చేయాలని ఆమె ఫ్యాన్స్ కోరుతున్నారు. మొన్నటిదాకా టాలీవుడ్ లో స్టార్ హీరోలతో నటించిన సమంత అలా చేస్తూ కూడా లేడీ ఓరియెంటెడ్ కథలు చేస్తూ వచ్చింది. ఐతే తెలుగులో మళ్లీ తిరిగి వరుస సినిమాలు చేస్తే చూడాలని సమంత ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఐతే తప్పకుండా సమంతకు నచ్చే ఛాన్స్ లు వస్తే మాత్రం ఆ అవకాశాన్ని అసలు వదులుకోదనిపిస్తుంది. శుభం తో నిర్మాతగా తొలి అడుగు వేసిన సమంత నటిగానే కాదు నిర్మాతగా కూడా సినిమాలు కొనసాగించాలని చూస్తుంది. స్టార్ డైరెక్టర్స్ అందరికీ సమంత టాలెంట్ తెలుసు కాబట్టి వాళ్లే ఆమెను దృష్టిలో ఉంచుకుని పాత్రలు రాయాల్సి ఉంటుంది.

# టాలీవుడ్ లో టాపే కానీ అక్కడ మాత్రం..?

కన్నడ భామ రష్మిక మందన్న ప్రస్తుతం పాన్ ఇండియా లెవెల్ లో అదరగొట్టేస్తుంది. తెరకు పరిచమైంది కన్నడ పరిశ్రమ నుంచే అయినా రష్మికకు ఈ స్టార్ ఇమేజ్ వచ్చేలా చేసింది మాత్రం తెలుగు పరిశ్రమే అని తెలిసిందే. ఛలో సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రష్మిక ఆ సినిమా నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ స్టార్ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో టాప్ రేంజ్ కి వెళ్లిన అమ్మడు అదే క్రేజ్ తో బాలీవుడ్ ఆఫర్లను అందుకుంది. రష్మిక బాలీవుడ్ ఎంట్రీ మొదటి రెండు సినిమాలు సోసోగానే ఆడిన ఆ తర్వాత మాత్రం హిట్లు సూపర్ హిట్లతో స్టార్ తిరిగింది. బాలీవుడ్ సినిమాలు సైతం ఇప్పుడు రష్మికని హీరోయిన్ గా తీసుకోవాలని పోటీ పడుతున్నారు. బాలీవుడ్, టాలీవుడ్ లో రష్మిక టాప్ లీగ్ లో కొనసాగుతుంది. ఐతే తమిళంలో మాత్రం రష్మిక ఆశించిన క్రేజ్ తెచ్చుకోలేదు. అక్కడ ఆల్రెడీ స్టార్ హీరోయిన్స్ ఉన్నారు. అయినా కూడా రష్మిక విజయ్, కార్తి లాంటి వళ్లతో




నటించింది. అయినా కూడా అక్కడ రష్మికకి అంత ఫ్యాన్ బేస్ ఏర్పడలేదు. నేషనల్ క్రష్ అంటూ ఇటు టాలీవుడ్, అటు బాలీవుడ్ సైతం రష్మిక వెంట పడుతుంటే తమిళ పరిశ్రమలో ఆమెను పెద్దగా పట్టించుకోలేదు. ఐతే కోలీవుడ్ మీద దృష్టి పెట్టే టైం లో బాలీవుడ్ నుంచి వరుస ఆఫర్లు రావడంతో తన ఫోకస్ అటు షిఫ్ట్ చేసింది రష్మిక. బీ టౌన్ ఆడియన్స్ కి రష్మిక తెగ నచ్చేసింది.

నటన, గ్లామర్ ఇలా దేనికదే ఎంత కావాలంటే అంత ఇచ్చేస్తూ వస్తున్న రష్మిక టాప్ రేంజ్ కి వెళ్లడంలో తన సత్తా చాటుతుంది. ప్రస్తుతం అమ్మడు తెలుగులో కుబేర, ది గర్ల్ ఫ్రెండ్ సినిమాలు చేస్తుంది. ఈ సినిమాలతో పాటు హిందీలో మరో రెండు సినిమాల డిస్కషన్స్ ఉన్నాయట. త్వరలో వాటి అనౌన్స్ మెంట్ వస్తుందని తెలుస్తుంది. రష్మిక నెక్స్ట్ విజయ్ దేవరకొండ సినిమాలో కూడా టాక్ నడుస్తుంది. ఈ ఇద్దరు జోడీ కడితే మాత్రం ఆ లెక్క వేరేలా ఉంటుందని ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు. ఆ సినిమా విశేషాలు ఏంటన్నది త్వరలో బయటకు రానున్నాయి. రష్మిక చేస్తున్న సినిమాలు ప్లానింగ్ లో ఉన్న ప్రాజెక్ట్ లు ఇవన్నీ కూడా మళ్లీ ఆమెను బాక్సాఫీస్ క్వీన్ గా మార్చే ఛాన్స్ ఉన్నట్టుగానే అనిపిస్తుంది.




# బాబోయ్ సూపర్ స్టార్ సినిమా వస్తుందిరోయ్...!



సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్' సినిమాతో చాలా కాలం తర్వాత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. జైలర్ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఆయన ముఖ్య పాత్రలో నటించిన 'లాల్ సలామ్' సినిమాకు విపరీతమైన బజ్ క్రియేట్ అయింది. ఆ సినిమాకు రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వం వహించారు. వందల కోట్ల బడ్జెట్‌తో రూపొందిన లాల్ సలామ్ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. రజనీకాంత్ పాత్ర అవసరం లేకున్నా పెంచారు అంటూ చాలా మంది విమర్శలు చేశారు, అదే సమయంలో రజనీకాంత్ క్రేజ్‌తో సినిమాను అమ్ముకోవాలనే ఉద్దేశంతో ఆయన పాత్రను అనవసరంగా పెంచారు అనేది చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. లాల్ సలామ్ సినిమా థియేట్రికల్ రిలీజ్ తర్వాత రజనీకాంత్ ఫ్యాన్స్ స్వయంగా ఈ సినిమా చూడొద్దు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు అంటూ వార్తలు వచ్చాయి. రజనీకాంత్ పరువు తీసే విధంగా ఐశ్వర్య ఈ సినిమాను రూపొందించారు. ఇలాంటి కథకు, ఇలాంటి మేకింగ్‌కు రజనీ సర్ ఎలా ఓకే చెప్పారో అర్థం కాలేదు అంటూ చాలా మంది సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రజనీకాంత్ వంటి సూపర్ స్టార్ చేయాల్సిన కథ కాదు, ఆయన స్థాయికి తగ్గట్లుగా స్క్రిన్‌ప్లే లేదు అంటూ విమర్శలు వచ్చాయి. లాల్ సలామ్ సినిమాకు వచ్చిన బజ్ నేపథ్యంలో ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ రైట్స్‌ను భారీ మొత్తానికి కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. సినిమా మేకింగ్ దశలోనే నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమాను కొనుగోలు చేసింది. సినిమా డిజాస్టర్ కావడంతో నెట్‌ఫ్లిక్స్ సినిమాను వదిలించుకునేందుకు ప్రయత్నాలు చేసింది. అంతే కాకుండా ఈ సినిమాను రీ ఎడిట్ చేసి నెట్‌ఫ్లిక్స్‌కు ఇవ్వాలనే ఉద్దేశంతో కొన్ని సీన్స్‌ను ఐశ్వర్య తొలగించారు అనే ప్రచారం జరిగింది. అదే అదునుగా నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమాను స్ట్రీమింగ్ చేసేందుకు తిరస్కరించింది. సుదీర్ఘ కాలంగా ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ కు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. లైకా వారు ఈ సినిమా ఓటీటీ రైట్స్ నెట్‌ఫ్లిక్స్‌కు అమ్మినా స్ట్రీమింగ్ మాత్రం కాలేదు. చెప్పినట్లుగా కాకుండా మరో రకంగా సినిమాను రూపొందించిన కారణంగా ఒప్పందం రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులు లైకా వారితో చెప్పినట్లు తెలుస్తోంది. లాల్ సలామ్ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ రైట్స్ ను నెట్‌ఫ్లిక్స్ కొనుగోలు చేసి వెనక్కి తగ్గడంతో ఇప్పుడు ఆ రైట్స్‌ను సన్ నెక్ట్స్ దక్కించుకున్నట్లు అధికారిక ప్రకటన వచ్చింది. జూన్ 7వ తారీకున ఈ సినిమాను సన్ నెక్ట్స్ ఓటీటీ స్ట్రీమింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. థియేట్రికల్ రిలీజ్ అయిన దాదాపు ఏడాదిన్నర తర్వాత ఈ సినిమాను ఓటీటీలో తీసుకు రాబోతున్నారు. థియేట్రికల్ రిలీజ్ డిజాస్టర్ కావడంతో లాల్ సలామ్ సినిమాను చాలా మంది ఓటీటీలో తీసుకు రాకపోవడం మంచిదని భావించారు. ముఖ్యంగా రజనీకాంత్ అభిమానులు లాల్ సలామ్ సినిమా ఓటీటీలో వస్తే రజనీ సర్‌తో పాటు ఐశ్వర్య మళ్లీ విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే లాల్ సలామ్ ఓటీటీ స్ట్రీమింగ్ అప్‌డేట్ రాగానే బాబోయ్ సూపర్ స్టార్ సినిమా వస్తుందా అంటూ చాలా మంది షాక్ అవుతున్నారు. ఓటీటీ స్ట్రీమింగ్ తో ఈ సినిమాకు ఎలాంటి స్పందన దక్కుతుంది అనేది చూడాలి. లాల్ సలామ్ సినిమాలో రజనీకాంత్‌తో పాటు వివేక్ ప్రసన్న, విష్ణు విశాల్, విక్రాంత్, సెంథిల్‌లు ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు ఏ ఆర్ రెహమాన్ సంగీతాన్ని అందించడం విశేషం.

# జాన్వీ కొత్త మూవీ.. సౌత్ వాళ్ళకి నచ్చలేదా?



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్.. వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. అందం, అభినయంతో ఆకట్టుకుంటూ భాషతో సంబంధం లేకుండా మంచి అవకాశాలు అందుకుంటున్నారు. ఇప్పుడు బీ టౌన్ స్టార్ హీరోతో కలిసి సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ పరమ్ సుందరి మూవీ చేస్తున్నారు. దాస్వి ఫేమ్ తుషార్ జలోటా దర్శకత్వం వహిస్తుండగా.. మడాక్ ఫిల్మ్స్ పై దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. రాజీవ్ ఖండేల్వాల్, ఆకాష్ దహియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నార్త్ ఇండియాకు చెందిన పరమ్ (సిద్ధార్థ్), సౌత్ ఇండియాకు చెందిన సుందరి (జాన్వీ) మధ్య ప్రేమకథగా సాగనున్న మూవీ జులై 25వ తేదీన రిలీజ్ కానుంది. అయితే మూవీ ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్.. రీసెంట్ గా ఫస్ట్ లుక్ టీజర్ ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. హీరో హీరోయిన్లను పరిచయం చేస్తూ స్టార్ట్ అవ్వగా.. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. టీజర్ చివర్లో జాన్వీ కత్తితో కనిపించి షాక్ ఇచ్చింది. బ్యాక్ గ్రౌండ్ లో సోను నిగమ్ ఆలపించిన సాంగ్ హైలైట్ గా నిలిచింది. కేరళలోని అందమైన బ్యాక్ వాటర్స్, హౌస్ బోట్ ల నేపథ్యం మాత్రం అద్భుతంగా ఉందని చెప్పాలి. ఓవరాల్ గా గ్లింప్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. డీసెంట్ గా బాగుందని అనేక మంది నెటిజన్లు కొనియాడారు. కానీ ఇప్పుడు ఫస్ట్ లుక్ టీజర్ రిలీజ్ అయ్యాక కొందరు సౌత్ మూవీ లవర్స్ మాత్రం సోషల్ మీడియాలో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సినిమాలో జాన్వీ కపూర్ రోల్ డిజైన్ చేసిన తీరును విమర్శిస్తున్నారు. ఎప్పుడూ సౌత్ అమ్మాయిలను ఒకేలా చూపిస్తున్నారని అంటున్నారు. మీనాక్షి సుందరేశ్వర్, చెన్నై ఎక్స్ ప్రెస్ వంటి చిత్రాల్లో కూడా దక్షిణ భారత మహిళలను ఒకే విధంగా చిత్రీకరించారని, దీపికా పదుకొనే సాన్య మల్హోత్రా రోల్స్ ఒకే విధంగా ఉంటాయని చెబుతున్నారు.

సంస్కృతి గురించి కాదని, ప్రాతినిధ్యంలో వైవిధ్యం లేకపోవడం గురించి తమ బాధ అని చెబుతున్నారు. దక్షిణ భారత సంస్కృతి గొప్పది, వైవిధ్యమైనదని, అయినప్పటికీ సేమ్ క్యారెక్టరైజేషన్ ను మళ్లీ మళ్లీ ఉపయోగిస్తున్నారని అంటున్నారు. మరోవైపు, కేవలం ఒక చిన్న టీజర్ తో కామెంట్ చేయొద్దని, మూవీ వచ్చాక చూడాలని చెబుతున్నారు. మొత్తానికి పరమ్ సుందరి మూవీ హాట్ టాపిక్ గా మారింది.

# నవీన్ పొలిశెట్టి పరుగెత్తాల్సిందే..!

టాలీవుడ్ యువ హీరోల్లో మోస్ట్ టాలెంటెడ్ గా ఉన్న నవీన్ పొలిశెట్టి కొత్త కథలతో ఎప్పటికప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించే సినిమాలతో వస్తున్నాడు. హీరోగా మొదటి ప్రయత్నమే ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ అంటూ అదిరిపోయే సినిమా చేసిన నవీన్ పొలిశెట్టి జాతిరత్నాలు సినిమాతో సెన్సేషనల్ హిట్ అందుకున్నాడు. ఆ తర్వాత మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి కూడా ఆడియన్స్ ని మెప్పించింది. ప్రస్తుతం నవీన్ పొలిశెట్టి అనగనగా ఒక రాజు సినిమా చేస్తున్నాడు. ఆ సినిమాను 2026 సంక్రాంతికి రిలీజ్ టార్గెట్ పెట్టారు. నవీన్ తో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తుంది. నవీన్ పొలిశెట్టి సినిమా అంటే సూపర్ ఎంటర్టైన్మెంట్ పక్కా అనే విధంగా క్రేజ్ తెచ్చుకున్నాడు. టికెట్ కొని థియేటర్ కి వచ్చే ఆడియన్స్ ని ఫుల్ ఎంటర్టైన్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు నవీన్ పొలిశెట్టి. ఇతే సినిమాలైతే చేస్తున్నాడు కానీ



వాటి మధ్య గ్యాప్ మాత్రం చలా ఉంటుంది. దాన్ని కచ్చితంగా నవీన్ పొలిశెట్టి సరిచేసుకోవాల్సిందే. నవీన్ పొలిశెట్టి అనగనగా ఒక రాజు కూడా చాలా రోజులుగా సెట్స్ మీద ఉంది. ఆ సినిమా కూడా రిలీజ్ అవ్వడానికి ఇంకా 8 నెలలు దాకా ఉంది. అప్పటిదాకా ఆ సినిమానే చేస్తూ ఉండాలి. ఒకవేళ వేరే సినిమా కమిట్ అయినా అనగనగా ఒక రాజు సినిమా వచ్చిన తర్వాతే ఆ సినిమా రిలీజ్ ఉంటుంది. యువ హీరోలంతా కూడా సినిమాను 3, 4 నెలల్లో పూర్తి చేసి ఏడాదికి ఒకటి రెండు సినిమాలు రిలీజ్ చేస్తుంటే నవీన్ ఆ విషయంలో వెనకపడుతున్నాడు. ఐతే మధ్యలో నవీన్ కి ఒక యాక్సిడెంట్ అవ్వడం వల్ల ఇలా గ్యాప్ వచ్చింది కానీ ఇక మీదట అలాంటి గ్యాప్ ఉండదని అంటున్నారు. అనగనగా ఒక రాజు తర్వాత నవీన్ పొలిశెట్టి చేయబోయే సినిమా ఏంటన్నది కూడా క్లారిటీ రాలేదు. ఆ కాంబినేషన్ ఏదో త్వరగా సెట్ చేసుకుని నవీన్ కాస్త దూకుడు పెంచితే అతన్ని ఎంకరేజ్ చేయడానికి ఆడియన్స్ అంతా కూడా సిద్ధంగా ఉన్నారు. నవీన్ సినిమాలు చాలా సరదాగా ఉంటాయి. ఎంటర్టైనర్స్ తో అలరిస్తున్న నవీన్ ఏదో ఒకరోజు మాస్ టర్న్ కూడా తీసుకుంటే చూడాలని కూడా అతని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# కమల్ తో లిప్ లాక్ సీన్.. అభిరామి ఇష్టంతోనే చేసిందట!

దిగ్గజ నటుడు కమల్ హాసన్, ప్రముఖ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్ లో థగ్ లైఫ్ మూవీ రూపొందిన విషయం తెలిసిందే. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన ట్రైలర్ ను మంచి రెస్పాన్స్ వచ్చింది. కానీ కమల్, నటి అభిరామి మధ్య లిప్ లాక్ సీన్ హాట్ టాపిక్ గా మారింది. ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అయ్యారు. కొందరు సినిమాను సినిమా లాగా చూడాలని కామెంట్ చేయగా.. మరికొందరు 70 ఏళ్ల కమల్ హాసన్.. తనకంటే వయసులో ఎంతో చిన్న అయిన అభిరామితో ఘాటు లిప్ లాక్ సీన్ చేయడంపై విమర్శించారు. దీనిపై ఇప్పుడు అభిరామి రెస్పాండ్ అయ్యారు. ఆ సీన్ 3 సెకన్లను అని, అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. "నేను దర్శకుడు మణిరత్నం గారు ఆ రోల్ లో నన్ను ఎందుకు తీసుకున్నారని అడిగాను. నా చిత్రనిర్మాతల నిర్ణయాలను నేను ఎల్లప్పుడూ గౌరవిస్తాను. నేను ఆ సన్నివేశాన్ని ఇష్టపూర్వకంగా చేశాను. ఇది కేవలం మూడు షాట్లలోనే కనిపిస్తుంది.



ఆ చిన్న క్లిప్ కారణంగా చాలా అపార్థాలు వచ్చాయి" అని అభిరామి తెలిపారు. "కిస్ సీన్ వెనుక మణి సర్ లాజిక్ ను నేను జడ్జ్ చేయడం లేదు. ఆయన లాజిక్ తో నేను ఏకీభవిస్తాను. పూర్తి సినిమా చూసిన తర్వాత అభిప్రాయాలు మారుతాయని నేను నమ్ముతున్నాను. విడుదల తర్వాత ఈ అంశం కొనసాగుతుందని నేను అనుకోను.

దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు" అని చెప్పారు.. అందుకే కామెంట్ చేసే ముందు అందరూ సినిమా చూడాలని తాను కోరుతున్నట్లు తెలిపారు అభిరామి. అనవసరంగా దీనిపై రాద్ధాంతం చేస్తున్నారని, అసలెందుకు అలా చేస్తున్నారో నిజంగా తనకు తెలియడం లేదని అభిప్రాయపడ్డారు. ఏ మూవీకి అయినా కలిసొచ్చేదే మార్కెటింగ్ టీమ్ చేస్తుందని తెలుసని చెప్పారు. అయితే కమల్ సార్ ఎప్పుడు ఎలాంటి సీన్లు చేసినా వాటిపై ఎవరో ఒకరు ఏదో ఒకటి అంటూనే ఉంటారని అభిరామి అన్నారు. అలా అని మిగతా వాళ్లు ఇలాంటి సీన్లు చేయరని కాదు, కానీ ఓ టాప్ యాక్టర్ చేస్తే దాని గురించి మాట్లాడుకుంటారని చెప్పారు. ఇది ప్రస్తుత రోజుల్లో కామన్ అయినా.. కొద్ది రోజుల తర్వాత ప్రేక్షకులు కూడా అప్ గ్రేడ్ అవుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536